ఏడుగురు పాక్ ఉగ్రవాదులపై నిషేధం

న్యూఢిల్లీ : ఉగ్రవాదులకు నిధులను సమకూర్చుతూ, జమ్మూ-కశ్మీరులో దాడులకు పాల్పడుతున్నందుకు ఏడుగురు పాకిస్థానీ ఉగ్రవాదులపై భారత ప్రభుత్వం నిషేధం విధించింది. చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం ప్రకారం వీరిపై కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ ఈ చర్యలను చేపట్టింది. జమ్మూ-కశ్మీరు సీఐడీ సిఫారసు మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. పాకిస్థాన్‌కు చెందిన సజ్జాద్ గుల్, అషిక్ అహ్మద్ నెంగ్రూ, ముష్తాక్ అహ్మద్ జర్గార్ (లట్రమ్), అర్జుమండ్ గుల్జార్ జాన్ (హంజా బుర్హాన్), అలీ కషిఫ్ జన్, మొహియుద్దీన్ ఔరంగజేబ్ అలంగిర్, హఫీజ్ టల్హా సయీద్‌లపై కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ నిషేధం విధించింది. చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం ప్రకారం మొత్తం మీద 38 మంది పాకిస్థానీ ఉగ్రవాదులపై నిషేధం విధించింది.

Rni Title Code No. TELTEL02115

గరుడ వార్త

తెలుగు దినపత్రిక

పరీక్షలకు యూనిఫాం తప్పనిసరి.. హిజాబ్‌కు అనుమతి లేదు

బెంగళూరు: ద్వితీయ పీయూసీ పరీక్షలు ఈనెల 22 నుంచి ప్రారంభం కానున్నాయని వీటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రాథమిక విద్యాశాఖ మంత్రి బీ సీ నాగేశ్ వెల్లడించారు. సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ హిజాబ్‌తోపాటు ఎలాంటి ధార్మిక వస్త్రధారణకు అనుమతినిచ్చే ప్రశ్నే లేదన్నారు. ఆయా కళాశాలలు నిర్ధారించిన యూనిఫాంను ధరించి పరీక్షలకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. ఈనెల 22న ప్రారంభమయ్యే ద్వితీయ పీయూ పరీక్షలు మే 18 వరకు జరుగుతాయన్నారు. మొత్తం 6,84,255 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. వీరిలో 3,46,936 మంది బాలురు కాగా 3,37,319 మంది బాలికలు ఉన్నారన్నారు. బెంగళూరు సహా రాష్ట్ర వ్యాప్తంగా 1076 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు

సంపుటి : 1 సంచిక : 72 మేడ్చల్ మల్కాజ్‌గిరి 4 ఏప్రిల్ 2023 మంగళవారం పేజీలు : 4

'బండి'కి 'గడ్డు' కాలం

కలిసిరాని 'క్యాడర్'



'ప్రభ' కోల్పోతున్న సంజయుడు

సొంత పార్టీ నేతల నుండే మద్దతు కరువవుతోందా...!?

హైదరాబాద్ : బండెనక బండి కట్టి.. పదహారు బండ్లు కట్టి.. అనే పాట తెలగాణ మాగాణంలో ప్రతి గడపలోనూ వినిపించిన విషయం తెలిసిందే. ఒక్కరు పదం కట్టి కదం తొక్కితే.. వారిని అనుసరించి ఊళ్లకు ఊళ్లు ముందుకు కదిలిన సందర్భం.. నైజాం నిరంకుశ పాలనపై విప్లవం సాగించిన సందర్భం.. ఇంకా తెలంగాణ ప్రజల కళ్ల ముందు కనిపిస్తూనే ఉంది. అయితే.. మళ్లీ ఈ తరహా ఉద్యమాన్ని తీసుకువస్తామని.. నియంతగా ప్రజలను పీక్కుతింటున్న కేసీఆర్ కుటుంబ పాలనపై సమర శంఖం పూరిస్తామని.. తరచుగా చెబుతున్న బీజేపీ రాష్ట్ర చీఫ్ బండి..సంజయ్ రాను రాను.. తన ప్రభ కోల్పోతున్నారనే వాదన బలంగా వినిపిస్తుండడం గమనార్హం. వాస్తవానికి బండి సంజయ్ రాష్ట్ర కమలం పార్టీ పగ్గాలు చేపట్టిన తర్వాత.. మంచి ఊపు వచ్చిన విషయం తెలిసిందేనని పరిశీ లకులు చెబుతుంటారు. అప్పట్లో జీహెచ్ ఎంసీ ఎన్నికలు కానీ.. దుబ్బాక అసెంబ్లీ ఉప ఎన్నిక కానీ.. బీజేపీకి మంచి ఊపు తెచ్చింది. బండి సంజయ్.. మీటింగులకు జనాలు పోటెత్తారు. అదేవిధంగా నాయకులు కూడా ఎగబడి చూశారు. ఇక మీడియా కూడా తీవ్రస్థాయిలో ఆయనను ఫోకస్ చేసింది. ఆ సమయంలో చిత్రమైన ఘటనలు కూడా చర్చకు వచ్చాయి. బీజేపీకి ఇండైరెక్టా.. టీఆర్ ఎస్ పార్టీ మద్దతిచ్చిందనే వాదన ఉంది. కాంగ్రెస్ ఎక్కడ బలపడుతుందో.. తమ పుట్టిని ఎక్కడ ముంచుతుందో.. అని భావించిన టీఆర్ ఎస్.. బీజేపీకి మద్దతు తెలిపింది. దీంతో బీజేపీ కొంత మేరకు పుంజుకుంది. అయితే.. ఇదంతా కూడా బండి తన ఖాతాలోనే వేసుకున్నారు. ఇంకేముంది.. నావల్లే బీజేపీ పుంజుకుందని.. ఆయన వర్గం ప్రచారం చేపట్టింది. అంతేకాదు.. రాబోయే ఎన్నికల్లో.. బీజేకి కనీసం.. 30 స్థానాల్లో పాగా వేయడం ఖాయమనే అంచనాలు కూడా తెరమీదికి వచ్చాయి. దీంతో బండి ప్రభ ఓ రేంజ్లో వెలిగిపోయింది. ఈ ఊపులోనే.. కేసీఆర్ కేంద్రంగా విరుచుకుపడ్డారు. కుటుంబ పాలన అంటూ.. ప్రచారం చేశారు. ఇంకేముంది. .రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేస్తాం.. అంటూ.. పాదయాత్రలు చేపట్టారు. అయితే.. ఈ పాదయాత్ర మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. ఊపులేక బ్రేక్ ఇచ్చారు. మళ్లీ ప్రారంభించారు. అయినా.. ఎక్కడా ఊపు లేక పోవడంతో పాదయాత్ర ఊసు ఎత్తడం మానేశారు. ఇక గత ఆరు మాసాల నుంచి కూడా బండి ఆధ్వర్యంలో వాయిస్ వినిపిస్తోందే తప్ప.. విషయం కనిపించడం లేదనే వాదన వినిపిస్తోంది.

ఎందుకంటే.. నిజానికి పార్టీకి అధికారంలోకి వచ్చేసే సీన్ కానీ.. కనీసం 30 మంది ఎమ్మెల్యేలను గెలిపించుకునే స్థాయికానీ ఉండి ఉంటే.. ఇప్పటికే.. పొరుగు పార్టీల నుంచి ముఖ్యంగా అధికార పార్టీ నుంచి కూడా వలసలు జోరందుకునేవి. ఎందుకంటే.. మరో ఏడాదిలోనే ఎన్నికలు ఉన్న నేపథ్యంలో ఎవరికి వారు వచ్చేసి.. ఆయా సీట్లలో కర్చీఫ్లు వేసుకునేవారు. కానీ బండి వారి పరిస్థితి తద్భిన్నంగా ఉంది. ఒక్కరంటే.. ఒక్క నేత రాలేదు. పోనీ.. అధికారంలో ఉన్న వారు రాలేదు.. అంటే.. ఓకే అనుకోవచ్చు.. మాజీ లకు ఏమైంది.. వారు కూడా రాలేదుగా! సో.. దీనిని బట్టి.. బండి పరిస్థితి పైన పటారం.. అనే చందంగా మారిపోయిందని.. రాజకీయ నేతల మధ్య చర్చ సాగుతున్నట్టు తెలుస్తోంది. ఇదే విషయంపై ఇతర పార్టీల నేతలు కూడా చర్చించుకుంటున్నారు.

బండి వ్యాఖ్యలకు సొంత పార్టీ నేతలే.. మద్దతు తెలపడంలేదని.. ఇటీవల ఓ పత్రిక కథనం రాసుకువచ్చింది. అది కనుక తప్పయితే.. దీనిని ఖండించాల్సిన పరిస్థితి ఉంది. కానీ.. బీజేపీలో ఒక్కరంటే.. ఒక్కరూ ఖండించలేదు. సో.. ఏతా వాతా ఎలా చూసుకున్న బండి డల్ అయ్యారనేది వాస్తవం అంటున్నారు పరిశీలకులు. అందుకే.. బండెనక బండి కట్టి.. బండి వెనుక .. నడిచేందుకు.. ఎవరు ముందుకు రావడం లేదని చెబుతున్నారు. మరి ఇప్పుడే.. ఈ పరిస్థితి ఉంటే.. వచ్చే ఎన్నికల నాటికి పరిస్థితి ఏంటి? అంటున్నారు పరిశీలకులు.

రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖకు రికార్డు స్థాయిలో రాబడి

హైదరాబాద్ : రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖకు రికార్డు స్థాయిలో రాబడి వచ్చింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ. 72,525.59 కోట్ల రాబడి వచ్చినట్లు వాణిజ్య పన్నుల శాఖ వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం కంటే ఈ ఆర్థిక ఏడాది 12 శాతం అధికంగా ఆదాయం సమకూరింది. గత సంవత్సరంలో రూ. 65,021.42 కోట్ల రాబడి వచ్చింది. చమురు అమ్మకాలపై వ్యాట్ ద్వారా రూ. 14,987.44 కోట్లు, మద్యం అమ్మకాలపై వ్యాట్ ద్వారా రూ. 14,286.85 కోట్లు, వ్యాట్, జీఎస్టీ రాబడులు ఇతరత్రా రాబడులు రూ. 1088.80 కోట్లు సమకూరాయి. కేంద్ర, రాష్ట్ర జీఎస్టీ ద్వారా రాష్ట్రానికి రూ. 38,101 కోట్ల రాబడి వచ్చినట్లు వాణిజ్య పన్నుల శాఖ ప్రకటించింది.

వైఎస్ షర్మిల సైలెన్స్ వెనుక కథేంటి?

హైదరాబాద్ : తెలంగాణలో 3500 కి.మీలకు పైగా పాదయాత్ర చేసి కేసీఆర్ ఫ్యామిలీపై నిప్పులు చెరుగుతూ పోలీసుల చేత అరెస్ట్ లు అవుతూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కవ్విస్తూ తిరిగే వైఎస్ షర్మిల ఈ మధ్య ఢిల్లీకి వెళ్లి వచ్చినప్పటి నుంచి చాలా సైలెంట్ అయ్యారన్న ప్రచారం తెలంగాణ రాజకీయవర్గాల్లో సాగుతోంది. ప్రస్తుతం షర్మిల ఉనికి ఎక్కడ కనిపించకపోవడం చూసి అందరూ ఆరాతీస్తున్నారు. తెలంగాణలో ప్రస్తుతం రెండు మేజర్ సమస్యలున్నాయి. ఒకటి కవిత ఈడీ విచారణ కాగా.. రెండోది టీఎస్.పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం. దీనిపై ఓవైపు బండి సంజయ్ మరోవైపు రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు చేస్తూ ప్రభుత్వాన్ని అభాసుపాలు చేస్తుంటే షర్మిల మాత్రం అసలు దీనిపై నోరు మెదపకపోవడం అందరినీ షాక్ కు గురిచేస్తోంది. కేసీఆర్ ఫ్యామిలీ అంటేనే ఒంటికాలిపై లేచే షర్మిల నిరుద్యోగులకు టీఎస్ పీఎస్సీ ద్వారా అన్యాయం జరుగుతున్నా స్పందించడం లేదు. మొన్నటి వరకూ నిరుద్యోగుల కోసం దీక్షలు చేసిన షర్మిల ఇప్పుడు టీఎస్ పీఎస్సీ విషయంలో ఇంత సైలెన్స్ మెయింటేనే చేయడం అందరినీ ముక్కున వేలేసుకునేలా చేస్తోందని రాజకీయవర్గాలు నిరుద్యోగులు సైతం ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. కొద్దినెలల క్రితం ఉద్యోగాలు భర్తీ చేయాలని.. నిరుద్యోగుల ఆత్మహత్యలు అని వారికి మద్దతుగా ప్రతీ మంగళవారం షర్మిల దీక్ష చేసేవారు. కేసీఆర్ కేటీఆర్ లను తిట్టిపోసేవారు. అలాంటిది టీఎస్ పీఎస్సీలో పరీక్ష పేపర్ల లీక్ అయ్యి తెలంగాణ అట్టుడుకుతుంటే షర్మల పదిరోజులుగా సైలెంట్ గా ఉండడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. దీన్ని అడ్వంటేజ్ గా తీసుకొని నిరుద్యోగుల పక్షాణ నిలబడుతుందనుకున్న షర్మిలక్క ఇలాంటి సైలెంట్ అవ్వడం చూసి నిరుద్యోగులు సైతం షాక్ అవుతున్న పరిస్థితి నెలకొంది. షర్మిలకు నిరుద్యోగుల పక్షాన నిలబడడానికి ఇదే సరైన సమయం. నిరుద్యోగులను ఇప్పుడు పిలిచి సభలు సమావేశాలు.. ఆందోళనలు చేస్తే మంచి మైలేజ్ వస్తుంది. మరి ఎందుకు షర్మిల సైలెన్స్ అయ్యిందన్నది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.

టీఎస్ బి పాస్ విధానంతో...

ముందుకు..

600 చదరపు గజాలు, అంతకంటే ఎక్కువ స్థలంలో కట్టే భవనాలకు కూల్ రూఫ్ తప్పనిసరి: మంత్రి కేటీఆర్

త్వరలో మననగరం
కార్యక్రమం...

హైదరాబాద్: దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం కూల్ రూఫ్ పాలసీని తీసుకొస్తున్నామని మంత్రి కేటీఆర్ అన్నారు. ఇది భవిష్యత్ తరాలకు ఉపయోగపడే కార్యక్రమమని చెప్పారు. మొదట తమ ఇంటిపై కూల్ రూఫ్ విధానం అమలుచేశామన్నారు. హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని సీడీఎంఏ ఆఫీస్‌లో భవన యజమానులు ఎండవేడిమిని తగ్గించుకొనేందుకు సహజ విధానాలు పాటించేలా రూపొందించిన తెలంగాణ కూల్‌రూఫ్ పాలసీ 2023-28ని మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. దేశం మొత్తంలోనే హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్ ఉందని చెప్పారు.

హైదరాబాద్‌లో ఉన్న అవకాశాలు దేశంలో ఎక్కడా లేవని స్పష్టం చేశారు. టీఎస్ బీపాస్‌తో దేశంలో ఎక్కడాలేని విధంగా భవన నిర్మాణ అనుమతులు ఇస్తున్నామని వెల్లడించారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా 240 కోట్ల మొక్కలు నాటి సంరక్షిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది హైదరాబాద్‌లో 5 చదరపు కిలోమీటర్ల కూల్ రూఫ్ అమలుచేస్తామని మంత్రి కేటీఆర్ అన్నారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లన్నిటిపై కూల్ రూఫ్ అమలు చేస్తామన్నారు. 2030 నాటికి రాష్ట్రంలో 200 చదరపు కిలోమీటర్ల కూల్ రూఫ్ టాప్ ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. 600 చదరపు గజాలు, అంతకంటే ఎక్కువ స్థలంలో కట్టే భవనాలకు కూల్ రూఫ్ ఏర్పాటును తప్పనిసరి చేస్తామని వెల్లడించారు.

కూల్‌రూఫ్ వల్ల మీటరుకు రూ.300 మాత్రమే ఖర్చవుతుందని చెప్పారు. కూల్‌రూఫ్ పెయింట్ వేయడం వల్ల కరెంటు చార్జీలు ఆదా అవుతాయని చెప్పారు. ఇప్పటికే కట్టిన భవనాలపై కూడా కూల్‌రూఫ్ విధానం అమలుచేయొచ్చని వెల్లడించారు. ఈ పాలసీలో భాగంగా రాష్ట్రంలో కూల్‌రూఫ్‌ల ఏర్పాటుకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తామని, అనుసరించేవారికి ప్రోత్సాహకాలు ఇస్తామని వెల్లడించారు. పాలసీలు, చట్టం చేయడం చాలా సులువని, కానీ వాటిని అమలు చేయడం చాలా కష్టంతో కూడుకున్న పని అన్నారు. విద్యుత్ వాహనాల వినియోగం పెరగాలనేది సీఎం కేసీఆర్ ఆశయమని తెలిపారు. భవన నిర్మాణ వ్యర్థాల రీసైక్లింగ్‌కు హైదరాబాద్‌లో రెండు ప్లాంట్‌లు ఏర్పాటుచేశామని మంత్రి కేటీఆర్ అన్నారు.

సంపాదకీయం

సంచలనంగా మారిన 'ది ప్రింట్' కథనంలో ఏముంది? ఏం చెప్పింది?

ప్రధాన మీడియా అన్నంతనే కొన్నేళ్ల క్రితం వరకు దినపత్రికలను మాత్రమే పరిగణించేవారు. తర్వాతి కాలంలో టీవీ చానళ్లు కూడా వచ్చి చేరాయి. ఇప్పుడు వెబ్ మీడియా కూడా ప్రధాన మీడియా స్రవంతిలో చేరింది. లెక్కలేనెన్ని వెబ్ సైట్లు ఉన్నా.. కొన్ని సైట్లలో వచ్చే వార్తలకు ఉండే స్పందన.. ఆ కథనాల్ని ప్రింట్ మీడియా సైతం ఫాలో అయ్యే పరిస్థితి. ఇప్పుడు అలాంటి పరిస్థితే నెలకొంది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో సంక్షేమ పథకాల పేరుతో అందజేస్తున్న ఉచిత తాయిలాలు ఆయా రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని ఎంత దారుణంగా మారుస్తాయన్నది పెద్ద చర్చగా మారింది. ఇదే సమయంలో ప్రపంచ దేశాలకు శ్రీలంక ఆర్థిక పతనం ఒక పెద్ద పాఠంగా మారింది. చరిత్రలో ఎప్పుడూ చూడనంత ఆర్థిక సంక్షోభాన్ని చూస్తున్న శ్రీలంకను చూసి చాలా త్వరగా పాఠాలు నేర్చుకోవాలని.. లేకుంటే అలాంటి పరిస్థితులు ఏర్పడినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదంటూ చేస్తున్న హెచ్చరికలు ఇప్పుడు అందరిని ఆకర్షిస్తున్నాయి. పెట్రోల్.. డీజిల్ లాంటి నిత్యవసరాల కోసం గంటల కొద్దీ క్యూలైన్లలో నిలవాల్సిన పరిస్థితి ప్రస్తుతం శ్రీలంకలో ఉంది. అప్పుల కొండ భారీగా పెరగటంతో 51 బిలియన్ డాలర్ల విదేశీ రుణాల్ని చెల్లించే పరిస్థితి లేదని ప్రభుత్వం ప్రకటించింది. ఇలాంటివేళ.. దేశంలోని ఐదు రాష్ట్రాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల విషయంలో పునరాలోచించుకోకుంటే శ్రీలంక లాంటి పరిస్థితి మనకూ తప్పదని తేల్చింది. శ్రీలంక ఆర్థిక సంక్షోభం నుంచి పంజాబ్.. బిహార్.. రాజస్థాన్.. ఆంధ్రప్రదేశ్.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు మేల్కోవాల్సిన అవసరం ఉందని.. ఆయా రాష్ట్రాల్లో ఉచిత పథకాలు.. అప్పులకు తక్షణమే కోత పెట్టాల్సిన అవసరం ఉందని తేల్చింది. ఈ కథనంలో పేర్కొన్న కీలక అంశాల్ని చూస్తే.. కరోనాతో కొత్త కష్టాలు మొదలైతే.. అంతకు రెండేళ్ల ముందు నుంచి రాష్ట్రాల సొంత రెవెన్యూ రాబడులు తగ్గటంతో అప్పుల మీద ఆధారపడాల్సి వస్తోంది. 14వ ఆర్థిక సంఘం కాలపరిమితి ముగిసిన తర్వాత రాష్ట్రాలు తమ ఆదాయాల్ని ఖర్చు చేసే విషయంలో వారికి వెసులుబాటు లభించింది. చాలా రాష్ట్రాలు ప్రజాకర్షక పథకాల పైనే ఎక్కువగా ఖర్చు చేయటంతో రెవెన్యూ రాబడుల్లో పెరుగుదల తగ్గింది. దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో గడిచిన ఐదేళ్లలో రెవెన్యూ రాబడుల కంటే వడ్డీ చెల్లింపుల్లో పెరుగుదల ఎక్కువగా ఉంది. పలు రాష్ట్రాలు అప్పుల ఊబిలో చిక్కుకుపోయి వాటిని తీర్చలేని పరిస్థితి నెలకొంది. తాజాగా ఎన్నికలు జరిగిన పంజాబ్.. యూపీ రాష్ట్రాల్లో అనేక ప్రజాకర్షక పథకాల్ని ప్రకటించారు. వీటితో ఆ రాష్ట్రాలు మరింత అప్పుల పాలు కావటం ఖాయం. బీజేపీ ఏలుబడిలో ఉన్న ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల జరిగిన ఎన్నికల సందర్భంగా ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ రాష్ట్ర రాబడి ఐదేళ్లలో 5 శాతం పెరుగుదల ఉంటే.. వడ్డీ చెల్లింపుల్లో పెరుగుదల రేటు 6 శాతానికి పెరిగింది. ఏపీ.. బిహార్.. రాజస్థాన్ రాష్ట్రాల్లో అప్పుల పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. ఏపీలో 2021–22 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి మొత్తం రుణం రూ.3.89 లక్షల కోట్లకు చేరితే.. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఇది రూ.40వేల కోట్లు ఎక్కువ. ఏపీ జీఎస్ డీపీలో అప్పు 32.4 శాతానికి చేరుకుంది. ఈ సంచలన కథనంలో చెప్పిన లెక్కల ప్రకారం దేశంలో అత్యధిక రుణ భారం పంజాబ్ రాష్ట్రానిది. ఆ రాష్ట్ర జీఎస్ డీపీలో అప్పుల వాటా ఏకంగా 53 శాతం. ఏపీలో ఉన్న మొత్తం చెల్లింపుల భారం రూ.7.76 లక్షల కోట్లను పరిగణలోకి తీసుకుంటే జీఎస్ డీపీలో అప్పుల భారం వాటా 76 శాతంగా ఉంది. అంటే పంజాబ్ కంటే ఏపీ ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందన్న మాట.

మీ లెక్కలు బంగారంగాను!

భద్రాచలం : భద్రాచలం పుణ్యక్షేత్రంలో తరతరాలుగా భక్తులు తమ మొక్కులను నగదు రూపంలోనే కాకుండా వెండి, బంగారు ఆభరణాల రూపంలో సమర్పించుకుంటున్నారు. శ్రీరామ నవమి వంటి ఉత్సవాలకు సెక్టార్ ద్వారా ఆదాయం వస్తున్నా వీటిని లెక్కించడంలో అధికారులు అలసత్వం వీడటం లేదు. ఉన్నతాధికారులకు ఏవో సాకులు చూపిస్తు కాలం వెళ్లదీస్తుండటం సందేహాలను కలిగిస్తోంది. శ్రీరామ నవమి కల్యాణ బ్రహ్మోత్సవాలకు విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. హుండీలను త్వరలో తెరిచే వీలుంది. 3 లక్షల వరకు లడ్డూ ప్రసాదాలను తయారు చేయగా వీటికి ఆదరణ బాగానే లభించింది. ఇంకొంత సరకు మిగిలినందున నేడోరేపో వీటి విక్రయాలపై స్పష్టత రానుంది. సెక్టార్ టిక్కెట్‌ల వ్యవహారంలో నాన్చుడు ధోరణి పాటిస్తుండడంతో విమర్శల పాలవుతున్నారు.

వచ్చే ఏడాది మరింత ప్రాధాన్యం..అంతర్గత బదిలీల్లో భాగంగా అనుకూలంగా ఉండే వారికి నచ్చిన సీట్లు కేటాయించేందుకు చర్యలు మొదలయ్యాయి. సూపరింటెండెంట్లకు స్థాన చలనం కలుగుతుందా? లేదా అన్నది సందిగ్ధంగా మారింది. పీఆర్వో వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారు. దీర్ఘకాలికంగా పనిచేస్తున్న ఉద్యోగులను వేరే చోటకు బదిలీ చేయకపోవడంతో వారు చెప్పిందే శాసనంగా మారింది. వచ్చే ఏడాది శ్రీరామ నవమికి ఎంతో ప్రత్యేకత ఉంది. 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే వేడుక కావడంతో వార్షిక బడ్జెట్‌పై కసరత్తు చేయాల్సి ఉండగా దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన రాలేదు.

జాప్యం ఎందుకో మరి..

ఆన్‌లైన్‌లో టిక్కెట్లను సకాలంలో అందుబాటులో ఉంచలేదు. దీనిపై సరైన ప్రచారం చేయలేదు. నేరుగా తీసుకున్న వారితో పోల్చితే అంతర్జాలంలో కొనుగోలు చేసిన వారికి జీఎస్టీ బాదుడు తప్పలేదు. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో అనుకున్న స్థాయిలో ఆదరణ కరవైంది. బ్రహ్మోత్సవాలు సమీపించిన తర్వాతనే కొత్తగూడెంతో పాటు భద్రాచలంలో కలిపి ఐదు కౌంటర్‌లలో టిక్కెట్‌లను ఉంచారు. రూ.7,500 ఉభయ దాతల క్యాడర్‌లో ఒక్కో టిక్కెట్‌పై ఇద్దరికి ప్రవేశం కల్పించారు. ఈ భక్తులకు స్వామి వారి ప్రసాదాలను అందించే ప్రక్రియ కొనసాగుతోంది. రూ.2,500 వీఐపీ విభాగంలో చోటు కోసం ఎంతోమంది ప్రయత్నించినా సకాలంలో వీటిని విక్రయించలేదు. రూ.2 వేలు, రూ.వెయ్యి, రూ.300, రూ.150 రుసుంగల టిక్కెట్‌లు మొత్తంగా 20 వేలు ఉన్నాయి. వీటిని పూర్తిస్థాయిలో విక్రయిస్తే రూ.2 కోట్ల ఆదాయం వస్తుంది. ఏ మేరకు విక్రయించారనే లెక్కలు తేల్చకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. 2019లో సెక్టార్ ద్వారా రూ.1.06 కోట్లు సమకూరింది.

ఆభరణాల తూకంలోనూ గందరగోళమే

అలసత్వమో... లేక దేవాదాయ శాఖ మొండి వైఖరో... ఏళ్ల తరబడి రాముల వారి ఆభరణాల లెక్కలను తేల్చడం మానేశారు. ఆభరణాల తనిఖీ అధికారులు 2019 ఫిబ్రవరిలో వచ్చి తూకం వేశారు. అప్పటి నుంచి ఇందులో స్పష్టత రాలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రక్రియ ఎప్పటికి పూర్తవుతుందో తెలియని దైన్యం నెలకొంది. 853 కిలోలకు పైగా వెండితో పాటు 63 కిలోల బంగారం స్వామి ఖాతాలో నమోదైంది. దాదాపు 13 ఏళ్ల క్రితం అధికారికంగా ధర్మ కాటాలో తూకం వేసి ఆభరణాల బరువును గుర్తించారు. తర్వాత కొంత తరుగును తీశారు. కొన్ని నగలు అదనంగా వచ్చాయి. ప్రస్తుతం నికర బంగారం, వెండి ఎంత అనేది తేల్చాలి. 2019 నాటి పరిశీలనను పరిగణలోకి తీసుకుంటారా.. లేక తాజా ఆభరణాలను కలిపి లెక్కిస్తారా అన్నది వెల్లడించాలి. ఇప్పటికే బంగారు వాకిలి ఉండగా వెండి వాకిలి పనులు చేయాలని ప్రతిపాదించారు.

హద్దురాళ్ల తొలగింపు అంతా ఉత్తిదే



వేములవాడ : ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతున్న వేములవాడ పట్టణ పరిధిలో పుట్ట గొడుగుల్లా వెలుస్తున్న అక్రమ వెంచర్లలో మున్సిపల్ అధికారులు హద్దురాళ్ల తొలగింపు అంత ఉత్తదే అవుతోంది. అప్పుడప్పుడు మున్సిపల్ అధికారులు హడావుడి చేసి హద్దురాళ్లను తొలగించడం ఆ తర్వాత స్థిరాస్తి వ్యాపారులు యథావిధిగా హద్దురాళ్లను పాతుకోవడం సర్వసాధారణంగా మారింది. హద్దురాళ్ల తొలగింపు చర్యలు అంత నామమాత్రపు వ్యవహారంలా కనిపిస్తోంది. పట్టణం అభివృద్ధి చెందడంతో పట్టణ శివారు ప్రాంతాల భూముల ధరలు ఎకరాన రూ.కోట్లకు పెరిగిపోయాయి. ఇదే అదనుగా స్థిరాస్తి వ్యాపారులు అక్రమ వెంచర్లను ఏర్పాట్లు చేస్తూ రంగు రంగుల బ్రోచర్లతో జనాన్ని ఆకర్షిస్తూ వ్యాపారాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. వేములవాడ పట్టణ శివారు ప్రాంతాలతో పాటు మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్, నాంపల్లి, అయ్యోరుపల్లి, శాత్రాజుపల్లి, కోనాయిపల్లి ప్రాంతాల్లోని వ్యవసాయ భూముల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఈ ప్రాంతాల్లోని వ్యవసాయ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండానే రోజుకో వెంచరు వెలుస్తున్నాయి. మున్సిపల్ అధికారుల, ఆయా వార్డుల రాజకీయ నాయకుల కనుసన్నల్లోనే ఈ స్థిరాస్తి వ్యాపారులు అక్రమ వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మున్సిపల్ ఆదాయానికి గండి

అక్రమ వెంచర్ల నిరోధానికి చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు జిల్లా అధికారులు ఆదేశించడంతో మున్సిపల్ అధికారులు కొన్ని నెలల క్రితం చర్యలకు ఉపక్రమించారు. 9 వెంచర్లను గుర్తించి అందులో కొన్నింటిలో హద్దురాళ్లను తొలగించి చేతులు దులుపుకున్నారు.. గతంలోనే పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు వేములవాడ ప్రాంతంలో 425 ఎకరాల విస్తీర్ణంలో మొత్తం 57 సర్వే నంబర్లలో అక్రమ వెంచర్లున్నట్లు గుర్తించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కొత్తగా ఏర్పాటు చేసిన కొన్ని వెంచర్లలోనే హద్దులను తొలగించి చేతులు దులుపుకోవడం విమర్శలకు తావిస్తోంది. వీటిలోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయొద్దని సబ్‌రిజిస్ట్రార్‌కు మున్సిపల్ అధికారులు సర్వే నంబర్లతో లెటర్ ఇచ్చినప్పటికీ అందులోని ప్లాట్లకు యథేచ్ఛగా రిజిస్ట్రేషన్లు జరుగుతూనే ఉన్నాయి. అక్రమ వెంచర్లలో పెద్ద ఎత్తున రిజిస్ట్రేషన్లు జరగడంతో మున్సిపల్ ఆదాయానికి భారీగా గండి పడుతోంది.

కనిపించని నిబంధనలు...

వ్యవసాయ భూములను లేఅవుట్ చేయాలంటే వ్యవసాయేతర భూములుగా మార్పు చేసి అధికారికంగా లే అవుట్ అనుమతులు పొందాల్సి ఉంటుంది. సామాజిక అవసరాల కోసం లే అవుట్ చేసిన వెంచర్లల్లో పదిశాతం స్థలం వదిలివేయడంతో పాటు 33 ఫీట్లు, 40 ఫీట్ల వెడల్పుతో రోడ్లు వేయాల్సి ఉంటుంది. వీట్జితో పాటు రోడ్లు, విద్యుత్తు, మురుగు కాలువలు, నీటి సరఫరా వంటి మౌలిక వసతులు కల్పించి అనుమతులు పొంది ప్లాట్లను విక్రయించాల్సి ఉంటుంది. అలాంటి వసతులు ఏవీ ఏర్పాటు చేయకుండా ఎలాంటి అనుమతులు పొందకుండానే మున్సిపల్ పరిధిలో వందల ఎకరాల్లో వెంచర్లను ఏర్పాటు చేసి ప్లాట్లను అమాయక ప్రజలకు స్థిరాస్తి వ్యాపారులు అంటగడుతున్నారు. మరికొంత మంది స్థిరాస్తి వ్యాపారులు నిబంధనలు తుంగలో తొక్కి పేపర్లపై నక్ష తీయించి కాగితాలపైనే ప్లాట్లు క్రయవిక్రయాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు.

అక్రమ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు ఆగడం లేదు

–శ్యామ్‌సుందర్‌రావు, మున్సిపల్ కమిషనర్ వేములవాడ

అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకుంటున్నప్పటికీ తిరిగి హద్దులను ఏర్పాటు చేసుకుంటున్నారు. అక్రమ వెంచర్లలో రిజిస్ట్రేషన్ చేయొద్దని సబ్‌రిజిస్ట్రార్‌కు లెటర్ ఇచ్చినప్పటికీ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. గతంలో ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అక్రమ వెంచర్లలో ఎలాంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం లేదు.

అధికారుల అలసత్వం.. అన్నదాతలకు శాపం

రుద్రంగి : ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకాన్ని నమ్ముకుని వరి సాగు చేసిన రైతులకు తీవ్ర ఇబ్బంది ఎదురవుతోంది. ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో ఏర్పాటు చేసిన మోటార్లు, పైప్‌లైన్ల నిర్వహణలో ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వేసవిలో పంటలకు సకాలంలో నీరందక ఎండిపోతున్నాయి. ఈ నెల ప్రారంభంలో చందుర్తి మండలంలోని మూడపల్లిలో రైతులు రాస్తారోకో చేయటంతో ఏప్రిల్ 8న చందుర్తి మండలంలోని 450 ట్యాంకు వరకు నీటిని విడుదల చేశారు. రెండు రోజుల పాటు కొనసాగిన నీటితో చందుర్తి మండలంలోని జోగాపూర్ పంప్‌హౌజ్ ద్వారా బండపల్లి చెరువులోకి నీటిని మళ్లించారు. వివిధ గ్రామాల్లోని చెరువులను నింపి పంటలకు నీటిని అందిస్తారని రైతులు ఆశించారు. నీటి విడుదల రెండు రోజులకే నిలిచిపోయింది. దీంతో కాలువ నీళ్ల రాకతో సంబరపడిన రైతులకు ఈ సంతోషం రెండు రోజులకే ఆవిరైపోయింది. పొట్ట దశలో ఉన్న వరికి నాలుగు తడులు అందితే గట్టెక్కుతామని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది.

ఎల్లంపల్లి కాలువ పరిధిలో ఉన్న వేములవాడ, చందుర్తి, రుద్రంగి మండలాల్లో ఈ యాసంగిలో సుమారు 40 వేల ఎకరాల్లో వరి సాగైంది. ఎల్లంపల్లి నీటిని మార్చి మొదటి వారంలో విడుదల చేస్తే పంటలకు చాలా మేలు జరిగేది. సకాలంలో నీటి విడుదల లేక ఆలస్యంగానైనా ఏప్రిల్ మొదటి వారంలో విడుదల చేశాక రెండు రోజులకే నిలిపివేయటంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గంగాధర మండలంలోని నారాయణపూర్ రిజర్వాయర్‌లోని నీటిని అక్కడి పంటలకు మళ్లించటంతో దిగువన ఉన్న కొడిమ్యాల మండలంలోని కొండాపూర్ రిజర్వాయర్‌కు, అక్కడి నుంచి ఫాజుల్ నగర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు నీటి రాక తగ్గిపోయింది. ఫాజుల్ నగర్ రిజర్వాయర్‌లోకి నీరు సరిపడినంత చేరితేనే అక్కడి నుంచి చందుర్తి మండలంలోకి నీరు చేరే అవకాశం ఉంటుంది. చందుర్తిలోని జోగాపూర్ పంపుహౌజ్ నుంచి రుద్రంగిలోని నాగారం చెరువు, అచ్చయ్యకుంట చెరువులను నింపాలి. కానీ చందుర్తి మండలంలోని లింగంపేట వద్ద పైప్‌లైన్ పూర్తిగా పనిచేయని స్థితికి చేరిపోయింది. ఈ పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టడంలో అధికారులు అలసత్వం ప్రదర్శించటం, స్థానిక ప్రజాప్రతినిధులు అంటిముట్టనట్లు వ్యవహరించటంతో పైప్‌లైన్ పనులు ఇప్పట్లో పూర్తయ్యేలా కనిపించడం లేదు.

దవాఖానాల్లో నిఘా నేత్రాలు

కొత్తగూడెం : ఇప్పటి వరకు జిల్లాలోని ముఖ్యమైన ఆసుపత్రులకే పరిమితమైన నిఘా నేత్రాలు (సీసీ కెమెరాలు) ఇక మీదట అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు ఆరంభించింది. ఇటీవల వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఈ మేరకు నిర్ణయం వెల్లడించారు. మంత్రి ఆదేశాలతో ఉభయ జిల్లాల్లోని అన్ని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలలో నిఘా నేత్రాలు అందుబాటులోకి రానున్నాయి. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల నుంచి కెమెరాల ఏర్పాట్లపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందాయి.

పర్యవేక్షణతో సేవలు మెరుగు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలను మెరుగుపరిచే క్రమంలో భాగంగా అన్నిచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. రోగులకు అందే సేవలు, సిబ్బంది పనితీరుపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ మరింత పెరిగేందుకు ఇది దోహదపడుతుంది. వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో



కొనసాగుతున్న కొన్ని ఆసుపత్రుల్లో ఇప్పటికే సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నాయి. మిగిలిన వాటితో పాటు క్షేత్రస్థాయి యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో సైతం కొత్తగా బిగించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు కొనసాగుతున్నాయి.

ప్రతిపాదనలు పంపించాం కె.దయానందస్వామి, డీఎంహెచ్‌ఓ

పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో నిఘానేత్రాలు ఎన్ని కావాలో ప్రభుత్వం కోరింది. సంబంధించిన ప్రతిపాదనలు రెండ్రోజుల క్రితమే పంపించాం. ఒక్కో కేంద్రంలో ఎన్ని కెమెరాలు అమర్చుతారనే దానిపై మాత్రం స్పష్టత లేదు. ఎక్కడెక్కడ అవసరమనే సమాచారమే పంపించాం. ఉన్నతాధికారులే స్వయంగా పరిశీలించే వీలుంది. వైద్య సేవలు పూర్తి స్థాయిలో మెరుగుపరిచేలా వైద్య శాఖ కార్యాచరణ కొనసాగుతుంది. జిల్లా స్థాయిలోనూ అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాం.

కొనుగోలు కేంద్రాల జాడేదీ?

కోనరావుపేట : ఆరుగాలం కష్టించి యాసంగిలో వరిసాగు చేసిన రైతులకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయించటంతో ఊరట లభించింది. రైతులు పండించిన ధాన్యం మధ్య దళారులు, రైస్ మిల్లర్లను ఆశ్రయించి నష్టపోవద్దని ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ.1960 ప్రకటించింది. అన్ని గ్రామాల్లో ఐకేపీ, ఫ్యాక్స్, వ్యవసాయశాఖ కొనుగోలు కేంద్రాలను ఈనెల 15 నుంచి ప్రారంభించాలని మంత్రులు, ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో వరికోతలు ప్రారంభం కాగా రైతులు చేతికందిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించగా ప్రారంభానికి నోచుకోక అవస్థలు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో పిచ్చిమొక్కలు, రాళ్లు, చెత్తాచెదారంతో నిండిపోగా చదునుచేయక రైతులు అవస్థలు పడుతున్నారు. వాతావరణ శాఖ అకాల వర్షాలు కురియనున్నట్లు హెచ్చరికలు జారీ చేయటం వరికోతలు ఊపందుకున్నాయి. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి మౌలిక వసతులు కల్పించాలని రైతుల కోరుతున్నారు.

వరిపంట సాగు విస్తీర్ణం.. దిగుబడి అంచనా

కోనరావుపేట మండలం మెట్ట ప్రాంతం. యాసంగిలో బోరు, వ్యవసాయ బావుల ద్వారా 12,600 ఎకరాలకు పైగా వరిసాగు చేయగా సుమారు 1.60 లక్షల క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తోందని అధికారులు అంచనాలు వేశారు. గ్రామాల్లో కొందరు రైతులు వేసవిలో భూగర్భ జలాలు అడుగంటి నీటి ఎద్దడి నెలకొంటుందని భావించి ముందస్తుగా వరినాట్లు వేశారు. దీంతో గ్రామాల్లో అక్కడక్కడ వరికోతలు ప్రారంభమయ్యాయి. మరో నాలుగైదు రోజుల్లో కోతలు జోరుగా సాగనున్నాయి. రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొంది లబ్ధి పొందటానికి ఆసక్తి కనబరుస్తున్నారు. కొనుగోలు కేంద్రాలను అధికారులు, పాలకులు సిద్ధం చేయకపోవటంతో రైతులు సేకరించిన ధాన్యం రాశులు, కుప్పలు పోయటానికి ఇబ్బందులు పడుతున్నారు. రైతులు స్వయంగా అవసరం మేరకు చదును చేసుకుని, అందుబాటులోని టార్పాలిన్లు వేసి కుప్పలు పోస్తున్నారు. అకాల వర్షాలు కురిస్తే కొనుగోలు కేంద్రాలు చిత్తడిగా కానుండటంతో ఆందోళన వ్యకం చేస్తున్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

–కేతిరెడ్డి రవీందర్‌రెడ్డి రైతు నిజామాబాద్

వ్యవసాయ, బోరు బావి సహాయంతో 11 ఎకరాలు వరిసాగు చేశాను. సుమారు 640 బస్తాల ధాన్యం దిగుబడి అవుతోంది. ఏటా గ్రామంలో వేములవాడ మార్కెట్ యార్డు ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. మా అన్నయ్య వరి కోత కోయగా కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్ప పోశాం. మబ్బులు పడటంతో మరో రెండు రోజుల్లో వరి కోత కోయటానికి సిద్ధమవుతున్నాం. కొనుగోలు కేంద్రాలను అధికారులు, పాలకులు వెంటనే ప్రారంభించి కనీస మౌలిక వసతులు కల్పించాలి. కొనుగోలులో జాప్యం లేకుండా కావాల్సిన టార్పాలిన్లు, గన్నీలు, హమాలీ కూలీలను సమకూర్చి రైతులను ఆదుకోవాలి.

రెండు రోజుల్లో సిద్ధం

–దేవరాజు ఏపీఎం కోనరావుపేట

ప్రభుత్వ నిర్ణయం మేరకు జిల్లా కలెక్టర్, పౌర సరఫరాలశాఖ ఉన్నతాధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేయాలని, రైతులకు మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. గ్రామాల్లో వరికోతలు, ధాన్యం తరలింపు దృష్ట్యా నిర్వాహకులకు అవగాహన కల్పించేలా తగిన చర్యలు తీసుకున్నాం. ఒకటి, రెండు రోజుల్లో కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేసేలా తగిన చర్యలు తీసుకుంటాం.

ప్రణాళికా లోపం.. పరిశుభ్రతకు దూరం

పెద్దపల్లి : పెద్దపల్లి పట్టణంలోని పలు కాలనీల్లో రహదారులు, మురుగుపారుదల వ్యవస్థ అధ్వానంగా మారింది. పనుల్లో నాణ్యత కరవై నిర్మాణాలు కొన్నాళ్లకే శిథిలమవుతున్నాయి. కొత్తగా ఇళ్ల నిర్మాణం జరుగుతున్న కాలనీల్లో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. కాలువలు, రహదారుల నిర్మాణానికి సరైన ప్రణాళిక లేక వివిధ రకాల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. మట్టి రోడ్లు నిర్మించినా మురుగుకాలువలు లేక పారిశుద్ధ్యం లోపించింది.

నాసిరకంగా నిర్మాణాలు

అభివృద్ధి పనుల నిర్వహణ నిధుల లభ్యతపై ఆధారపడి ఉంటుంది. పెద్దపల్లి పురపాలికకు వచ్చే నిధులు, ప్రత్యేక గ్రాంట్లు, ఇతర నిధులతో ఏటా దాదాపు రూ.5 కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయి. కానీ పనుల నిర్వహణలో నాణ్యత అంతంతమాత్రంగానే ఉంటోంది. గతంలో నిర్మించిన పలు మురుగుకాలువలు, సీసీ రోడ్ల పనులు నాసిరకంగా ఉండటంతో ధ్వంసమవుతున్నాయి. రామచంద్ర మిషన్ నుంచి చైతన్యకాలనీకి వెళ్లే సీసీ రోడ్డు ముక్కలవుతోంది. రోడ్డు నిర్మించిన తర్వాత సైడ్‌బర్మ్‌లు నిరించకపోవడం, మురుగుకాలువల నిర్మాణం కూడా లేకపోవడంతో సీసీ నిర్మాణాలు దెబ్బతింటున్నాయి. ఇక డ్రైనేజీలు నిర్మించిన చోట ఓవైపు కాలువ నిర్మిస్తుండగానే మరోవైపు మురుగు ప్రవహిస్తుండటంతో నాణ్యత అటకెక్కుతోంది. సాగర్ రోడ్డులో మురుగుకాలువ ఎత్తుగా నిర్మించడంతో వర్షం కురిసినపుడు ఇళ్లలోకి నీరు చేరుతోంది. మజీద్‌రోడ్డులోని మురుగుకాలువ పలు ప్రాంతాల్లో ధ్వంసం కావడం, పూడిక అధికంగా చేరడంతో కాలువ కనిపించకుండా పోతోంది.

మురుగుతో వివాదాలు

కొత్త కాలనీల్లో మౌలిక వసతుల కల్పన పురపాలక సంఘానికి తలకు మించిన భారంగా మారింది. ఇళ్ల నుంచి బయటకు వెళ్లే మురుగు సమీపంలోని ఖాళీ స్థలంలో చేరుతుండగా దాని యజమాని అడ్డుకుంటుండటంతో గొడవలు జరుగుతున్నాయి. ఇటీవలి కాలంలో నారాయణస్వామినగర్, చైతన్యకాలనీ, చీకురాయి రోడ్డు ప్రాంతాల్లో తరచూ ఇలాంటి గొడవలు జరుగుతుండటంవతో కొందరు యజమానులు ఇళ్ల ముందు గుంతలు తవ్వుకున్నారు. దీంతో పాతికేళ్ల కిందట పల్లెల్లో కనిపించిన మురుగు గుంతలు ప్రస్తుతం పెద్దపల్లి పురపాలిక పరిధిలో దర్శనమిస్తున్నాయి. కనీసం కచ్చా కాలువలైనా తవ్వాలంటూ పలు కాలనీల ప్రజలు కోరుతున్నారు.

ఎల్ఆర్ఎస్ నిధులైనా వెచ్చించాలి

-మొండెద్దుల రాజయ్య, చైతన్యకాలనీ

చైతన్యకాలనీలో ఏటా 20 నుంచి 30 ఇళ్లు నిర్మిస్తున్నారు. ప్రతి నెలా కొత్తగా పదుల సంఖ్యలో నిర్మాణాలు ప్రారంభమవుతున్నాయి. ఎల్ఆర్ఎస్ కింద మున్సిపాలిటీకి రూ.లక్షల్లో చెల్లిస్తున్నాం. ఎల్ఆర్ఎస్ రుసుం చెల్లించిన తరువాతే ఇళ్ల నిర్మాణాలకు అనుమతినిస్తున్నారు. ఇక్కడ వసూలు చేసిన నిధులను ఈ ప్రాంతానికే వెచ్చిస్తే కనీసం మురుగు కాలువల నిర్మాణమైనా జరిగేది.

ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు

-ఎం.శ్రీనివాస్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్

లేఅవుట్ అనుమతులు పొందిన వెంచర్లలో అన్ని రకాల మౌలిక వసతులుంటాయి. అనుమతి లేని చోట జరిగే నిర్మాణాలతోనే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ ప్రాంతంలో ఇంకుడుగుంతను తవ్వుకున్న వారికే ఇంటి నిర్మాణానికి అనుమతిస్తున్నాం. అయితే ఎవరూ నిబంధనలు పాటించడం లేదు. ఎల్ఆర్ఎస్ నిధులను ఏ ప్రాంతంలోనైనా వెచ్చించే అధికారం పురపాలికకు ఉంటుంది. ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నాం.

రేషన్ దందా సూత్రధారులెవరో!

పెద్దపల్లి : సుల్తానాబాద్ బియ్యం లారీల మళ్లింపు దందాలో కీలక విషయాలు వెలుగు చూస్తున్నాయి. మిల్లర్లే ఈ దందాకు సూత్రధారులని పోలీసుల దృష్టికి వచ్చింది. కరీంనగర్ పోలీస్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ రామారావు ఆధ్వర్యంలో దర్యాప్తు నిర్వహిస్తున్నారు. కరీంనగర్‌లోని తమ కార్యాలయంలో సుల్తానాబాద్ ఎంఎల్ఎస్ పాయింట్ డాటా ఎంట్రీ ఆపరేటర్ శ్రీనివాస్‌రెడ్డితో పాటు లారీ ఓనర్స్ కమ్ డ్రైవర్లు ఆంజనేయులు, వెంకటేశ్‌లను అదుపులోకి తీసుకుని విచారించారు. లారీలు మాయమైన విషయమై నిర్లక్ష్యం వహించిన పౌరసరఫరాల శాఖ సీనియర్ అసిస్టెంట్, ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌ఛార్జి వెంకట్రాజంను ఇప్పటికే జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేసిన విషయం విదితమే. డాటా ఎంట్రీ ఆపరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, లారీ డ్రైవర్లు ఆంజనేయులు, వెంకటేశ్‌లపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. త్వరలో వీరి అరెస్టు చూపి బియ్యాన్ని అక్రమంగా తీసుకుంటున్న మిల్లర్లపై క్రిమినల్ కేసు నమోదు చేసే అవకాశం ఉంది. మిల్లర్లకు సీఎంఆర్ కేటాయింపులపై నిషేధం, లైసెన్సులు రద్దు చేయాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. మరోవైపు బియ్యాన్ని అక్రమంగా తీసుకున్న మిల్లర్లు ఇప్పటికే ముఖ్య ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారనే విమర్శలున్నాయి. ప్రజా పంపిణీ బియ్యం భారీగా దారి మళ్లిన ఘటనను రాష్ట్ర పౌరసరఫరాల విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తీవ్రంగా పరిగణిస్తోంది. సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ దందాలో తెర వెనుక ఎవరెవరి హస్తం ఉందనే కోణంలో లోతుగా విచారణ జరుగుతోంది.

అవసరానికంటే 812 క్వింటాళ్లు అదనం అధికారుల పంచనామా ప్రకారం మాయమైన లారీల్లో ఒక దాంట్లో 450 బస్తాలు, మరో దాంట్లో 495 బస్తాలు కలిపి రెండు లారీల్లో 945 బస్తాలుండగా వీటి పరిమాణం 725 క్వింటాళ్లు. సుల్తానాబాద్ ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి ఓదెల, సుల్తానాబాద్, జూలపల్లి, ఎలిగేడు, కాల్వశ్రీరాంపూర్ మండలాల పరిధిలోని 125 రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా అవుతోంది.

అన్ని మండలాలకు కలిపి ప్రతి నెలా 1000 క్వింటాళ్ల బియ్యం అవసరం. అంటే ఈ కేంద్రానికి ఎక్కువలో ఎక్కువగా కనీసం 3 లారీల్లోని బియ్యం నిల్వలు కావాలి. కాగా 5 లారీల్లో దాదాపు 1,812 క్వింటాళ్ల బియ్యం అవసరం ఎందుకు వచ్చిందనేది అంతుచిక్కని ప్రశ్న. అంటే ఎంఎల్ఎస్ పాయింట్ నెలవారీ అవసరం పోగా అదనంగా 812 క్వింటాళ్ల బియ్యం పక్కదారి పట్టించిన ఘటన వెనుక ఎవరెవరు ఉన్నారని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆరా తీస్తున్నారు. సుల్తానాబాద్ ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌ఛార్జి వెంకట్రాజంతో పాటు డాటా ఎంట్రీ ఆపరేటర్ శ్రీనివాస్‌రెడ్డిలకు రేషన్ బియ్యం మాఫియా నుంచి నెలనెలా మామూళ్లు అందుతున్నట్లు ఆరోపణలున్నాయి. దళారులు తమకు తెలిసిన మిల్లర్లకు వారి కొనుగోలు శక్తికి అనుగుణంగా బియ్యం సరఫరా చేస్తుంటారు. ఈ క్రమంలోనే సుల్తానాబాద్‌లోని మిల్లర్లకు అవసరమైన 725 క్వింటాళ్లను పక్కదారి పట్టించినట్లు తెలుస్తోంది. లారీల మాయం దందాలో సుల్తానాబాద్‌కు చెందిన ముఖ్య దళారి పాత్రపైనే విజిలెన్స్ అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్‌లో హోటల్ నిర్వహిస్తూ అనధికారికంగా ఎంఎల్ఎస్ పాయింట్ అధికారులు, మిల్లర్ల మధ్య దళారి పాత్ర ఎత్తి రూ.కోట్ల అక్రమార్జనకు తెర తీసినట్లు తెలిసింది. ఆ కోణంలోనూ సమగ్ర విచారణ చేపట్టారు. నిబంధనల ఉల్లంఘనపై దృష్టివాస్తవానికి సుల్తానాబాద్ మండలం సుద్దాలలో ఉన్న స్టేజ్-1 వేర్‌హౌజింగ్ గోదాం పౌరసరఫరాల శాఖకు చెందినది. ఇక్కడి నుంచి ఎంఎల్ఎస్ పాయింట్‌కు బియ్యం తరలించాలంటే లారీలకు లైసెన్సులుండాలి. వీటికి ట్రాకింగ్ ఉండాలి.

మామిడికి భలే గిరాకీ..!

మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం మామిడి ఎగుమతులకు ప్రధాన కేంద్రంగా మారింది. కొన్నేళ్లుగా ఇక్కడి నుంచి వివిధ రాష్ట్రాలకు మామిడి ఎగుమతి అవుతోంది. గతంతో పోలిస్తే ఈ సారి మామిడి దిగుబడి ఆశించిన రీతిలో లేదని రైతులు చెబుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది 13305 ఎకరాల్లో మామిడి, 596 ఎకరాల్లో నిమ్మ, 70 ఎకరాల్లో సపోట తోటలు సాగు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ తోటల సాగు కొంత మేర తగ్గగా 5 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ పెరగడం విశేషం. జిల్లాలోని 16 మండలాల్లో అత్యధికంగా కురవి మండలం 2444 ఎకరాలు సాగుచేయగా, అత్యల్పంగా కొత్తగూడ మండలం 11 ఎకరాల్లో సాగు చేశారు. కాత ప్రారంభ దశలో ఆశించిన ధర లభిస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. ఇటీవల వచ్చిన వడగళ్ల వర్షాలకు మామిడి దిగుబడి బాగా తగ్గిపోయినట్లు రైతులు తెలిపారు. ఈ సారి ఎకరాకు 3 టన్నుల మేర దిగుబడి వస్తోందని ఉద్యానశాఖ అధికారులు పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి మామిడి కాయల రాక మొదలవడంతో దంతాలపల్లిలోని ప్రైవేటు మామిడి కొనుగోలు కేంద్రాలు మామిడితో కళకళలాడుతున్నాయి.

టన్నుకు రూ.56 వేలు...మామిడి దిగుబడి తగ్గడం దీనికి తోడు ఈదురు గాలులు, వడగళ్ల వర్షాలతో పంటకు నష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా 2367 ఎకరాల్లో మామిడి దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మొదటగా గ్రామీణ ప్రాంతాల్లో మామిడిని రైతులు విక్రయిస్తున్నారు.

దంతాలపల్లి మండల కేంద్రంలో మూడు రోజుల క్రితం ప్రైవేటు వ్యక్తులు మామిడి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సూర్యాపేట, ఖమ్మం, నల్గొండ, వరంగల్ రూరల్ జిల్లాలకు చెందిన రైతులు తాము పండించిన మామిడిని ఇక్కడికి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. గత కొన్నేళ్ల నుంచి ఇక్కడ మామిడి కొనుగోళ్లు కొనసాగుతుండటంతో పాటు ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు జరుగుతున్నాయి. రైతులు ఎక్కువగా తోతాపురి, బంగనపల్లి, రసాలు, దశేరి, సుందరి వంటి రకాలను సాగు చేశారు. ఇక్కడి మార్కెట్‌లో టన్నుకు గరిష్టంగా రూ.50 వేలు, కనిష్టంగా రూ.20 వేల ధర పలుకుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రత్యేక ప్యాకింగ్...మామిడిని కొనుగోలు చేసేందుకు ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు ఇక్కడికి వస్తున్నారు. మార్కెట్‌లో రైతుల నుంచి కాయల్ని కొనుగోలు చేసిన అనంతరం ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చిన కూలీలతో కాయ రకం, సైజును, రంగును బట్టి వేరు చేస్తారు. కాయల్ని శుభ్రం చేసి ప్లాస్టిక్ పెట్టెల్లో గడ్డి, పేపర్‌ల మధ్య భద్రపరుస్తారు. అనంతరం దిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, పంజాబ్, హర్యానా, రాజస్తాన్ రాష్ట్రాల్లోని మార్కెట్లకు ఎగుమతి చేస్తారు. ఆశించిన ధర పలుకుతుండటంతో ఏటా అక్కడి వ్యాపారులు ఇక్కడకు వస్తుంటారు.

బాల్యం బలంగా ఉండేలా!

మహబూబాబాద్ : పోషకాహార లేమితో చిన్నారులు ఈసురోమంటున్నారు. బరువు తక్కువగా ఉండడం వల్ల బలం, ఎదుగుదల లోపించడంతోపాటు మరికొన్ని సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. బాలల్లో పోషకాహార లేమిని నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని 2018లో ప్రారంభించి, అమలు బాధ్యతను మహిళా శిశు సంక్షేమ శాఖకు అప్పగించింది. తక్కువ బరువు కలిగిన బాలలను గుర్తించి వారికి పోషకాహారాన్ని అందించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని అంగన్‌వాడీ కేంద్రాలు భుజానికెత్తుకున్నాయి. నర్సంపేట ఐసీడీఎస్, సీడీపీవో ప్రాజెక్టు పరిధిలో ఇలాంటి పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చుకుని ప్రభుత్వ నిర్దేశిత మేరకు పోషక విలువలు కలిగిన బలవర్ధక ఆహారాన్ని అందించడంతో క్రమేపీ బరువు పెరుగుతున్నారు. తక్కువ బరువు కలిగిన వారికి అందించాల్సిన బలవర్ధక ఆహారం గురించి బాలల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. బరువు తక్కువగా ఉండడం వల్ల ఎదురయ్యే సమస్యలు వారి ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతుందో వివరిస్తూ పోషణ్ పఖ్వాడా కార్యక్రమాలను జరుపుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారులను పిలిచి చిరుధాన్యాల గురించి వివరిస్తున్నారు. కొర్రలు, సామలు, అరికెలు, రాగులు, జొన్నలు, సజ్జలు, కుసుమలు, అండుకొర్రలను చపాతీలు, రొట్టెలు, జావ, పిండి వంటకాలు ఎలా తయారు చేసి ఎలా పెట్టాల్లో వివరిస్తున్నారు.

ఇరవై నెలల పాప ఏడు కిలోలే

చిత్రంలోని చిన్నారి ఖానాపురానికి చెందిన మోకాళ్ల రక్షిత. 20 నెలలు నిండినా ఏడు కిలోలే బరువు ఉంది. ఎత్తు 74.5 అంగుళాలు. వాస్తవంగా 8.3 కిలోల బరువు ఉండాలి. సరైన పోషకాహారం అందకనే బరువు తక్కువగా ఉన్నట్లు ఐసీడీఎస్ సిబ్బంది ఆలస్యంగా గుర్తించారు. తల్లితండ్రులకు కౌన్సెలింగ్ చేసి డిసెంబరు నుంచి (నాలుగు నెలలు) సూపర్‌వైజర్ పోషకాహారం ఇచ్చారు. దీంతో బరువు 750 గ్రాములు పెరిగింది. అమ్మ చెంతన ఉన్న ఈ బాబు పేరు పెంతల కౌషిక్(5). బాల్యంలో ఎలర్జీ రావడంతో బక్కచిక్కి పోయాడు. ఎదుగుదల లోపించింది. వయసుకు తగ్గ బరువు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాడు. పౌష్టికాహారం అందించడంతో పాటు, ఆరోగ్యస్థితి నిత్యం పర్యవేక్షిస్తున్నాం. అన్ని రకాల మందులు సరఫరా చేయాలి.

నర్సంపేట రెండో నంబరు అంగన్‌వాడీ కేంద్రంలో ఆడుకుంటున్న చిన్నారి పేరు రేకుల సహస్ర. ఈమె వయస్సు 27 నెలలు. నిబంధనల మేరకు 90 అంగుళాల పొడవు ఉండాలి. కాని 86 అంగుళాలే ఉంది. బరువు 10.5 కిలోలకు 9.2 కిలోలుంది. దండ కొలత 16 సెంటీమీటర్లకు గాను 14.5సెం.మీ. ఉంది. ఈ పాపను ఈ నెలలో అంగన్‌వాడీ కేంద్రంలో చేర్చుకొని ఉదయం 7.30 గంటలకు బాలామృతం, 9.30 గంటలకు కోడిగుడ్డు, 11.30 గంటలకు పాలు, మధ్యాహ్నం 12.15- 1 గంట మధ్య మినీ భోజనం అదనంగా 5 గ్రాముల నూనె, గుజ్జుగా చేసిన కూరగాయలు, పండ్లు, జిల్లాలో ఐసీడీఎస్ సేవలు పొందుతున్న వారి వివరాలు

తీవ్ర పోషణ లోపం ఉన్నవారు: 408సాయంత్రం 5.30 గంటలకు బాలామృతం, రాత్రి 7.30 గంటలకు భోజనం, అదనంగా 5 గ్రాముల నూనె/నెయ్యి, పాలు ఇస్తున్నారు. నెల రోజుల్లో 100 గ్రాముల బరువు పెరిగింది.

ఈ పాప పేరు హనీ వయసు 14 నెలలు 76-80 ఇంచుల పొడవు ఉండాల్సి ఉండగా 70.4 ఇంచులు మాత్రమే ఉంది. బరువు 9 కిలోలకు బదులు 8 కిలోలు మాత్రమే ఉంది. అంగన్‌వాడీ కేంద్రంలో చేర్చుకొని రెండు నెలలైంది. నిర్దేశిత మెనూ ప్రకారం పోషకాహారాన్ని అందిస్తున్నారు. ఇదీ మంచి ఫలితాన్నిస్తోందని తల్లి లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ రాధ తెలిపారు. రెండు నెలల్లో పాప బరువు 8.4 కిలోలకు చేరినట్లు తెలిపారు.

పోషకాహార లోపంతో చిన్నారులు

చెన్నారావుపేట మండలంలో పోషకాహార లోపంతో సుమారు 50 మంది చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. జల్లి గ్రామానికి చెందిన వర్థెల్లి వరుణ్ వయసుకు తగిన బరువు ఉన్నా, ఎత్తుకు తగిన బరువు లేదు. తిమ్మరాయినిపహాడ్‌కు చెందిన అభిరాం వయసుకు తగిన బరువు, ఎత్తు లేకపోవడంతో గత ఏడాదిగా అంగన్‌వాడీ నుంచి ప్రత్యేక పోషకాహారం అందిస్తున్నారు. అయిలా ఎలాంటి అభివృద్ధి లేదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల తెలిపారు.

జిల్లాలో ఐసీడీఎస్ సేవలు పొందుతున్న వారి వివరాలు

ప్రాజెక్టులు: 3
మొత్తం పిల్లలు: 45034
పోషణ లోపం ఉన్న వారు: 1095
తీవ్ర పోషణ లోపం ఉన్నవారు: 408

కోతకు గురైన సైడ్‌బర్మ్

నాగారం : కోనరావుపేట మండలం నాగారం- మర్తన్‌పేట గ్రామాల మధ్య ప్రధాన తారు రోడ్డుకు ఇరువైపులా పలు చోట్ల సైడ్‌బర్మ్ మట్టి కోతకు గురైంది. ఏడాది క్రితం జిల్లా భూగర్భ, గనుల శాఖ నిధులు (డీఎంఎఫ్‌టీ) రూ.90 లక్షల వ్యయంతో తారు రోడ్డు నిర్మించారు. వర్షాకాలంలో కురిసిన వర్షాలకు తారు రోడ్డు పక్కన మట్టి కోతకు గురై ప్రమాదకరంగా తయారైంది. నిత్యం సిరిసిల్ల జిల్లా కేంద్రానికి, కోనరావుపేట మండల కేంద్రానికి ఆయా గ్రామాల వాహనదారులు, ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాల బారిన పడతారు. అధికారులు, పాలకులు స్పందించి సైడ్‌బర్మ్‌కు మట్టి పోయించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఎండుతున్న పంటలకు జీవం

రుద్రంగి : పెరుగుతున్న ఎండలు... పడిపోతున్న భూగర్భ జలాలతో పంట చేతికి రాక ముందే ఎండిపోతాయేమోనని అన్నదాతలు దిగులు చెందుతున్న తరుణంలో ఎల్లంపల్లి నీరు విడుదల చేయడంతో ఊరట లభించింది. మార్చి మొదటి వారంలోపే సాగు నీరు విడుదల చేస్తే కనీసం మరో 500 ఎకరాల్లోని పంటలు ఎండిపోకుండా కాపాడుకునే అవకాశం ఉండేది. కాస్త ఆలస్యమైనా మండలంలోని మెట్ట గ్రామాలకు నీరు చేరుకోవడంతో ఎండిపోయే దశలో ఉన్న పంటలకు ఊపిరి పోసినట్లైందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చందుర్తి మండలంలో ఈ యాసంగిలో వరి పంటను సుమారు 14 వేల ఎకరాల్లో సాగు చేశారు. నాట్లు వేసిన డిసెంబర్, జనవరి నెలల్లో బావులు, బోరుబావుల్లో పుష్కలంగా జలాలు ఉండటంతో పంటలకు ఈ ఏడాది ఇబ్బందులుండవని భావించారు. సాగు నీటి ఎద్దడి ప్రారంభమయ్యే మార్చి నెల ప్రారంభం నాటికి ఎల్లంపల్లి నీరు మండలంలోని అన్ని గ్రామాలకు చేరుతాయని ఆశించారు. అయితే మార్చి ప్రారంభం నాటికి కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని నారాయణపూర్ చెరువులోకి నంది మేడారం పంపుహౌజ్ నుంచి నీటిని ఎత్తిపోసేందుకు మోటార్లను ప్రారంభించారు. పంపులకు ఉన్న గేట్‌వాల్వ్‌లో సమస్య ఏర్పడంతో నంది మేడారం పంపుహౌజ్‌లోని మోటార్లు మునిగిపోయాయి. పది రోజుల్లో మరమ్మతులు చేసి మళ్లీ మోటార్లను ప్రారంభించారు. దీంతో ఎల్లంపల్లి నీరు చందుర్తికి వరకు వచ్చేందుకు సమయం ఎక్కువగా పట్టిందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఎల్లంపల్లి కాలువలకు దగ్గర్లో ఉన్న రైతులు కాలువల్లో మోటార్లను ఏర్పాటు చేసుకుని పైప్‌లైన్లను వేసుకుని పంటలకు నీటిని అందిస్తున్నారు. దీంతో పంటపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

రుద్రంగికి ఎప్పుడు?

చందుర్తి మండలం వరకు వచ్చిన ఎల్లంపల్లి జలాలు రుద్రంగి మండలానికి మాత్రం చేరుకోలేదు. చందుర్తి మండలం లింగంపేటలో ఉన్న పైప్‌లైన్ మరమ్మతులకు గురికావడంతో రుద్రంగికి నీరు ఎత్తిపోసే పరిస్థితి లేదు. మరో వైపు పైప్‌లైన్ సమస్యతో పాటు రుద్రంగిలోని నాగారం చెరువులోకి ఎల్లంపల్లి నీళ్లను తీసుకువెళ్లే మాటు కాలువ మూడు ప్రాంతాల్లో గతేడాది కురిసిన వర్షాల కారణంగా ధ్వంసమైంది. వీటికి మరమ్మతులు చేయాల్సిన అధికారులు కనీసం ధ్వంసమైన కాలువ వైపు వెళ్లి చూడట్లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ యాసంగిలో రుద్రంగి మండల కేంద్రంలో వరి పంట సుమారు 3 వేల ఎకరాల్లో సాగు చేశారు. ఇందులో సాగు నీటి కొరత కారణంగా సమీపంలోని చెరువులు, కుంటల్లో మోటార్లు పెట్టి, వందల మీటర్ల పొడవునా పైప్‌లైన్‌లు ఏర్పాటు చేసుకుని పంటలకు అందిస్తున్నారు. దీనికి ఒక్కో రైతు రూ.50 వేల పైనే వ్యయాన్ని చేస్తున్నారు. మరికొందరు సమీపంలోని బోరుబావుల్లో నీరు సమృద్ధిగా ఉన్న రైతులకు డబ్బులు చెల్లించి పంటలను కాపాడుకుంటున్నారు. ఇరిగేషన్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి రుద్రంగికి వచ్చే పైప్‌లైన్, మాటు కాలువకు మరమ్మతులు చేయించేందుకు చర్యలు చేపట్టాలని కర్షకులు కోరుతున్నారు.

ఇప్పటికే ఎకరం ఎండిపోయింది

లోలపు చంద్రమోహన్, రైతు, నర్సింగాపూర్

నేను ఈ యాసంగిలో మూడు ఎకరాల్లో వరి సాగు చేశాను. మార్చి ప్రారంభం నుంచి సాగు నీటి కొరత ఏర్పడింది. ఇప్పటికే ఎకరం మేర ఎండిపోగా ప్రస్తుతం వస్తున్న ఎల్లంపల్లి కాలువ నీటితో రెండు ఎకరాల్లోని పంటను రక్షించుకోగలిగాను. లేదంటే మొత్తం పంట ఎండిపోయేది.

సమస్య తీవ్రమైన సమయంలో...బొజ్జ లింగయ్య, రైతు, ఆశిరెడ్డిపల్లె

నాకున్న నాలుగు ఎకరాల్లో వరి పంట వేశాను. ప్రస్తుతం గింజ తయారయ్యే దశలో ఉంది. ఇలాంటి తరుణంలోనే సాగునీటి సమస్య తీవ్రమైంది. పంటలను ఎలా రక్షించుకోవాలో అర్థం కాని సమయంలో ఎల్లంపల్లి నీళ్లు వచ్చాయి. సరైన సమయంలో రాకపోతే కనీసం రెండు ఎకరాల్లోని పంట ఎండిపోయేది.

పైప్‌లైన్, కాలువలకు మరమ్మతులు చేయాలి

బండారు మహేశ్, రైతు, రుద్రంగి

నేను ఈ యాసంగిలో ఏడు ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. నా సొంత పొలం నాలుగు ఎకరాల్లో సాగునీటి కొరత లేకపోయినా కౌలు చేస్తున్న మూడు ఎకరాలకు నీటి కొరత తీవ్రంగా ఉంది. పక్కనున్న మరో రైతుకు రూ.10 వేలు ఇచ్చి అతని బోరుబావి నీటితో పంటకు నీరు అందిస్తున్నాను. రుద్రంగికి కూడా ఎల్లంపల్లి నీరు వస్తే ఈ ఇక్కట్లు తప్పేవి.

ఆదాయ వనరుగా ఇంధన విక్రయం

పెద్దపల్లి : నష్టాల బాటలో ఉన్న ఆర్టీసీని లాభాల్లోకి తేవడానికి సంస్థ యాజమాన్యం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. ఇందుకోసం సొంత వనరులను సద్వినియోగం చేసుకోవాలని భావిస్తోంది. సంస్థకు చెందిన ఖాళీ స్థలాల్లో పెట్రోలు బంకులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌తో ఒప్పందం కుదుర్చుకొంది. ఉమ్మడి జిల్లాలో నాలుగు ప్రయాణ ప్రాంగణాల్లోని స్థలాల్లో పెట్రోల్ బంకులు అందుబాటులోని రానున్నాయి. ఇప్పటికే కరీంనగర్‌లో సేవలు అందిస్తుండగా, పెద్దపల్లిలో పనులు తుది దశకు చేరుకున్నాయి. కోరుట్ల, జగిత్యాల పట్టణాల్లో స్థల సేకరణ పూర్తయింది. త్వరలో పనులు ప్రారంభించేందుకు ఇంజినీరింగ్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి

ఉమ్మడి జిల్లాలో ఆర్టీసీకి 11 డిపోలు, 44 ప్రయాణ ప్రాంగణాలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 900 బస్సులు ప్రయాణికులను గమ్య స్థానాలకు చేరుస్తున్నాయి. అయితే కొన్ని చోట్ల సంస్థ స్థలాలకు రక్షణ కరవైంది. పట్టణ ప్రాంతాల్లో భూముల ధరలు చుక్కలనంటుతున్నాయి. విలువైన స్థలాలను రాజకీయ పలుకుబడితో కబ్జాదారులు ఆక్రమించుకుంటున్నారు. అన్యాక్రాంతమవుతున్న స్థలాలను పరిరక్షించి, అదనపు ఆదాయం పొందేందుకు ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రద్దీగా ఉండే పట్టణ ప్రాంతాల్లో పెట్రోలు బంకులు ఏర్పాటు చేసి ఆదాయ వనరుగా మార్చుకోవాలని యోచిస్తున్నారు.

ఖాళీ స్థలాల సద్వినియోగంఇప్పటివరకు డిపోల ఆవరణలోని బంకుల్లో నుంచే బస్సులకు డీజిల్‌ను వినియోగిస్తున్నారు. అయితే వివిధ కారణాలతో అక్కడక్కడ మూతపడుతున్నాయి. దీంతో సొంత అవసరాలకు కూడా ప్రైవేటు బంకుల నుంచి డీజిల్ కొనుగోలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సంస్థకు చెందిన ఖాళీ స్థలాల్లో బంకులు ఏర్పాటు చేసి సొంత బస్సులతో పాటు ప్రైవేటు వినియోగదారులకు విక్రయించాలని నిర్ణయించారు. ఉమ్మడి జిల్లాలో కరీంనగర్, జగిత్యాల పట్టణాల్లో బస్సు డిపో, పెద్దపల్లి, కోరుట్ల ప్రయాణ ప్రాంగణాలకు చెందిన స్థలాల్లో బంకుల ఏర్పాటుకు ఆమోదం లభించింది. కరీంనగర్‌లోని వర్క్‌షాప్ వద్ద బంకు అందుబాటులోకి వచ్చింది. పెద్దపల్లిలో పనులు తుది దశకు చేరుకున్నాయి. కోరుట్ల, జగిత్యాలలో పనులు ప్రారంభించనున్నారు.

ఎట్టకేలకు ఊతం!

ఖమ్మం : ఎట్టకేలకు ప్రత్యేక అవసరాలుగల పిల్లలకు గతేడాది భత్యం విడుదలైంది. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అంధత్వం, తక్కువ దృష్టి, వినికిడి లోపం, శారీరక వైకల్యం, మానసిక వైకల్యం, ఆటిజమ్, బహుళ వైకల్యం, మానసిక లోపం తదితర 21 రకాల రుగ్మతలు కలిగిన ప్రత్యేక అవసరాలు గల పిల్లలు 1730 మంది ఉన్నారు. వీరికి గతేడాది (2021-22) రావాల్సిన అలవెన్స్‌లు మంజూరయ్యాయి. ఈ విద్యా సంవత్సరం (2022-23) భత్యాలు విడుదల కావాల్సి ఉంది.

ఎవరెవరికి ఏ భత్యం?

భవిత కేంద్రాలకు వెళ్లే ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రతి నెలా రవాణా భత్యం, పాఠశాలకు వెళ్లే పిల్లలకు (సహాయకులతో కలిసి) ఎస్కార్ట్ అలవెన్స్ ఇస్తారు. ఒక్కొక్కరికీ రూ.500 చొప్పున ప్రతినెలా అందించాల్సి ఉంది. వీటితోపాటు బాలికలకు ఉపకార వేతనం కింద నెలకు మరో రూ.200, అంధత్వం సమస్య ఉన్న పిల్లలకు రీడర్ అలవెన్స్ కింద నెలకు రూ.60 చొప్పున అందిస్తారు.

రూ.10.80 లక్షలు విడుదల

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఎస్కార్ట్, ట్రావెల్ అలవెన్స్‌లు గతేడాది (2021-22)కి సంబంధించిన రూ.10.80 లక్షలను ఇటీవల ప్రభుత్వం విడుదల చేసింది. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి.

మరో రూ.20.70 లక్షల కోసం..

గతేడాది సాయం లభించినా 2022-23 సంవత్సరానికి సంబంధించిన అలవెన్స్‌లు ఇంకా రాలేదు. అధికారులు దీనికి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించారు. ఈ ఏడాది 554 మందికి మొత్తం రూ.20,70,900 రావాల్సి ఉంది. కొద్ది రోజుల్లో ఇవికూడా విడుదలవుతాయని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. ఇప్పటికే బ్యాంకు ఖాతాలు తేడా ఉన్న 30మందివి గుర్తించి ఉన్నతాధికారులకు పంపించారు.“ప్రత్యేక అవసరాల పిల్లలకు సంబంధించిన అలవెన్సులు (2021-22) లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. ఈ విద్యా సంవత్సరానివి రెండు, మూడు రోజుల్లో మంజూరు కానున్నాయి.”

సైదులు, సమ్మిళిత విద్యా జిల్లా సమన్వయకర్త

మరోసారి సత్తా చాటిన మరియపురం

వరంగల్ : గీసుకొండ మండలంలోని జాతీయ ఉత్తమ గ్రామమైన మరియపురం మరోసారి తన సత్తా చాటి రాష్ట్ర స్థాయిలో రెండు అవార్డులకు ఎంపికైంది. గతేడాది ఈ గ్రామం జాతీయ స్థాయిలో ఉత్తమ గ్రామంగా ఎంపికవగా ఈ ఏడాది రాష్ట్రంలో ఉత్తమ గ్రామంగా ఎంపికవడం గమనార్హం. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ స్టేట్ వికాస్ పురస్కార్, నేషనల్ పంచాయతీ అవార్డులను 2021-22 సంవత్సరానికిగాను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. 9 అంశాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకుగాను రాష్ట్రంలో మొత్తం 27 గ్రామపంచాయతీలను ఉత్తమ గ్రామాలుగా ఎంపిక చేసి ప్రకటించింది. జిల్లాలో అన్ని అంశాలకు పోటీ పడి మరియపురం తొమ్మిది అంశాల్లో నూరుశాతం ఫలితాలను సాధించగా, రాష్ట్ర స్థాయిలో ఆరోగ్యకరమైన

పంచాయతీ అనే అంశంపై ప్రథమ స్థానానికి ఎంపికైంది. కాలుష్యరహిత గ్రామంగా కార్బన్ నేచురల్ విశేష్ పంచాయతీ పురస్కారం (సీఎన్‌వీపీపీ) కింద మరో ప్రత్యేక అవార్డుకు ఎంపిక చేశారు. గ్రామంలో సోలార్ దీపాల ఏర్పాటు, పెంచడంలో ముందంజలో నిలిచింది.

జాతీయ స్థాయిలోనూ అవార్డు వస్తుంది

- అల్లం బాలిరెడ్డి, మరియపురం సర్పంచి

రాష్ట్రస్థాయిలో మా గ్రామానికి రెండు అవార్డులు రావడం చాలా సంతోషంగా ఉంది. ప్రజలు అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు తనకు పూర్తి స్థాయిలో సహకరించడంవల్లే ఇది సాధ్యమైంది. తన పదవీకాలం పూర్తయ్యేలోగా గ్రామం మొత్తం సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసి ఎవరికి కావాల్సిన విద్యుత్తును వారే సొంతంగా తయారు చేసుకునేలా కృషి చేస్తా. మరోసారి జాతీయ స్థాయిలో అవార్డు వస్తుందని అనుకుంటున్నా.

బస్తీ పిల్లలకు స్వర్గధామాలు

వరంగల్ : పేదల బస్తీలంటే ఎటు చూసినా గుడిసెలు, మురికి కాలువలు కనిపిస్తాయి. ఇక్కడి వారికి మంచి ఆటస్థలాలు కూడా అందుబాటులో ఉండవు. అలాంటిది ఆహ్లాదకరమైన ఆటమైదానాలను వారి కోసం సిద్ధం చేస్తోంది వరంగల్ మహానగరపాలక సంస్థ. వరంగల్, హనుమకొండల్లో ఇప్పటికే మురికివాడల పిల్లల కోసం అయిదారు పార్కులు సిద్ధమయ్యాయి. ఉదయం, సాయంత్రం, సెలవు దినాల్లో పిల్లలు ఇందులో ఆడుకుంటున్నారు. వారికి ఈ పార్కులు స్వర్గధామంలా ఉన్నాయి.గతేడాది కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ దేశవ్యాప్తంగా వంద ఆకర్షణీయ నగరాల్లో ‘నర్చరింగ్ నైబర్‌హుడ్ ఛాలెంజ్’ కింద ఒక పోటీ పెట్టింది. తల్లులు, పిల్లలకు (మాతాశిశు) ఆహ్లాదం పంచేలా ఆయా నగరాల్లో పార్కులు, ఆటస్థలాల అభివృద్ధి చేయాలన్నది దీని లక్ష్యం. ఈ క్రమంలో వరంగల్ ఎంహెచ్ నగర్, కాశీబుగ్గ క్రిస్టియన్ కాలనీల్లోని చెత్తాచెదారంతో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను ఎంపిక చేసుకొని పిల్లలు ఆడుకునేలా ఉద్యానవనంగా మార్చారు. దీనికి ‘చిట్టి పార్కు’లుగా నామకరణం చేశారు. వరంగల్ మహానగరపాలక సంస్థ 44, 72 గంటల్లో వీటి నిర్మాణం శరవేగంగా పూర్తి చేసింది. దేశవ్యాప్తంగా పది నగరాలు ఈ పోటీలో విజేతలుగా నిలిస్తే అందులో వరంగల్ ఒకటి.

పిల్లలను ఆకట్టుకునేలా..

గ్రేటర్ వరంగల్ అధికారులు నగరంలోని మరికొన్ని మురికివాడలు, ఇతర ప్రాంతాల్లో పిల్లలకు ఆట స్థలాలను ఏర్పాటు చేస్తున్నారు. వరంగల్ మైసయ్య నగర్‌లో చిన్నారుల కోసం మైక్రో పార్కును నిర్మించారు. గుండుబావిలో సైతం పిల్లల కోసం మరొకటి తీర్చిదిద్దారు. వీటి గోడలపై రంగురంగుల అక్షరాలు, బొమ్మలు ఆకట్టుకుంటున్నాయి. పిల్లలు ఆడుకునే సరదా రైడ్లు, చిన్న వ్యాయామాలు చేసే పరికరాలను ఏర్పాటుచేశారు. వీటితోపాటు, హనుమకొండ శ్రీనగర్‌కాలనీలో ఏర్పాటుచేసిన పార్కులో పిల్లలు కాసేపు ఆడుకున్నాక అక్కడే చదువుకునే వసతులు కల్పించారు. రాజీవ్‌నగర్ పార్కులో రాత్రి పది గంటల వరకు పరిసరాల్లోని చిన్నారులు స్వేచ్ఛగా ఆడేందుకు హైమాస్ట్ లైట్లను ఏర్పాటుచేసి, ఆట వస్తువులు అందుబాటులో పెట్టింది బల్దియా. ఉదయం వేళ బడికి వెళ్లే తొందరలో పార్కుకు వచ్చే వీల్లేకపోయినా, సాయంత్రం నుంచి రాత్రి వరకు స్వేచ్ఛగా ఆడుకునేందుకు చిన్నారుల కోసం నైట్ పార్కులను కూడా సిద్ధం చేస్తున్నారు. వరంగల్ స్మార్ట్ సిటీ పథకం కింద ఉన్నందున హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌ను సైతం స్మార్ట్‌సిటీ నిధులతో తీర్చిదిద్ది రాత్రివేళ చిన్నారులు స్వేచ్ఛగా గడిపే వసతులు కల్పించారు.

కసరత్తు ఏది?



ఖమ్మం : మారుతున్న జీవన శైలికి అనుగుణంగా ప్రతి పురపాలకంలో వీలైనన్ని ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉభయ జిల్లాల్లోని ప్రధాన కేంద్రాలు మినహా మిగిలిన పట్టణాల్లో వీటి ఏర్పాటుపై దృష్టి సారించటం లేదు. క్రీడా మైదానాలు, పట్టణ ప్రకృతి వనాలు ఏర్పాటు చేసిన ప్రతిచోటా అందుబాటులో తెచ్చేందుకు వీలున్నా ఆ దిశగా అడుగులు పడటం లేదు. చాలా పురపాలకాల్లో అవసరాలకనుగుణంగా ఓపెన్ జిమ్‌లు లేవు. కొన్నిచోట్ల ఉన్నవాటినీ వినియోగించుకోలేని దుస్థితి.

అధికారులు చెబుతున్నదేంటి? ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు స్థలాల కొరతను బూచిగా చూపుతున్నాయి. ఒక్కో వార్డుకి ఒక్కోటి ఏర్పాటు చేయాలి. మణుగూరు సత్తుపల్లి, వైరా వంటి పురపాలకాల్లో ఒక్కటీ ఏర్పాటు చేయలేదు. అందుబాటులో ఉన్న కొద్దిపాటి స్థలంలోనే పరికరాలు ఏర్పాటు చేసుకొనే వెసులుబాటు ఉంది. కాని ఆ అవకాశాన్ని అధికారులు వినియోగించుకోవటం లేదు. దీంతో పట్టణ ప్రజలకు వ్యాయామ సాధన ఇబ్బందికరంగా ఉంది. నెలకు రూ.వందలు ఖర్చుచేసి ప్రైవేట్ జిమ్‌లకు వెళ్లలేక రహదారులు, పాఠశాలల క్రీడామైదానాల్లో నడక సాధన చేస్తూ కాలం వెల్లదీస్తున్నారు.వైరా పురపాలకంలో 20 వార్డులుండగా ఒక్కచోట కూడా ఓపెన్ జిమ్ ఏర్పాటు కాలేదు. జలాశయం ఆనకట్టపై రెండుచోట్ల, వైరా క్రాస్‌రోడ్డులో ఇండోర్ పక్క మరోటి ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇండోర్ పక్కన ఓపెన్‌జిమ్ ఏర్పాటుపై కలెక్టర్ పలుసార్లు సూచనలు చేసినా పురోగతి లేదు. స్థానికులకు ఇది అనుకూల ప్రాంతం. జలాశయం ఆనకట్టను రూ.కోట్లతో అభివృద్ధి చేశారు. ఇటుగా వ్యాయామం చేసేందుకు ఎక్కువ మంది వెళ్తున్నా ఓపెన్‌జిమ్ ఏర్పాటు కావడం లేదు.సత్తుపల్లిలో 23 వార్డులకు జేవీఆర్ పార్కు వద్ద మాత్రమే ఓపెన్ జిమ్ ఉంది. జేవీఆర్ డిగ్రీ మైదానం, దామోద చెరువు దగ్గర ఏర్పాటుకు నిర్ణయించినా కార్యరూపం దాల్చలేదు.మధిరలోని 22 వార్డులకు వైరానది ఒడ్డున, ఎస్సీ కాలనీ సమీపంలో మాత్రమే ఏర్పాటు చేశారు. ఇల్లెందులో 24 వార్డులకు రెండుచోట్ల ఏర్పాటుచేసినా వాటి వినియోగంపై ప్రజలకు అవగాహన లేక నిరుపయోగంగా ఉంటున్నాయి. ఇంకోటి నిర్మాణంలో ఉంది. మణుగూరు పట్టణంలో ఇప్పటివరకు ఒక్కటీ ఏర్పాటు చేయలేదు. నిర్మాణాలకు ఎలాంటి ప్రతిపాదనలు చేయకపోవటం గమనార్హం. నిధులు, స్థల కొరతతో ప్రణాళికలు చేయలేదని అంటున్నారు. పాల్వంచ పట్టణంలో 24 వార్డులు ఉన్నాయి. కేవలం ఒక్కచోట మాత్రమే అందుబాటులోకి తెచ్చారు. అంత పెద్ద పట్టణానికి అది చాలదు.ఖమ్మం కార్పొరేషన్, కొత్తగూడెం వంటిచోట్ల మాత్రమే సింహభాగం ఓపెన్‌జిమ్‌లున్నాయి. ఆయాచోట్ల గతం నుంచి స్థలాలు ఉండటం, వెంచర్ల నుంచి తీసుకున్న స్థలాల లభ్యత సానుకూలంగా ఉంది. ఇతర పురపాలకాల్లో అలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం లేదు.

నిధుల సమస్యను అధిగమించొచ్చు

ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు నిధుల సమీకరణ ఇబ్బంది కాదనే వాదన ఉంది. రెండున్నరేళ్లుగా మున్సిపాలిటీలకు పట్టణ ప్రగతి నిధులు ఆశాజనకంగా ఉన్నాయి. వైరా, సత్తుపల్లి, మధిర, మణుగూరు, ఇల్లెందు వంటి పురపాలకాలకు ప్రతి నెలా రూ.30 లక్షల కంటే ఎక్కువ అందాయి. వ్యాయామానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో వీటి ఏర్పాటు వల్ల మహిళలు, యువత, వృద్ధులు.. అన్ని వర్గాల వారికి ఊరట కలగనుంది.

కబ్జాదారుల కోరల్లో ఎనుమాముల

వరంగల్ : గతంలో వెనకబడిన ప్రాంతంగా ఉన్న ఎనుమాముల క్రమంగా అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది. గత ఏడాది లేబర్ కాలనీ నుంచి ఎనుమాముల వైపు వచ్చే వంద అడుగుల రహదారి విస్తరణ బాలాజీనగర్ కూడలి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతో ఒక్కసారిగా వెనక బడిన ఎనుమాముల ప్రాంతం అభివృద్ధికి చేరువైంది. దీంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. వంద అడుగుల ప్రధాన మార్గంలో గజానికి రూ.30 వేల వరకు ధర పలుకుతుండడంతో స్థిరాస్తి వ్యాపారం ఊపందుకుంది. దీంతో ఎనుమాముల ప్రాంతంలో ఆరుమాసాలుగా కబ్జాల పర్వం మొదలైంది. సాక్షాత్తు స్థానిక కార్పొరేటర్ భర్త తూర్పాటి సారయ్యనే పోలీసులు అదుపులోనికి తీసుకుని విచారణ చేపట్టడం పరిస్థితికి అద్దం పడుతోంది. కార్పొరేటర్ భర్త సోదరుడి కొడుకులు తూర్పాటి రఘు, శ్రీనివాస్, ఇద్దరు, జంగం రాజు, గంద్రాతి భాస్కర్ అనే ఇద్దరు భారాసా నాయకులు అరెస్టైన వారిలో ఉన్నారు. రాజకీయ అండతోనే కబ్జాలకు తెరలేపడంతో బాధితులు ఆరుమాసాలుగా అష్టకష్టాలు పడ్డారు. చివరికి వరంగల్ సీపీ రంగనాథ్ రూపంలో బాధితులకు అండ లభించింది. భూకబ్జా విషయంలో పోలీసులు విచారణ చేపట్టారు. సీపీ రంగనాథ్ ఆదేశానుసారం ఎస్ఐ శ్రీకాంత్, ఇద్దరు కానిస్టేబుళ్లు పోలీసు సిబ్బంది ఎనుమాములకు చేరుకుని ప్లాట్ల యజమానులతో మాట్లాడారు. గత రెండురోజులుగా రికార్డులు పరిశీలించిన విషయాలను క్రోడీకరించి స్థలం ఎవరిది, ఎవరు కబ్జా చేశారనే కోణంలో వివరాలు సేకరించారు. అనంతరం గత నెలలో ఓ ప్లాటులో పాతిన బోర్డును పోలీసుల సమక్షంలోనే బాధితులు తొలగించారు.

మాజీ కార్పొరేటర్ కనుసన్నల్లో..వరంగల్ ఎనుమాముల, కాశీబుగ్గ పరిసర ప్రాంతాలలో అధికార పార్టీకి చెందిన ఓ మాజీ కార్పొరేటర్ రియల్టర్, అవతారమెత్తిన ఓ అడ్తి వ్యాపారి, మరో ముగ్గురు కలసి ఎనుమాముల శుభం గార్డెన్స్ సమీపంలో ఏకంగా రహదారినే కబ్జా చేశారు. అడిగిన స్థానిక కాలనీ వాసులను బెదిరించారు. ఈ విషయమై ఎనుమాముల వాసులు వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్‌ను కలసి విన్నవించుకున్నా అక్రమణలు తొలగలేదని స్థానికులు వాపోతున్నారు. కోటిలింగాల దేవాలయం సమీపంలో మరో రియల్టర్, కాశీబుగ్గకు చెందిన ఓ బిర్యాని సెంటర్ యజమాని కలిసి రోడ్డుపైనే నిర్మాణం చేపట్టారు. ఇదేమిటని అడిగితే ఎక్కడ దాడి చేస్తారోనని జనం భయపడుతున్నారు.

యువికా.. సృజన వేదిక

వరంగల్ : అంతరిక్షం గురించి తెలుసుకోవాలనే ఆసక్తి అందరిలోనూ ఉంటుంది.. విద్యార్థి దశ నుంచే ప్రత్యేక శిక్షణ ఇచ్చి.. వారి ఆలోచనలకు మెరుగులుదిద్దితే.. భావి శాస్త్రవేత్తలుగా ఎదుగుతారు. ఈ విషయాన్ని గుర్తించిన ఇస్రో(అంతరిక్ష పరిశోధనా సంస్థ) ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అబ్దుల్ కలాం స్ఫూర్తితో యువ విజ్ఞాన్ కార్యక్రమం(యువికా) రూపొందించింది. అంతరిక్ష కేంద్రంలో జరిగే ప్రయోగాలు, పరిశోధనల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలని నిర్ణయించింది. ఈ మేరకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఏప్రిల్ 3వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 9వ తరగతి విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.

కార్యక్రమం ఇలా.. : ఎంపికైన విద్యార్థులకు శిక్షణ కాలంలో బస, భోజనంతో పాటు రవాణా ఛార్జీలు అందజేస్తారు. మే 15 నుంచి 26వ తేదీ వరకు శిక్షణ ఉంటుంది. ఎంపికైన విద్యార్థులతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరు అంతరిక్ష కేంద్రాలకు చేరుకునేందుకు అవకాశం కల్పిస్తారు. ఇస్రోకు చెందిన అహ్మదాబాద్, బెంగళూరు, షిల్లాంగ్, తిరువనంతపురం, శ్రీహరికోట, హైదరాబాద్ కేంద్రాల్లో శిబిరాలు నిర్వహిస్తారు. శిక్షణ అనంతరం శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో ప్రముఖ శాస్త్రవేత్తలతో ముఖాముఖి, చర్చా వేదికలు, ప్రయోగాల సందర్శన, సమావేశాల్లో పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. అంతరిక్ష శాస్త్రం, రాకెట్ ప్రయోగాలకు సంబంధించిన అంశాలపై ప్రాథమిక అవగాహన కల్పిస్తారు.

నాలుగు దశల్లో : ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు విధానం నాలుగు దశల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. %www.isro.gov.in% వెబ్‌సైట్‌లో యువికా అప్లికేషన్ ఎంచుకుని, ఈ-మెయిల్ ఐడీతో లాగిన్ అవ్వాలి. నమోదు చేసిన 48 గంటల్లో ఇస్రో ఏర్పాటు చేసే ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనాలి. తర్వాత విద్యార్థి పూర్తి వివరాలు పొందుపర్చాల్సి ఉంటుంది. 8వ తరగతిలో 60 శాతం మార్కుల ప్రతిభ చూపి ఉండాలి. గ్రామీణ ప్రాంత విద్యార్థులు 15 శాతం ప్రతిభ చూపాలి. జిల్లా స్థాయి వ్యాసరచన, ఉపన్యాస, క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేయాలి. దరఖాస్తులను పరిశీలించి ఏప్రిల్ 20న అర్హుల జాబితా ప్రకటిస్తారు. ఎన్‌సీసీ, స్కౌట్‌లో సభ్యత్వం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందని భూపాలపల్లి జిల్లా సైన్స్ అధికారి బి.స్వామి తెలిపారు.

నీటి గోస వినేదెవరు?

వరంగల్ : రోజూ తాగునీటి సరఫరా కలగానే మిగిలింది. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశించినా అడుగులు పడటం లేదు. కార్యాలయాల్లో సమావేశాలు, సమీక్షలు తప్ప క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. పాలకవర్గం పెద్దలు, అధికారులు కదలడం లేదు. ఎండా కాలం మొదలైంది. తాగునీటి అవసరాలు పెరిగాయి. సరిపడా తాగునీరు ఇవ్వాల్సిన బాధ్యత గ్రేటర్ వరంగల్‌దే. పాలకవర్గం, ఇంజినీర్లు పట్టింపు లేకుండా ఉన్నారని ప్రజలు వాపోతున్నారు. ప్రజావాణిలో నీటి సరఫరాపై 9 ఫిర్యాదులు వచ్చాయి. తాగునీళ్లు ఇవ్వండని అధికారులను వేడుకున్నారు. రెండు, మూడు వారాలుగా సరఫరా అస్తవ్యస్తంగా మారినా ఎవరికీ పట్టడం లేదు. మేయర్ సుధారాణి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నరేందర్ నిర్వహించిన సమీక్ష సమావేశాల్లో అంతా బాగుందని ఇంజినీర్లు చెబుతున్నారు. కాలనీల్లో చూస్తే పరిస్థితి మరోలా ఉంది. కలుషితమైన నీళ్లు వస్తున్నాయని, పాత నల్లాలు ఆకస్మాత్తుగా బంద్ చేయడం, మిషన్ భగీరథ నీళ్లు సరిగ్గా రావడం లేదని ప్రజలు వివరించారు.

మానిటరింగ్ సెల్ పనిచేస్తుందా?

నగరంలోని 66 డివిజన్లలో తాగునీటి సరఫరా తీరును తెలుసుకునేందుకు మానిటరింగ్ సెల్ ప్రారంభించారు. ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ, చివరి ఇంటికి నీటి సరఫరా జరిగిందీ లేనిదీ అడిగి

తెలుసుకోవడం ముఖ్య ఉద్దేశం. ఈ లక్ష్యం నెరవేరడం లేదు. రోజూ ఎవరితో మాట్లాడుతున్నారు? సమస్యలేమిటనేది ఎవరికీ తెలియదు. క్షేత్రస్థాయిలో కీలకంగా పనిచేయాల్సిన కొందరు డీఈ, ఏఈలు నీటి సరఫరాను పట్టించుకోవడం లేదు.

ఇవిగో ఉదాహరణలు

హనుమకొండ పద్మాక్షిగుట్ట రోడ్డులో నీటి సరఫరా లేదు. కొత్తూరు జెండా, కుమార్‌పల్లి, రెడ్డికాలనీల్లో కలుషితమైన నీళ్లు వస్తున్నాయి. వరంగల్ వేణురావు కాలనీ, మండిబజారు, రామన్నపేట, పాపయ్యపేట, సంతోషిమాత కాలనీ, ఉర్సు, రంగశాయిపేట ప్రాంతాల్లో నల్లాల ద్వారా రంగు మారిన నీళ్లు వస్తున్నాయి.

మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న 29వ డివిజన్‌లో పలు కాలనీలకు నీటి సరఫరా ఆగింది. రామన్నపేట పెద్దమోరీ పనుల కోసం పైపులు తవ్వి వదిలేశారు. శివనగర్ పల్లవి ఆసుపత్రి లైన్‌లో నీటి సరఫరా పునరుద్ధరించ లేదు. 40వ డివిజన్ ఉర్సు సుభాస్‌నగర్, బొడ్రాయి, కుమ్మరివాడ, ప్రతాప్‌నగర్ తదితర కాలనీల్లో పాత నల్లాల ద్వారా సరఫరా ఆపేశారు. మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరావు అవుతున్న లీకేజీలతో కలుషితమైన నీరు వస్తుందని ప్రజలు వాపోతున్నారు. 41, 42వ డివిజన్ ఉర్సు పార్కు, రంగశాయిపేట, కాపువాడ, ఎస్సీ కాలనీ, శంభునిపేట ప్రాంతాల్లో నీటి సరఫరా క్రమం తప్పింది.

విదేశీ విద్యకు సహకారం

వరంగల్ : ఒకప్పుడు సంపన్నులు, ఉన్నత వర్గాలకు చెందిన వారే విదేశాల్లో ఉన్నత చదువులకు వెళ్లేవారు.. ప్రస్తుతం డీసీసీ బ్యాంకు సహకారంతో గ్రామీణ ప్రాంతాలకు చెందిన మధ్యతరగతి రైతు బిడ్డలు సైతం విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. విదేశాల్లో చదవడానికి ఆసక్తి చూపించే గ్రామీణ రైతు బిడ్డలకు రుణాలు ఇచ్చేందుకు డీసీసీ బ్యాంకు ముందుకొచ్చింది. పాస్ పుస్తకాలతో భూములను మార్టిగేజ్ చేసుకొని రైతులకు రూ.లక్షల్లో రుణాలిచ్చి విదేశీ విద్యను ప్రోత్సహిస్తోంది. బ్యాంకు పరిధిలో ఘన్‌పూర్, చిల్పూర్, జఫర్‌గఢ్ మండలాలకు చెందిన రైతులకు మాత్రమే అవకాశం ఉంది. ఇప్పటికే చాలా మంది రుణాలు పొంది అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, లండన్ లాంటి దేశాలకు వెళ్లి అక్కడి యూనివర్సిటీల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. మరికొందరు ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు.. 2021-22 మధ్య కాలంలో ఏడుగురు విద్యార్థులు రూ.1.20 కోట్ల రుణం పొంది అమెరికాకు వెళ్లారు. 2022 ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు 11 మంది విద్యార్థులు రుణాలు పొందారు. వీరిలో ఐదుగురు అమెరికాకు వెళ్లారు.

రుణాలు పొందడం ఇలా..డీసీసీ బ్యాంకు ద్వారా విద్యా రుణాలు పొందాలనుకునే విద్యార్థుల తల్లిదండ్రులు లేదా నాన్నమ్మ, తాతయ్య మరెవరైనా వారి పట్టా పుస్తకాలను మార్టగేజ్ చేయాల్సి ఉంటుంది. తర్వాత ప్రభుత్వం నిర్ణయించిన మేరకు అభ్యర్థులకు రుణాలను అందిస్తున్నారు. పట్టా భూమికి 13 ఏళ్లకు సంబంధించి అనుబంధ పత్రాలు(లింక్ డాక్యుమెంట్స్)ను అందిస్తే సరిపోతుంది.

బ్యాంకు సిబిల్ స్కోర్ 680 ఉండాలి. విదేశాలకు వెళ్లిన తర్వాత యూనివర్సిటీ చెల్లించాల్సిన ట్యూషన్ ఫీజు, ల్యాప్‌టాప్, పుస్తకాలు, హాస్టల్ ఫీజు, ప్రాజెక్టు వర్క్, కొనుగోలు తదితర ఖర్చుల మొత్తానికి సంబంధించి గరిష్ఠంగా బ్యాంకు రూ.30 లక్షల వరకు రుణం అందిస్తోంది. రుణం పొందిన విద్యార్థి, అతడి తల్లిదండ్రులు మొదటి మూడేళ్ల వరకు కేవలం రుణంపై వడ్డీ చెల్లిస్తే సరిపోతుంది. నాలుగో ఏడాది నుంచి వడ్డీతో పాటు అసలును వాయిదాల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి..-మహబూబీ, డీసీసీ బ్యాంకు మేనేజర్, స్టేషన్‌ఘన్‌పూర్

బ్యాంకు నిబంధనల మేరకు విదేశీ చదువుల కోసం రుణాలను అందిస్తున్నాం. ఇప్పటివరకు ఎక్కువ మొత్తంలో రైతుల పిల్లలకే రుణాలు ఇచ్చాం.. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

రుణం వెంటనే వచ్చింది..-మెడిచర్ల మణికంఠ(ఎమ్మెస్ అమెరికా), మల్కాపూర్, చిల్పూర్

సరైన పత్రాలతో రుణం దరఖాస్తు చేసుకున్న వెంటనే బ్యాంకు అధికారులు రూ.20 లక్షల రుణం మంజూరు చేశారు. ఎలాంటి కమీషన్, వాటాలు తీసుకోకుండానే డీసీసీ బ్యాంకులో రుణం మంజూరు చేశారు.ఇబ్బందులు లేకుండా..

- గడ్డం యశ్వంత్(ఇంటర్నేషనల్ బిజినెస్ మేనేజ్‌మెంట్, లండన్) జఫర్‌గఢ్ మండలం, కూనూర్

దరఖాస్తు సమర్పించిన వెంటనే పత్రాలను పరిశీలించిన అధికారులు బ్యాంకు ఖాతాలో రూ.18 లక్షల నగదు జమ చేశారు.

స్వగృహకు తప్పని పాట్లు

పెద్దపల్లి : జిల్లాలో రాజీవ్ స్వగృహ స్థలాలకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అనుగుణంగా మూడు, నాలుగు రెట్లు ఎక్కువకు వేలం పాడిన వాళ్లు మొత్తం డబ్బులు చెల్లించాల్సిన సమయంలో చేతులెత్తేయడం చర్చనీయాంశమైంది. గత నెల 15, 16 తేదీల్లో అంతర్గాం మండలం కుందనపల్లి వద్ద రాజీవ్ స్వగృహ అక్షయ టౌన్‌షిప్‌లో ఓపెన్ ప్లాట్లకు సంబంధించి వేలం ప్రక్రియ నిర్వహించారు. వాణిజ్య, గృహ సముదాయాలకు సంబంధించి 100 ఖాళీ స్థలాలకు వేలం పూర్తి చేయగా ప్రభుత్వానికి రూ.19.62 కోట్ల ఆదాయం సమకూరింది.

పరిసర వెంచర్ల ధర పెంచేందుకే..!

రామగుండం, పెద్దపల్లి వంటి అభివృద్ధి చెందుతున్న పట్టణాలకు చుట్టుపక్కల ఉన్న ఖాళీస్థలాల ధరలు అమాంతం పెంచుకుని సొమ్ము చేసుకునేందుకే స్థిరాస్తి వ్యాపారులు వేలంలో పాల్గొన్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం 22 మంది రూ.10 వేల చొప్పున ధరావతు చెల్లించి వేలంలో ప్లాట్లు దక్కించుకున్నారు. కాగా మొత్తం డబ్బులు చెల్లించాల్సిన సమయంలో స్పందించడం లేదు. వీరిలో ఎక్కువ మంది స్థానిక రియల్టర్లే ఉండటం గమనార్హం. రియల్టర్లు, బిల్డర్లు ఉద్దేశపూర్వకంగా వేలం ప్రక్రియలో పాల్గొని గజానికి గరిష్ఠంగా రూ.20 వేలకు పాడగా తీరా డబ్బులు కట్టాల్సిన సమయంలో స్పందించడం లేదు. వీరంతా వ్యూహాత్మకంగా వ్యవహరించి సమీపంలోని తమ వెంచర్లను అభివృద్ధి చేసుకుని వ్యాపారాన్ని పెంచుకున్నారు.

అక్షయ టౌన్‌షిప్ పేరిట..

'అక్షయ' టౌన్‌షిప్ పేరిట మొత్తం 27 ఎకరాల భూములుండగా 2006 నుంచి 2013 వరకు 36 మందికి 200, 250 గజాల చొప్పున విక్రయించారు. 200 గజాల స్థలానికి రూ.16.80 లక్షలతో పాటు అభివృద్ధి పనుల పేరిట 10 శాతం రుసుము వసూలు చేశారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒక పడక గది, హాల్, కిచెన్, అటాచ్‌డ్ బాత్‌రూమ్‌తో పాటు ఇంటిపైన స్లాబ్ వేసి రెండు గదులు, అటాచ్‌డ్ బాత్‌రూమ్‌లతో అప్పట్లో ప్రభుత్వమే నిర్మించింది. వాటిని విక్రయించి రిజిస్ట్రేషన్ పత్రాలు కూడా కొనుగోలుదారులకు అందజేసింది. అయితే గృహనిర్మాణ పథకం నిలిపివేయడంతో కేవలం ఖాళీ స్థలాలను విక్రయించడమే లక్ష్యంగా మార్చి 15, 16 తేదీల్లో కుందనపల్లిలో వేలం ప్రక్రియను అధికారికంగా నిర్వహించారు.

ఆసక్తి చూపింది 78 మంది మాత్రమే మొత్తం 100 ప్లాట్లను వేలం వేయగా ముందుగా రూ.10 వేలు చొప్పున ధరావతు చెల్లించి పాల్గొనాల్సి ఉంటుంది. అనంతరం ప్లాటు దక్కితే ధరావతు సొమ్ము తిరిగి ఇవ్వరు. దక్కకుంటే చెల్లిస్తారు.వేలంలో ప్లాటు దక్కిన వారు వారం రోజుల్లోగా మొదటి విడతగా 33 శాతం డబ్బులు, రెండో విడతగా 45 రోజుల్లో 33 శాతం, మిగిలిన మొత్తాన్ని 90 రోజుల్లో పూర్తిగా చెల్లించాల్సి ఉంటుంది.అనంతరం జిల్లా కలెక్టర్ ద్వారా నిరభ్యంతర పత్రం(ఎన్వోసీ) జారీ చేసి ఇళ్ల నిర్మాణానికి బ్యాంకు రుణం, ఇతర నిర్మాణ ప్రక్రియను ప్రారంభించుకునే అవకాశం కల్పించారు. కాగా వేలంలో ప్లాటు దక్కించుకున్న వారికి ఇచ్చిన గడువు దాటినా డబ్బు చెల్లించకపోవడంతో 22 మందికి చెందిన రూ.10 వేల చొప్పున మొత్తం రూ.2.20 లక్షలు ప్రభుత్వ ఖజానాకు జమయ్యాయి. మిగిలిన 78 మందిలో 37 మంది పూర్తి స్థాయిలో డబ్బులు చెల్లించగా మిగిలిన వారు గడువులోగా కట్టనున్నారు. వీరికి మరో వారం రోజుల్లో రిజిస్ట్రేషన్ చేయనున్నారు. కాగా 22 ప్లాట్లకు సంబంధించి తిరిగి వేలం ప్రక్రియ నిర్వహణకు త్వరలో ప్రకటన చేయనున్నారు.

అంగన్‌వాడీల్లో సిబ్బంది లేక ఇబ్బంది!

భైంసా : చిన్నారులు, గర్భిణుల్లో పౌష్టికాహార లోపాన్ని అధిగమించి వారి సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా అమలు చేసిన సమగ్ర మాతా శిశు సంరక్షణ అభివృద్ధి పథకంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లోపించింది. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పూర్తిస్థాయిలో సొంత భవనాలు నిర్మించకపోవడం, కేంద్రాల్లో పర్యవేక్షకుల, ఉపాధ్యాయుల, ఆయాల ఖాళీలను భర్తీ చేయకపోవడం ప్రధానంగా కన్పిస్తోంది. కొన్నేళ్లుగా ఏర్పడ్డ ఖాళీలు భర్తీకి కావడం లేదు. గతసంవత్సరం ఖాళీలను భర్తీ చేస్తామని వివరాలు సేకరించినా కాగితాలకే పరిమితమయ్యాయి. చాలా కేంద్రాలను ఇన్‌ఛార్జులతో నడిపిస్తున్నారు.

అద్దెగదులు ఇరుకుగా ఉండటంతో ఆట స్థలాలు లేవు. కేంద్రాలపై సరైన పర్యవేక్షణ లేక గర్భిణులు, చిన్నారులు, బాలింతలు పౌష్టికాహారానికి దూరమై రక్తహీనత, బలహీనతతో అనారోగ్యాలకు గురవుతున్నారు. ప్రసూతి సమయాల్లో మాతా, శిశుమరణాలు జరుగతున్నాయి.

ఆటపాటలు.. అక్షరాలకు దూరం : జిల్లాలో 19 పర్యవేక్షకుల, 50 కేంద్రాల్లో ఉపాధ్యాయులు, 91 కేంద్రాల్లో ఆయాల నియామకాలు లేకపోవడంతో చిన్నారులు ఆటపాటలు, అక్షరాలకు దూరమవుతున్నారు. పోస్టులు ఖాళీ ఉన్న కేంద్రాల నిర్వహణ బాధ్యత సమీప గ్రామం లేదా పక్కన కాలనీ ఉపాధ్యాయులకు అప్పగించారు. ఇన్‌ఛార్జి బాధ్యతలు తీసుకున్న ఉపాధ్యాయులు ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. భైంసా మండలం పేండ్‌పెల్లిలోని ఒకే గదిలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. మొత్తం 120మంది చిన్నారులు, 30మంది గర్భిణులు ఉన్నారు. సరకుల నిల్వ, వంట అక్కడే చేయడంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు మాంజ్రి పాఠశాల భవనం సముదాయంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రంలో ఉపాధ్యాయురాలి నియామకం లేదు. ఇక్కడ 58 చిన్నారులు, 12 గర్భిణులకు ఆయానే సేవలందిస్తోంది. 63మంది పిల్లలు, 14మంది గర్భిణులు ఉన్న సిరాల కేంద్రం ఉపాధ్యాయురాలకే ఇక్కడి బాధ్యతలను అప్పగించారు. 5కి.మీ. దూరం ఉండడంతో ఆమె రెండు, మూడు రోజులకు ఒకసారి వచ్చి సరుకులు ఆయాకు ఇచ్చి వెళ్తున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం..విజయలక్ష్మి, స్త్రీ శిశు సంక్షేమ జిల్లా అధికారి నిర్మల్

జిల్లాలోని ఖాళీల వివరాలు ప్రభుత్వానికి నివేదించాం. ప్రస్తుతం గ్రేడు-2 సూపర్‌వైజర్ల పరీక్ష ఫలితాలు వచ్చాయి. ఇంటర్వ్యూలు అయ్యాక నియామకాలు పూర్తవుతాయి. ఈ పరీక్షలు రాసిన వారిలో ఉపాధ్యాయులు కాబట్టి పర్యవేక్షకుల నియామకాలు అయ్యాక ఏర్పడే ఉపాధ్యాయ ఖాళీలను మరోసారి ప్రభుత్వానికి అందిస్తాం. ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసి ఖాళీలను భర్తీ చేస్తుంది.

నిరుద్యోగుల సాపాట్లు

సిరిసిల్ల : ప్రభుత్వ ఉద్యోగం సాధించేందుకు జిల్లాలోని నిరుద్యోగ యువత పుస్తకాలతో కుస్తీ పడుతోంది. త్వరలో వరుస నోటిఫికేషన్లు వచ్చే అవకాశం ఉండటంతో పూర్తిస్థాయిలో సన్నద్ధతపైనే దృష్టి సారిస్తున్నారు. ఇదే క్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయానికి వచ్చే అభ్యర్థుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. జిల్లా నలుమూలల నుంచి ఉదయం ఏడు గంటలకే సిరిసిల్లకు చేరుకుంటున్నారు. రాత్రి 9 గంటల వరకు ఇక్కడే చదువుకుంటున్నారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చేవారు ఉదయం వీలైతే బాక్సుల్లో భోజనం తీసుకొస్తున్నారు. వీలుకాని వారు రాత్రి ఇంటికి వెళ్లే వరకు చదువుతూ అర్ధాకలితోనే ఉంటున్నారు.జిల్లా గ్రంథాలయానికి నిత్యం 300 మంది పైనే నిరుద్యోగ యువత సన్నద్ధత కోసం వస్తున్నారు. వీరిలో చాలా మంది మారుమూల గ్రామాల నుంచి వచ్చేవారే ఎక్కువగా ఉన్నారు. రాబోయే రోజుల్లో పోలీసు ఉద్యోగాలకు శిక్షణ, బీసీ, ఎస్సీ అధ్యయన కేంద్రాల ఆధ్వర్యంలో ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో నిత్యం పట్టణానికి వచ్చే అభ్యర్థుల సంఖ్య మరింత పెరగనుంది. వీరంతా ఉదయం నుంచి రాత్రి వరకు పట్టణంలోనే ఉండి పుస్తకాలతో కుస్తీ పట్టనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉదయమే ఇంటి వద్ద భోజనం సిద్ధం చేసుకోలేని పరిస్థితి ఉంటుంది. పట్టణానికి వచ్చాక హోటల్‌లో భోజనం చేస్తే రూ.80 నుంచి రూ.100 ఖర్చవుతుంది. పేదలకు ఇది సాధ్యం కాదు. డబ్బులు పెట్టి తినలేక సాపాట్లు పడుతున్నారు. పురపాలక శాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ కూడలి సమీపంలో రూ.5లకు అన్నపూర్ణ పథకంలో భోజనం అందజేస్తుంది. ఇక్కడ రోజు కూలీలు, వస్త్రపరిశ్రమలోని కార్మికులు, ఆటోవాలాలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారు మధ్యాహ్నం కడుపునిండా భోజనం చేస్తున్నారు. నిత్యం 500 మందికి సరిపడా భోజనాలు అందిస్తున్నారు. గ్రంథాలయం వద్ద కూడా ఒక కేంద్రాన్ని నడిపితే తమ భోజనం పాట్లు తప్పుతాయని, కనీసం నాలుగైదు నెలలు తాత్కాలికంగా ఏర్పాటు చేసినా తమకు ఉపయుక్తంగా ఉంటుందని కోరుతున్నారు.

మంత్రి దృష్టికి...అంబేడ్కర్ జయంత్యుత్సవాల్లో పాల్గొనడానికి పట్టణానికి వచ్చిన మంత్రి కేటీఆర్ దృష్టికి గ్రంథాలయంలోని నిరుద్యోగ అభ్యర్థుల ఆకలి సమస్యను తీసుకెళ్లారు. ఈ విషయమై సానుకూలంగా స్పందించిన మంత్రి కేటీఆర్ త్వరలోనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. అలాగే పోటీ పరీక్షలకు అవసరమైన వివిధ రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచేలా కరీంనగర్‌కు చెందిన బుక్‌స్టాల్ నిర్వాహకులు గ్రంథాలయంలో పుస్తక విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో సుమారు వెయ్యికి పైగా చరిత్ర, వివిధ రకాల పోటీ పరీక్షలకు అవసరమైనవి ఉన్నాయి. అలాగే మనసున్న దాతలు ముందకొచ్చి మధ్యాహ్న భోజనం కూడా సమకూరిస్తే నిరుపేదల నిరుద్యోగులకు మేలు చేసినవారు అవుతారు.

సమయం కలిసివస్తుంది- శ్రీకాంత్, వేములవాడ

నేను గ్రూప్స్‌కు సిద్ధమవుతున్నాను. ఉదయమే వేములవాడ నుంచి వస్తున్నాను. ఆ సమయంలో టిఫిన్ చేసి వస్తున్నాను. అన్నం వండుకునేందుకు మరింత సమయం పడుతుంది. మధ్యాహ్నం తిరిగి వెళ్లలేని పరిస్థితుల్లో పక్కన ఉన్న అన్నపూర్ణ భోజనం కేంద్రంలో రూ.5లకు భోజనం చేస్తున్నాం. ఇక్కడే భోజన వసతి ఏర్పాటు చేస్తే సమయం కలిసివస్తుంది.

భోజన వసతి కల్పించాలి- మహేష్, సిరిసిల్ల

జిల్లా న్యాయస్థానంలో టైపిస్టుగా పని చేస్తూనే గ్రూప్-1కు సిద్ధమవుతున్నాను. ఉద్యోగరీత్యా సిరిసిల్లకు వచ్చి ఉంటున్నాను. ఉదయం ఏడు గంటలకే వచ్చి కార్యాలయం తెరిచే సమయం వరకు చదువుకుంటున్నాను. కార్యాలయం ముగిశాక.. సెలవుదినాల్లోనూ ఇక్కడే చదువుకుంటున్నాను. ఇక్కడే భోజన వసతి కల్పిస్తే నాలాంటి వారికి ఎంతగానో ఉపయోగంగా ఉంటుంది.

నిర్ధారణ పరీక్షలకు విఘాతం

ఆదిలాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన వ్యాధి నిర్ధారణ పరీక్షల వ్యవస్థ నిర్వహణ సరిగా లేదు. ఇందులో మొత్తం 57 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయటానికి ఏర్పాట్లు చేశారు. రిమ్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలోని బయోకెమిస్ట్రీ పరీక్షలు చేసే ఆటో ఎనలైజర్ యంత్రం వారం కిందట పాడైంది. రిమ్స్‌లో ఉన్న మరో యంత్రం మూడు రోజులుగా మొరాయిస్తోంది. దీంతో నిర్ధారణ పరీక్షలన్నీ నిలిచిపోయాయి. జిల్లాలోని వివిధ పీహెచ్‌సీల నుంచి వచ్చే నమూనాలకు, రిమ్స్‌లో రోగుల నుంచి సేకరించే నమూనాల నిర్ధారణ పరీక్షలు చేయలేకపోతున్నారు. బయోకెమిస్ట్రీ ఎనలైజర్ యంత్రం పని చేయక ఇందులో చేసే డయాబెటిక్ ప్రొఫైల్, లివర్ ఫంక్షన్ టెస్ట్, రీనల్ ఫంక్షన్ టెస్ట్, లిపిడ్ ప్రొఫైల్, సిరం ఎలక్ట్రోలైట్స్, తదితర మొత్తం 32 రకాల నిర్ధారణ పరీక్షలు చేయడం లేదు. ప్రస్తుతం ఇతర యంత్రాలపై చేసే 25 రకాల పాథలజీ పరీక్షలు, థైరాయిడ్ పరీక్షలు మాత్రమే జరుగుతున్నాయి. ఇదే పరిస్థితి రిమ్స్‌లోనూ నెలకొంది. టీహబ్‌లో పని చేసే సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ల(పీహెచ్‌సీల నుంచి డిప్యూటేషన్‌పై పని చేసే వారిని)ను తొలగించి రిమ్స్‌లో పని చేసే వారితో పరీక్షలు చేయిస్తున్నారు. నిర్వహణ సరిగా లేకనే పరిస్థితి నెలకొందనే విమర్శలు చోటు చేసుకున్నాయి.

సెల్ కౌంటర్‌దీ అదే పరిస్థితి..

రిమ్స్‌లోనూ రక్త నమూనాల సీబీపీ పరీక్షలు చేసే సెల్ కౌంటర్ మరమ్మతులకు గురైంది. రిమ్స్ పాథలజీ విభాగంలో రెండు సెల్ కౌంటర్లలో రెండేళ్ల కిందటే మూలన పడగా రెండో సెల్ కౌంటర్ తరచూ చెడిపోతోంది. కొన్నాళ్లు పట్టణ పీహెచ్‌సీ నుంచి సెల్ కౌంటర్ తీసుకొచ్చి నిర్ధారణ పరీక్షలు చేశారు. అనంతరం ఆ పీహెచ్‌సీ వారు ఆ యంత్రాన్ని తీసుకెళ్లటంతో పాత దానికి మరమ్మతులు చేయించారు. ప్రస్తుతం అది మళ్లీ పాడైంది. దీంతో టీహబ్‌లోని సెల్ కౌంటర్ యంత్రంపైనే సీబీపీ పరీక్షలు చేస్తున్నారు.

పాడై వారం రోజులు..రిమ్స్‌లోని తెలంగాణ డయాగ్నోస్టిక్ కేంద్రం (టీహబ్) లో బయో కెమిస్ట్రీ పరీక్షలు చేసే యంత్రం ఇది. వారం రోజుల కిందట పాడైంది. రిమ్స్‌తోపాటు జిల్లాలోని 20 పీహెచ్‌సీల నుంచి వచ్చే నమూనాల నిర్ధారణ పరీక్షలు ఆగిపోయాయి.

రిమ్స్‌లోనూ మూడురోజులుగా అంతరాయం

బయో కెమిస్ట్రీ విభాగంలోని ఆటో ఎనలైజర్ యంత్రం మూడు రోజులుగా మొరాయిస్తోంది. ఈ విభాగంలో కేవలం రెండు ఏసీలు మాత్రమే ఉండటంతో ఎండ వేడిమికి తరచూ యంత్రం పని చేయకుండా మొరాయిస్తున్నట్లు సమాచారం. దీంతో నిత్యం 1,500లకు పైగా జరిగే నిర్ధారణ పరీక్షలు నిలిచిపోయాయి.

కేవలం 600 పరీక్షలే..ఇది రిమ్స్‌లోని బయో కెమిస్ట్రీ ల్యాబ్‌లోని చిత్రం. నిర్ధారణ పరీక్షలు చేసే ఆటో ఎనలైజర్ యంత్రం మొరాయించటంతో సిబ్బందే నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. దీంతో రోజంతా కేవలం 500 నుంచి 600 నిర్ధారణ పరీక్షలు మాత్రమే జరుగుతున్నాయి.

మరమ్మతులు చేయిస్తాం

ఆటో ఎనలైజర్లు సరిగా పని చేసేలా సంబంధిత కంపెనీ ఇంజినీర్లకు సమాచారం అందించి వీలైనంత తొందరగా మరమ్మతులు చేయిస్తాం. నిర్వహణ తీరును సైతం మెరుగుపర్చటానికి చర్యలు తీసుకుంటాం.

ఆదాయంపైనే గురి.. వసతులు హరీ

నిర్మల్ : ఉమ్మడి జిల్లా పరిధిలో పెద్దదైన స్థానిక ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం నిర్వహణలోపంతో కొట్టుమిట్టాడుతోంది. 1977లో ప్రారంభమైన ఈ బస్టాండ్‌లో కనీస మౌలిక వసతుల్లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవలి కాలంలో పదేపదే అదనపు ఛార్జీలు విధిస్తున్న అధికారులు సౌకర్యాల కల్పనను మాత్రం విస్మరించారు.

పెరిగిన సెస్..ప్రయాణికుల సౌలభ్యం కోసం ప్రయాణ ప్రాంగణంలో కుర్చీలు, తాగునీరు, ఫ్యాన్లు తదితర వసతులు కల్పించేందుకు, నిర్వహించేందుకు గాను ప్రత్యేకంగా సెస్ రుసుమును వసూలు చేస్తున్నారు. గతంలో ఇది రూ.1 ఉండేది. పల్లెవెలుగుకు రూ.1, ఎక్స్‌ప్రెస్ ఆపైన ఉండే బస్సులకు రూ.5 చొప్పున పెంచారు. దాదాపు నెల రోజులుగా ఇది అమలవుతోంది. టికెట్ తీసుకునే ప్రతి ప్రయాణికుడు ఈ రుసుము తప్పనిసరిగా చెల్లించాలి. కేవలం సెస్ ఛార్జీల రూపంలోనే నిర్మల్ డిపోకు ప్రతిరోజూ దాదాపు రూ.2 లక్షల ఆదాయం సమకూరుతోంది. నెలకు రూ.60 లక్షలు. ఈ డబ్బులతో ప్రాంగణంలో సౌకర్యాలు మెరుగుపర్చడం పెద్దగా కష్టమేమీ కాదు. అయినా క్షేత్రస్థాయిలో అవస్థలు ఎదుర్కొంటున్నారంటే అధికారులు విఫలమవుతుండటమో, లేక వచ్చిన డబ్బులను సంస్థ ఇతర అవసరాలకు వినియోగించడమో జరుగుతోందనేది సుస్పష్టం.

సమస్యలతో సహవాసం..

సుమారు 45 సంవత్సరాల క్రితం అందుబాటులోకి వచ్చిన ప్రయాణప్రాంగణం దినదినాభివృద్ధి చెందాలి. కానీ, ప్రయాణికులు, బస్సు సర్వీసుల సంఖ్య పెరుగుతున్నా ప్రయాణికులను అవసరాలకు అనుగుణంగా ఏర్పాట్లు మాత్రం ఇంకా అందుబాటులోకి రావడం లేదు. ఇప్పటికీ సామగ్రి భద్రపర్చేగది లేదు. తాగునీరు, మూత్రశాలలకు అవస్థలే. వచ్చిన ప్రయాణికులు ఇక్కట్లతో సహవాసం చేయాల్సి వస్తోంది.

తాళం వేసి ఉన్న గది

ఇటీవల ఓ ఆసుపత్రి సౌజన్యంతో ప్రాంగణంలో ఏర్పాటుచేసిన తాత్కాలిక గది ఇది. చంటిపిల్లలకు పాలిచ్చేందుకు తల్లులకు ఇబ్బందులు ఏర్పడొద్దని ఈ ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ఈ గది తాళం వేసిఉంటోంది.

మూత్రశాలలకు వెళ్లే దారేది..?

ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన మూత్రశాలలను కొద్దిరోజుల క్రితం మూసేశారు. టెండర్ ప్రక్రియ పూర్తవకపోవడంతో దాన్ని ఎవరికీ కేటాయించలేదు. కావాల్సిన అద్దె లభించడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. అయితే.. ఖాళీగా వదిలేసే బదులు, కాస్త అద్దె తక్కువైనా ఎవరికో ఒకరికి కేటాయిస్తే నిర్వహణ జరిగి అందరికీ సౌలభ్యంగా ఉంటుందని ప్రయాణికులు చెప్తున్నారు

ఇదీ నిర్వహణ తీరు..

ఎండలు మండుతున్నాయి. అందరూ గుక్కెడు నీటికోసం అల్లాడుతుంటారు. ప్రయాణికుల సౌకర్యార్థం దాతల సాయంతో కొద్దిరోజుల క్రితం నీటి ట్యాంకును ఏర్పాటుచేశారు. ప్రారంభంలో బాగానే ఉన్నా.. కొద్దిరోజుల అనంతరం పరిస్థితి ఎప్పటిలాగే మారింది. నిర్వహణ లేక తాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

ప్రాంగణం ఆవరణలో చెత్త

ప్రయాణ ప్రాంగణంలోకి అడుగుపెట్టగానే కనిపించే దృశ్యమిది. చెత్తచెదారం పేరుకుపోయింది. సకాలంలో తొలగించకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారుతోంది. పలువురు బహిరంగ మూత్రవిసర్జన చేస్తున్నారు. గతంలో మున్సిపల్ వారు సేకరించిన చెత్తను అక్కడున్న స్థలాన్ని పూడ్చేందుకు గాను బస్టాండ్ ఆవరణలోనే పడేశారు.

విధులు అక్కడ.. వేతనం ఇక్కడ..

మంచిర్యాల : జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ పనితీరు అస్తవ్యస్తంగా తయారైంది. మంచిర్యాలకు శాశ్వత జిల్లా అదనపు అధికారిగా డా.శ్రీరాంను నియమించినా ఇక్కడ విధులు నిర్వర్తించడంలేదు. పని ఉత్తర్వుల పేరిట జయశంకర్ భూపాలపల్లిలో కొనసాగుతూ వేతనం మాత్రం మంచిర్యాల నుంచే తీసుకుంటున్నారు.

డిప్యూటీ సివిల్ సర్జన్లే.. జిల్లా అధికారులు

వైద్యారోగ్యశాఖ జిల్లా బాధ్యతలు తప్పనిసరిగా సివిల్ సర్జన్‌స్థాయి వ్యక్తికి అప్పగించాలి. జిల్లాకు మొదటి అదనపు వైద్యాధికారిగా నియామకమైన డా.భీష్మ మాత్రమే సీఎస్ హెూదాలో పని చేశారు. ఎక్కువ కాలం చేసింది కూడా ఆయనే. తన బదిలీ తర్వాత దాదాపు రెండేళ్లపాటు డీసీఎస్‌లతో నెట్టుకొచ్చారు. రెండు సంవత్సరాల్లో సుమారు నాలుగుసార్లు అధికారులను మార్చారు. గతేడాది ఏప్రిల్‌లో ప్రభుత్వం పలువురికి సీఎస్‌గా పదోన్నతి కల్పించడంతో మహబూబాబాద్‌లో డీసీఎస్‌గా కొనసాగుతున్న డా.శ్రీరాం మంచిర్యాల అదనపు వైద్యాధికారిగా వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆయన

కొద్ది రోజుల్లోనే ఇక్కడ పనిచేయడం ఇష్టంలేకనో.. ఒత్తిడి తట్టులేకనో.. మరే ఇతర కారణాలతో గానీ సెలవుపెట్టి వెళ్లిపోయారు.

సివిల్‌సర్జన్‌గా పదోన్నతితో జిల్లా అదనపు అధికారిగా బాధ్యతలు చేపట్టిన డా.శ్రీరాం ప్రస్తుతం విధులు మరోచోట నిర్వర్తిస్తున్నారు. సాధారణ బదిలీ అయ్యే వరకు ఆయన కేటాయించిన పోస్టులోనే కొనసాగాలి. కానీ డీహెచ్ నుంచి తనకున్న పలుకుబడితో పని ఉత్తర్వుల పేరిట బదిలీపై వెళ్లిపోయారు. ప్రస్తుతం జయశంకర్ భూపాలపల్లిజిల్లాలో తాత్కాలిక వైద్యాధికారిగా కొనసాగుతున్నారు. కానీ వేతనం మాత్రం మంచిర్యాల నుంచి పొందుతున్నారు. ప్రతినెల హాజరుపట్టిక భూపాలపల్లి నుంచి రావడం, ఇక్కడ నమోదు చేసుకుని వేతనానికి సంబంధించిన లెక్కలు చేసి ఖజానా శాఖకు పంపడం జరుగుతోంది. ప్రతినెల ఇదే తంతు. దీంతో జిల్లాలో తప్పని పరిస్థితుల్లో అర్హతలేని వారిని(డీసీఎస్) వైద్యాధికారిగా నియామకం చేసి కొనసాగించాల్సి వస్తోంది. తాత్కాలిక అధికారులను కేటాయిస్తుండటంతో తరచూ మార్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఏడాది వ్యవధిలోనే నలుగురిని మార్చడం గమనార్హం. ఇటీవల తాత్కాలికంగానైనా సీఎస్ స్థాయి వ్యక్తికి బాధ్యతలు అప్పగించడంతో శాఖ గాడిలో పడుతుందని అనుకున్నారు. విధుల్లో చేరినా కొద్దిరోజుల్లోనే అకస్మాత్తుగా ఆయనను తొలగించారు. దీంతో జిల్లా ఆరోగ్యశాఖకు మళ్లీ డీసీఎస్ స్థాయి వ్యక్తి దిక్కయ్యారు. ఉన్నతాధికారులు చొరవ చూపి జిల్లా నుంచే వేతనం పొందుతున్న శాశ్వత అధికారిని తిరిగి జిల్లాకు తీసుకురావడమో లేదా ఆయనను పూర్తిగా బదిలీచేసి శాశ్వత అధికారిగా మరొకరిని నియమించడమో చేయాలని ఆ శాఖ సిబ్బంది కోరుతున్నారు.

అభయారణ్యంలో ప్లాట్ల దందా..

ఇంద్రవెల్లి: జిల్లాలోని ఏజెన్సీ (అభయారణ్య)ప్రాంతాల్లో గిరిజనేతరులు ఇష్టారీతిన నిబంధనలు ఉల్లంఘించి అక్రమ నిర్మాణాలను కొనసాగిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. ప్రధానంగా ఇంద్రవెల్లి, ఉట్నూరు ప్రాంతాల్లో విచ్చలవిడిగా దందా సాగుతోంది. గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని వారి అవసరాలకు అధిక వడ్డీలకు డబ్బులను రుణంగా అందజేసి.. వారు తీర్చలేని పరిస్థితుల్లో ఆస్తులను స్వాధీనం చేసుకోవడంతోపాటు, వారి స్థలాల్లో భారీ భవంతుల నిర్మాణాలు చేపడుతున్నారు.

ఇళ్లకు రైతుబంధు డబ్బులు..వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చి అమ్మడంతో.. ప్లాట్లు కొనుగోలు చేసిన వారు భవనాలను నిర్మించుకుంటున్నారు. వీటికి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేవు. రెవెన్యూ రికార్డులో సర్వే నెంబరులో రైతుల పేరిట నమోదై ఉండటంతో యథావిధిగా రైతు బంధు డబ్బులను తీసుకుంటున్నారు. ప్రభుత్వ శాఖల అనుమతి లేకుండా రెండు, మూడు అంతస్తుల భవనాల నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు ఉంటున్నారు.

నాలా చట్టానికి తూట్లు

వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చుకోవడానికి నాలా(నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ అసెస్‌మెంట్) చట్టం ప్రకారం గతంలో భూమి విలువలో 9 శాతం ఉండగా, తెలంగాణ ప్రభుత్వం ఇటీవల దీనిని కేవలం మూడు శాతం చెల్లించేలా సడలింపునిచ్చింది. అయినా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ పన్ను చెల్లించడం లేదు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. ప్రభుత్వం రూ.లక్షల్లో ఆదాయాన్ని నష్టపోతోంది.

యథేచ్ఛగా స్థిరాస్తి వ్యాపారం

చిత్రంలో కనిపిస్తున్న భూమి గత ఖరీఫ్ సీజన్ వరకు వ్యవసాయ భూమి. ఇంద్రవెల్లి మండలం నుంచి హర్కపూర్‌కు వెళ్తున్న మార్గంలో రహదారికి కుడి పక్కన ఉన్న భూమిని ప్రస్తుతం ప్లాట్లుగా మార్చేశారు. గిరిజనేతరులు కొందరు ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా వాటిని విక్రయిస్తున్నారు. గిరిజనుల భూములను కూడా వారు వేలాది ప్లాట్లను తయారు చేసి అందినకాడికి దండుకుంటున్నారు. ఈ రహదారికి అరకిలోమీటరు దూరంలో కైలాస్‌నగర్ గ్రామం వద్ద రహదారికి ఇరువైపులా ప్లాట్లు వేసి అమ్మేశారు. ఉట్నూరు మండలం ఎందా గ్రామ శివారులో ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఎడమ వైపు వ్యవసాయ పొలంలో ప్లాట్లుగా మార్చి అమ్ముతున్నారు. ఇక్కడ ఒక ప్లాట్ ధర రూ.16 లక్షలకు పైగానే అమ్ముతున్నారని ప్రచారం జరుగుతోంది.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం- ముంజం సోము, తహసీల్దార్ ఇంద్రవెల్లి

ప్రభుత్వ అనుమతి లేకుండా పంట పొలాల్లో ప్లాట్లు వేసి విక్రయించడం చట్టరీత్యా నేరం. పంట చేలో ప్లాట్లు వేసి అమ్మిన వాటికి రైతు బంధు పథకం తీసుకునే రైతుల వివరాలను సేకరించి వారిపై చట్టం ప్రకారంగా చర్యలు తీసుకుంటాం.

పరువు నష్టం కేసులో రాహుల్‌గాంధీకి బెయిల్..

గాంధీనగర్: పరువునష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఊరట లభించింది. సోమవారం సూరత్ సెషన్స్ కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. ఆయన అప్పీల్‌పై విచారణ ముగిసేవరకు బెయిల్ కొనసాగుతుందని ఆదేశాలు వెలువరించింది. అయితే కిందికోర్టు తనకు విధించిన జైలు శిక్ష తీర్పుపై మధ్యంతర స్టే విధించాలని రాహుల్ చేసిన అభ్యర్థనపై ఇప్పుడే తీర్పు చెప్పలేమని వెల్లడించింది. దీనిపై తదుపరి విచారణను ఏప్రిల్ 13కు వాయిదా వేసింది. మోదీ ఇంటిపేరును కించపరిచేలా చేసిన వ్యాఖ్యలకు గానూ రాహుల్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఇటీవల సూరత్ ట్రయల్ కోర్టు తీర్పు వెలువరించింది.

దీనిపై ఈ రోజు ఆయన గుజరాత్‌లోని సూరత్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ కోర్టులో అప్పీల్ చేసుకున్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, సీనియర్ నేతలు, సోదరి ప్రియాంకా గాంధీ వెంట రాగా.. ఆయన సూరత్ సెషన్స్ కోర్టుకు హాజరయ్యారు. భారీ భద్రత నడుమ అక్కడకు చేరుకున్నారు. తన జైలుశిక్ష తీర్పును సవాలు చేశారు. ఈ తీర్పుపై అప్పీల్ చేసిన ఆయన మరో రెండు అప్లికేషన్లు పెట్టుకున్నారు. ఈ కేసులో తనను దోషిగా తేల్చడంపై స్టే విధించాలని, జైలుశిక్షను సస్పెండ్ చేయాలని అందులో కోరారు. అయితే, అవతలి పక్షం వాదనలు వినకుండా అలాంటి ఆదేశాలు ఇవ్వడం వీలుకాదని కోర్టు వెల్లడించింది. అలాగే పరువునష్టం కేసులో ప్రతివాదులు ఏప్రిల్ 10లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చింది. దీనిపై ఏప్రిల్ 13వ తేదీన విచారణ చేపడుతామని స్పష్టం చేసింది. ఇటీవల రాహుల్‌కుకు రెండేళ్ల జైలు శిక్ష పడడంతో.. ప్రజాప్రాతినిధ్యం చట్టం కింద ఆయన లోక్‌సభ సభ్యత్వంపై అనర్హత వేటు పడింది. కాగా.. అప్పీల్ చేసేందుకు వెళ్లిన రాహుల్ వెంట భారీగా పార్టీ శ్రేణులు తరలిరావడాన్ని భాజపా తప్పుపట్టింది. రాహుల్ మొదట ఓబీసీ వర్గాన్ని అవమానించారని, ఇప్పుడేమో కుటుంబం, పార్టీ నేతలతో కలిసి డ్రామా చేయడానికి కోర్టుకు వెళ్తున్నారని దుయ్యబట్టింది.

గుడ్‌న్యూస్.. 651 మందుల ధరలు తగ్గాయ్..

దిల్లీ: నిత్యావసర ధరల మోతతో సతమతమవుతున్న సామాన్యుడికి కాస్త ఊరటనిచ్చే వార్త ఇది. అత్యవసర ఔషధాల జాబితాలో ఉన్న 651 మందుల ధరలపై కేంద్రం సీలింగ్ ధరను నిర్ణయించింది. దీంతో ఈ ఔషధాల ధరలు దాదాపు 7 శాతం వరకు తగ్గాయి. ఈ మేరకు ఔషధ ధరల నియంత్రణ సంస్థ నేషనల్ ఫార్మాస్యూటికల్స్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పీపీఏ) ట్విటర్ వేదికగా వెల్లడించింది. “అత్యవసర ఔషధాల జాబితాలో ఉండే 870 రకాల మందుల్లో 651 ఔషధాలపై కేంద్ర ప్రభుత్వం సీలింగ్ ధరను నిర్ణయించింది. నిజానికి ద్రవ్యోల్బణం కారణంగా వీటి ధరలు 12.12శాతం పెరగాల్సి ఉండగా.. ఈ సీలింగ్ నిర్ణయంతో.. వీటి ధరలు 6.73శాతం దిగొచ్చాయి. ఏప్రిల్ 1 నుంచే ఈ ధరలు తగ్గాయి. దీంతో ఔషధాల ధరల పెరుగుదల ఎక్కువగా ఉన్నప్పటికీ.. ఈ తగ్గింపుతో వినియోగదారులు ప్రయోజనం పొందనున్నారు” అని ఎన్‌పీపీఏ వెల్లడించింది. జ్వరానికి ఉపయోగించే పారాసెటమాల్, యాంటీ డయాబెటిస్ ఔషధాలు మెట్‌ఫార్మిన్, గ్లిమెపిరైడ్, టెల్మిసార్టాన్, యాంటీ బయోటిక్ ఔషధం అమోక్సిసిలిన్, క్లావులానిక్ యాసిడ్ వంటి మందుల ధరలు తగ్గాయి. అధిక శాతం మంది ప్రజలు వినియోగించే అత్యవసర ఔషధాలతో ఆరోగ్యశాఖ ఓ జాబితాను రూపొందించింది. ఈ జాబితాలో మొత్తం 870 రకాల ఔషధాలున్నాయి. ఈ మందుల ధరలను జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ పర్యవేక్షిస్తోంది. అయితే మందుల టోకు ధరల సూచీ ఆధారంగా ఏటా ఏప్రిల్ 1న ఈ ధరలను సవరిస్తుంటారు. అలా 2022 సంవత్సరానికి గానూ ఈ సూచీ 12.12శాతం పెరిగింది. దీంతో షెడ్యూల్డ్ ఔషధాల పరిధిలోకి వచ్చే 857 రకాల మందులను 12.12శాతం పెంచుతూ ఎన్‌పీపీఏ నిర్ణయం తీసుకుంది. దీనికి కేంద్రం కూడా ఆమోదం తెలిపినట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. అయితే ఈ జాబితాలో 651 ఔషధాల ధరలపై కేంద్రం తాజాగా సీలింగ్ ధరను నిర్ణయించింది. దీంతో వీటి ధరలు సగటున 6.73 శాతం దిగొచ్చాయి. ప్రభుత్వం ప్రకటించిన సీలింగ్ ధరను మించి విక్రయించేందుకు అనుమతులు ఉండవు. దీంతో సామాన్యుడికి ఈ ఔషధాల ధరాభారం కాస్త తగ్గినట్లే..!

అంబానీ విందులో కరెన్సీ నోట్లు

అపర కుబేరుడు ముకేశ్ అంబానీ ఇంట్లో ఏం జరిగినా ప్రత్యేకమే..! తాజాగా అంబానీ కుటుంబం ఓ గ్రాండ్ పార్టీని ఏర్పాటు చేసింది. రిలయన్స్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ నీతా అంబానీ కలల ప్రాజెక్ట్ ‘నీతా ముకేశ్ అంబానీ సాంస్కృతిక కేంద్రం’ ప్రారంభాన్ని పురస్కరించుకుని రాజకీయ, సినీ, క్రీడా ప్రముఖులకు విందు ఇచ్చింది. అయితే ఈ విందులో అతిథుల నోరు తీపి చేసిన ఓ ప్రత్యేక స్వీట్ ఫొటోలు నెట్టింట్ వైరల్ అయ్యాయి. ఆ స్వీటుతో పాటు కరెన్సీ నోట్లు ఉండటమే అందుక్కారణం. మరి వాటిని అలా ఎందుకు పెట్టారంటే..? అంబానీ పార్టీలో విందు ఫొటోలను కొందరు నెటిజన్లు సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. అందులో ఈ స్వీట్ ఫొటోలు తెగ వైరల్ అవుతున్నాయి. అతిథులకు వడ్డించడానికి రెడీగా ఉంచిన డిజర్ట్ ఫొటో అది. అందులో గిన్నెలో ఆకు వేసి దానిపై స్వీటు, ఆ పక్కనే కరెన్సీ నోట్లను పెట్టి ఉంచారు. అయితే సరిగ్గా గమనిస్తే అవి నిజమైన కరెన్సీ నోట్లు కాదని తెలుస్తుంది. ఆ వంటకం కూడా దిల్లీలో చాలా పాపులర్ అయిన ‘దౌలత్ కి చాట్’ ఈ రుచికరమైన వంటకం పాత దిల్లీ సహా ఉత్తర భారత్‌లోని పలు ప్రాంతాల్లో కేవలం శీతాకాలంలో మాత్రమే రెండు నెలల పాటు లభిస్తుంది. చిక్కటి పాల నుంచి తీసిన నురుగుతో తయారు చేసి పైన పిస్తా, కోవా, చక్కెర పొడితో దీన్ని తయారుచేస్తారు. నాణ్యమైన ఆహార పదార్థాలతో దీన్ని తయారుచేయడంతో దీనికి ‘దౌలత్ కి చాట్ ’ అని పేరు పెట్టారు. పేరులోనే సంపద ఉండటంతో దిల్లీకి చెందిన ‘ఇండియన్ అసెంట్’ అనే రెస్టారెంట్ ఈ డిజర్ట్‌తో పాటు నకిలీ కరెన్సీ నోట్ల (%ఖీునుఎవ జబతీతీవఅషఎ చీశీవం%)ను పెట్టి ప్రత్యేకంగా విక్రయిస్తోంది. దీంతో ఈ వంటకం చాలా పాపులర్ అయ్యింది. ఆ ప్రత్యేక వంటకాన్నే అంబానీ పార్టీలో అతిథులకు వడ్డించారు. అంతేగానీ, అవి నిజమైన కరెన్సీ నోట్లు కాదని, ఈ వైరల్ ఫొటోలు చూసిన నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ఇక, అంబానీ పార్టీలో అతిథులకు ఎన్నో ప్రత్యేక వంటకాలను వడ్డించినట్లు తెలుస్తోంది. వెండి కంచాల్లో ఏర్పాటు చేసిన విందు భోజనంలో పాలక్ పన్నీర్, పప్పు, కూర, రోటీ, హల్వా, డిజర్ట్, పాపడ్, లడ్డు వంటి పలు రకాల భారతీయ సంప్రదాయ వంటకాలను వడ్డించారు. నీతా ముకేశ్ అంబానీ సాంస్కృతి కేంద్రాన్ని గత శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు బాలీవుడ్, హాలీవుడ్ సినీ ప్రముఖులు, రాజకీయ నేతలు, క్రీడారంగానికి చెందిన ప్రముఖులు హాజరయ్యారు.

తమిళనాడులో ఆర్థిక మంత్రికి చేదు అనుభవం..గ్యాస్ ధరలు తగ్గించాలని మహిళల డిమాండ్

చెన్నై: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తమిళనాడులో పర్యటించారు. వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్రంలో ప్రచారాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా కాంచీపురం జిల్లాలోని ఒక గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రజలతో మాట్లాడారు. వివిధ పథకాల ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలు అందరికీ అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు.

అయితే కేంద్ర ప్రభుత్వ తీరుపై స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న వంటగ్యాస్ ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న గ్యాస్ ధరలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మొరపెట్టుకున్నారు. అయితే వంటగ్యాస్ ధరలను అంతర్జాతీయ మార్కెట్ నిర్ణయిస్తుందని మంత్రి వారికి వివరణ ఇచ్చారు. “మన దేశంలో వంట గ్యాస్ లేదు. దాన్ని మనం విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. ఒకవేళ అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరిగితే ఇక్కడా పెరుగుతాయి. అక్కడ తగ్గితే ఇక్కడా తగ్గుతాయి. గత రెండేళ్ల నుంచి ధరలు తగ్గలేదు” అని మంత్రి సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో భాజపా నేత, కేంద్ర సహాయ మంత్రి ఎల్. మురుగన్ పాల్గొన్నారు. గత నెల ఒకటో తేదీన గృహావసరాల సిలిండర్‌పై చమురు సంస్థలు రూ.50, 19 కేజీల వాణిజ్య సిలిండర్‌పై రూ. 350.50 పెంచిన విషయం తెలిసిందే. ఈ పెంపుతో గృహ వినియోగ సిలిండర్ ధర హైదరాబాద్‌లో రూ.1,155, దిల్లీలో రూ.1,103, ముంబయిలో రూ.1,102.50, కోల్‌కతాలో రూ.1,129 చెన్నైలో రూ.1,118.50గా ఉంది. అయితే ఇటీవల 19 కేజీల వాణిజ్య సిలిండర్‌పై రూ. 91.50 మేర తగ్గించాయి. కానీ గృహవినియోగ సిలిండర్ ధరల్లో మాత్రం ఏ మార్పు లేదు.

కదులుతున్న రైల్లో పెట్రోల్ పోసి ప్రయాణికుడికి నిప్పు

కోజికోడ్: కదులుతున్న రైల్లో తోటి ప్రయాణికుడితో వాగ్వాదానికి దిగి అతడిపై పెట్రోల్‌తో దాడికి పాల్పడ్డాడో వ్యక్తి. ఒంటిపై పెట్రోల్ చల్లి నిప్పంటి సజీవదహనం చేసేందుకు ప్రయత్నించాడు. దీంతో ఆ మంటలు ఇతర ప్రయాణికులకు అంటుకున్నాయి. ఈ ఘటనలో ఏడాది చిన్నారి సహా ముగ్గురు ప్రాణాలు కోల్పోగా.. మరో ఎనిమిది మంది గాయపడ్డారు. కేరళలో చోటుచేసుకుందీ అమానుష ఘటన. పోలీసులు కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో అలప్పుళ – కన్నూర్ ఎగ్జిక్యూటివ్ ఎక్స్‌ప్రెస్ రైలు కోజికోడ్ నగరాన్ని దాటి కోరపుళ రైల్వే వంతెన వద్దకు చేరుకోగానే ఓ వ్యక్తి తన తోటి ప్రయాణికుడిపై పెట్రోల్ చల్లి నిప్పంటించాడు. దీంతో ఒక్కసారిగా ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. చూస్తుండగానే ఆ మంటలు ఇతరులకు అంటుకున్నాయి. దీంతో అప్రమత్తమైన ప్రయాణికులు ఎమర్జెన్సీ చైన్ లాగి రైలును నిలిపివేశారు. ప్రయాణికులకు అంటుకున్న మంటలను ఆర్పివేశారు. సమాచారమందుకున్న రైల్వే పోలీసులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. కాలిన గాయాలైన 8 మంది ప్రయాణికులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అయితే ఈ ఘటన తర్వాత రైల్లో నుంచి ముగ్గురు ప్రయాణికులు కన్పించలేదని తోటివారు గుర్తించారు. వెంటనే పోలీసులు గాలింపు చేపట్టగా.. ఘటన జరిగిన సుమారు 100 మీటర్ల దూరంలోని రైల్వే ట్రాక్‌పై వారి మృతదేహాలు కన్పించాయి. ఏడాది చిన్నారి సహా, ఒక మహిళ, ఒక పురుషుడి మృతదేహాలను పోలీసులు గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటన సమయంలో వీరు రైలు నుంచి జారిపడటం లేదా కిందకు దిగేందుకు ప్రయత్నించి ప్రాణాలు కోల్పోయి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతులంతా ఒకే కుటుంబానికి చెందినవారిగా తెలుస్తోంది. ఈ హత్యాయత్నం ఘటనతో వీరికి ఏమైనా సంబంధం ఉందా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

‘ఉగ్ర కుట్ర’ అనుమానాలు.. మరోవైపు ఘటన తర్వాత నిందితుడు పారిపోయాడు. ఎమర్జెన్సీ చైన్ లాగడంతో రైల్వే వంతెనపై రైలు ఆగిపోయింది. ఆ సమయంలో నిందితుడు రైలు నుంచి దూకి పారిపోయినట్లు ప్రత్యక్ష సాక్ష్యులు చెబుతున్నారు. అయితే అప్పటికే ఓ వ్యక్తి నిందితుడి కోసం బైక్‌పై అక్కడ వేచి ఉండటం తాము చూశామని పేర్కొన్నారు. దీంతో ఈ ఘటన వెనుక ఉగ్ర కుట్ర ఏమైనా ఉందా? అని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనాస్థలంలో ఒక బ్యాగు అనుమానాస్పద రీతిలో కన్పించింది. అందులో మరో పెట్రోల్ బాటిల్, రెండు మొబైల్ ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా.. పెట్రోల్ దాడికి ముందు నిందితుడు.. తోటి ప్రయాణికుడితో కావాలనే వాగ్వాదానికి దిగినట్లు ప్రత్యక్ష సాక్ష్యులు చెప్పడం గమనార్హం.

దిల్లీ చేరుకున్న పవన్

దిల్లీ: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ దిల్లీలో పర్యటిస్తున్నారు. ఆదివారం రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ వెళ్లిన పవన్.. నేడు హస్తినకు చేరుకున్నారు. పవన్‌తో పాటు జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ కూడా ఉన్నారు. దిల్లీ పర్యటనలో భాగంగా భాజపాకు చెందిన పలువురు ముఖ్యనేతలు, కేంద్రమంత్రులతో పవన్, మనోహర్ భేటీ కానున్నారు. ఏపీలో ఇటీవల జరుగుతున్న పరిణామాలు, తాజా రాజకీయ పరిస్థితులు, భవిష్యత్తు కార్యాచరణ తదితర అంశాలపై భాజపా పెద్దలతో పవన్ చర్చించే అవకాశముంది. ఇటీవల రాష్ట్ర భాజపా నేతలు, జనసేన మధ్య దూరం పెరిగిందనే ఊహాగానాల నేపథ్యంలో జనసేనాని దిల్లీ పర్యటనపై ఆసక్తి నెలకొంది.

తెలుగు రాష్ట్రాల్లో టెన్త్ పరీక్షలు ప్రారంభం..

హైదరాబాద్/అమరావతి: తెలుగు రాష్ట్రాల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. తెలంగాణలో ఉదయం 9:30 గంటల నుంచి 12:30 గంటల వరకు పరీక్ష జరుగనుంది. ఆరు పేపర్లతోనే టెన్త్ పరీక్షలను ఎస్ఎస్సీ బోర్డు నిర్వహించనుంది. ఏప్రిల్ 3 నుండి 13 వరకు పరీక్షలు జరుగనున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో ఐదు నిమిషాలు ఆలస్యమైనా అనుమతిస్తామని తెలంగాణ విద్యా శాఖ ప్రకటించింది. ఉదయం 9:35 గంటల వరకు విద్యార్థులను అధికారులు పరీక్షా కేంద్రంలోకి అనుమతివ్వనున్నారు. పదో తరగతి పరీక్షల కోసం మొత్తం 2652 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. తెలంగాణలో 4.94 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మొత్తం విద్యార్థుల్లో అబ్బాయిలు 2,43,852, అమ్మాయిలు 2,41,974 ఉన్నారు. అలాగే 3,78,794 మంది విద్యార్థులు ఇంగ్లీష్ మీడియంలో పరీక్ష రాయనుండగా.. 98,726 మంది విద్యార్థులు తెలుగు మీడియంలో పరీక్ష రాయనున్నారు. అటు ఏపీలో నేటి నుంచి ఈనెల 18వరకు పరీక్షలు జరుగనున్నాయి. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. ఏపీలో ఒక నిమిషం నిబంధనను అమలులోకి తీసుకువచ్చారు. ఏపీలో 6.64 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. గతేడాది వరకూ ఏడు పేపర్ల విధానం అమల్లో ఉండగా, ఈసారి ఆరు పేపర్లతోనే పరీక్షలు జరుగుతున్నాయి.

అందుకే జగన్ ఢిల్లీ పర్యటనలు..

పేర్నినాని వచ్చేఎన్నికల్లో ఎందుకు పోటీచేయనంటున్నారో చెప్పాలి..

విజయవాడ: ఎన్నికలు ఎప్పుడు జరిగినా, జగన్మోహన్ రెడ్డిని, వైసీపీని మట్టికరిపించడానికి తెలుగుదేశం సిద్ధంగా ఉందని టీడీపీ పొలిట్ బ్యూరోసభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ టీడీపీ గురించి మాట్లాడేముందు, పేర్నినాని వచ్చేఎన్నికల్లో ఎందుకు పోటీచేయనంటున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. 175 నియోజకవర్గాల్లో వైసీపీ తరుపున బరిలో నిలిచే అభ్యర్థులెవరో చెప్పే దమ్ము, ధైర్యం పేర్నినానికి, సీఎం జగన్‌కు ఉన్నాయా? అని ప్రశ్నించారు. పేర్నినానికి డిపాజిట్లురావని గతంలోనే చెప్పానని.. నానికి దమ్ముంటే, సొల్లుపురాణాలు చెప్పడంమాని ప్రజాక్షేత్రంలో టీడీపీతో తేల్చుకోవాలని బోండా ఉమ సవాల్ చేశారు. డిపాజిట్లు దక్కవన్న భయంతోనే పేర్నినాని, ధర్మాన, చెవిరెడ్డి లాంటి వాళ్లు పోటీచేయమంటున్నారు. 87 శాతం హామీల అమలు సాక్షి మీడియాలోనే కనిపిస్తోందన్నారు. ప్రజలు జగన్‌ను, వైసీపీని విశ్వసించడం లేదని ఐప్యాక్ సర్వే తేల్చిందన్నారు. ఐప్యాక్ సర్వే చూశాక జగన్‌ను నమ్మి ఎన్నికల బరిలో నిలవడానికి ఎవరూ సాహసించడంలేదన్నారు. అవినీతి కేసులు, బాబాయ్ హత్యకేసు నుంచి బయటపడటానికి జగన్ ఢిల్లీ పర్యటనలు చేస్తున్నారని విమర్శించారు. 4 ఏళ్లల్లో అక్కచెల్లెమ్మల పుస్తెలుతెంపి, మద్యం అమ్మకాలతో 94 వేల కోట్లు రాబట్టడమేనా జగన్ అమలుచేసిన మద్యపాన నిషేధం? అంటూ బోండా ఉమ ఎద్దేవా చేశారు.

రాములమ్మ రచ్చ ఫోజ్ తో చెమటలు పట్టిస్తోంది

బుల్లి తెర రాములమ్మగా గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ శ్రీముఖి ఈ మధ్య కాలంలో రెగ్యులర్ గా హాట్ ఫోటో షూట్స్ ను సోషల్ మీడియా ద్వారా షేర్ చేసి వావ్ అనిపిస్తోంది. అందాల విందు విషయంలో స్టార్ హీరోయిన్స్ తో పోటీ పడ్డట్లుగా ఈ అమ్మడి అందాల విందు చేస్తుంది అంటూ కామెంట్స్ వస్తున్నాయి. తాజాగా ఈ ఫోటోలను షేర్ చేసి ప్రతి ఒక్కరితో వావ్ అనిపించేలా ఉంది. థైస్ ను ఎక్స్ పోజ్ చేస్తూ చాలా హాట్ గా శ్రీముఖి కనిపిస్తుండటంతో సోషల్ మీడియాలో ఈ ఫోటోలు తెగ వైరల్ అవుతున్నాయి. చాలా మంది హీరోయిన్స్ ని మించి ఈమె అందంగా

ఉందంటూ అభిమానులు అంటున్నారు. బుల్లి తెరపై చాలా బిజీగా ఉంటూ రెగ్యులర్ గా షో లతో ఎంటర్ టైన్ చేస్తున్న రాములమ్మ శ్రీముఖి అప్పుడప్పుడు ఇలా అందాల విందు తో సోషల్ మీడియా ద్వారా మరింత పాపులారిటీని ఈ అమ్మడు దక్కించుకుంది. ఇప్పుడు ఇంకాస్త ఎక్కువ అన్నట్లుగా స్కిన్ షో చేస్తోంది. హీరోయిన్ గా కూడా పలు సినిమాల్లో నటించినా కూడా పెద్దగా గుర్తింపు రాకపోవడంతో బుల్లి తెరకు ఈ అమ్మడు పరిమితం అయ్యింది. తాజాగా చిరంజీవి సినిమాలో కీలక పాత్రలో ఈమె నటించినట్లుగా వార్తలు వస్తున్నాయి. ఆ సినిమా ఏంటీ.. పాత్ర ఏంటీ అనేది తెలియాలంటే కొన్నాళ్లు వెయిట్ చేయాల్సిందే. చిరంజీవి సక్సెస్ అయితే మళ్లీ హీరోయిన్ గా ఈ అమ్మడికి ఛాన్స్ వస్తాయేమో చూడాలి.

టెర్రస్ మీద ఆరేస్తున్న అందాలు..!

ఐదు సీజన్లు.. ఒక ఓటీటీ సీజన్ మొత్తం ఆరు సీజన్లలో బిగ్ బాస్ వల్ల బాగా లాభపడ్డ వారిలో ముందుగా చెప్పుకునే పేరు అషు రెడ్డి. అప్పట్లో టిక్ టాక్ వీడియోస్ తో జూనియర్ సమంతగా క్రేజ్ తెచ్చుకున్న అమ్మడిని బిగ్ బాస్ సీజన్ 3లో సెలెక్ట్ చేశారు. ఆ సీజన్ లో యూత్ ఆడియన్స్ ని అలరించిన అందాల భామల్లో అషు రెడ్డి ఒకరు. సీజన్ లో అషు ఆట మీద కన్నా అందాల మీదే ఎక్కువ ఫోకస్ చేశారు ఆడియన్స్. ఇక బిగ్ బాస్ తర్వాత తనకు వచ్చిన క్రేజ్ ని క్యాష్ చేసుకోవడంలో సక్సెస్ అయ్యింది అషు రెడ్డి. అంతేనా బిగ్ బాస్ ఓటీటీ లో కూడా అషు రెడ్డి మరోసారి ఛాన్స్ అందుకుంది. బిగ్ బాస్ కి ఒక్కసారి ఛాన్స్ రావడమే ఎక్కువ అనుకుంటే బిగ్ బాస్ నాన్ స్టాప్ లో మరోసారి అలరించింది అషు రెడ్డి. బిగ్ బాస్ వల్ల సోషల్ మీడియాలో ఓ రేంజ్ పాపులారిటీ తెచ్చుకున్న అషు రెడ్డి తన ఫోటో షూట్ తో దాన్ని డబుల్ చేసుకుంటుంది. కంప్లీట్ బోల్డ్ లుక్ తో ఏమాత్రం మొహమాటం లేకుండా అందాల ప్రదర్శన చేస్తుంది అషు రెడ్డి. రీసెంట్ గా ఏకంగా బ్రాతో ఉన్న ఫోటోలని కూడా షేర్ చేసి సోషల్ మీడియాని హీటెక్కించేసింది అమ్మడు. ఓ ఐదారు

సినిమాలు చేసిన హీరోయిన్ కి కూడా రానంటువంటి క్రేజ్ అషు రెడ్డి ఈ హాట్ షో వల్ల సంపాదించేసింది. ఇక లేటెస్ట్ గా అషు రెడ్డి టెర్రస్ మీద అందాలను ఆరేసింది. టీ షర్ట్ జీన్స్ షార్ట్ తో థైస్ షో చేస్తూ టెర్రస్ మీద బట్టలు ఆరేస్తూ కూడా ఫోటో షూట్ చేసింది అమ్మడు. ఒక పాపులారిటీ వచ్చాక ఏం చేసినా సరే అది వైరల్ అవుతుంది అన్నట్టుగా.. సోషల్ మీడియాలో తనకున్న ఫాలోయింగ్ చూసుకుని రెచ్చిపోతుంది అషు రెడ్డి. ఇంత అందగత్తెకి సినిమా అవకాశాలు ఎందుకు రావట్లేదు అన్న డౌట్ రాక మానదు. అషు రెడ్డికి ఇప్పటికే చాలా సినిమా అవకాశాలు వచ్చాయట. అయితే సినిమాల కన్నా తనకు ఈ సోషల్ మీడియా క్రేజ్ తోనే సంతృప్తి ఉందని చెబుతుందట. అంతేకాదు మనసుని కదిలించే కథ దొరికితే మాత్రం తప్పకుండా చేస్తానని అంటుందట. అషు చేస్తున్న ఫోటో షూట్స్ చూస్తే ఆమెని గ్లామర్ హీరోయిన్ గానే చూపించాలని.. అలాంటి కథలతోనే ఆమెని అప్రోచ్ అవుతారు. కానీ అషు మాత్రం ఫీల్ గుడ్ మూవీస్ చేయాలని అనుకుంటుందట. మరి అలాంటి ఛాన్స్ వచ్చే దాకా అషు రెడ్డి అందాల సునామీ కొనసాగిస్తూనే ఉంటుందని చెప్పొచ్చు.

కె.రాఘవేంద్రరావు పెళ్లి సందడి 3 తీస్తే ఈ అక్కా చెల్లెళ్లతోనే..!

అక్కా చెల్లెళ్లు ఇద్దరూ ఒకే యువకుడితో డేటింగ్ చేస్తే ఆ స్టోరి ఇంట్రెస్టింగ్ గానే ఉంటుంది. దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు తెరకెక్కించిన పెళ్లి సందడి థీమ్ లైన్ ఇదే. రవళి- దీప్తి భట్నాగర్ లతో ప్రేమాయణం సాగించే యువకుడిగా హీరో శ్రీకాంత్ అద్భుతంగా నటించారు. ఇటీవలే కె.రాఘవేంద్రరావు పెళ్లి సందడి సీక్వెల్ (పెళ్లి సంద-డి)ని తెరకెక్కించిన సంగతి తెలిసిందే. అయితే ఈ సిరీస్ లో మూడో పార్ట్ తెరకెక్కిస్తే ఎవరిని ఎంపిక చేయాలి? అంటే అభిమానులు ఇదిగో ఈ బ్యూటిఫుల్ కపూర్ సిస్టర్స్ పేర్లను సూచిస్తున్నారు ఈ ఫోటో వీక్షించాక..! కనిపిస్తున్న ఈ ఫోటోలో జాన్వీ కపూర్ - ఖుషీ కపూర్ నిజంగానే అంత అందంగా లవ్ లీగా కనిపిస్తున్నారు. కాబోయే వాడి కోసం కలలు గనే అందమైన రాకుమార్తెల్లా మెరిపిస్తున్నారు. ఒకవేళ నిజంగానే పెళ్లి సందడి 3 తెరకెక్కిస్తే కె.రాఘవేంద్రరావు ఒక ఆప్షన్ గా ఈ సిస్టర్స్ ని దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంటుంది. ఆసక్తికరంగా ఈ భామలిద్దరూ ఒకే యువకుడితో రియల్ లైఫ్ లోను డేటింగ్ చేశారన్న పుకార్ ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. జాన్వీ కపూర్ తన బాలీవుడ్ అరంగేట్రం కంటే ముందే వార్తల్లో నిలిచిన స్టార్ కిడ్. ధడక్ విడుదలకు ముందే జాన్వీ డేటింగ్ మ్యాటర్ వార్తల్లో నిలిచింది. అక్షత్ రంజన్- ఇషాన్ ఖట్టర్- కార్తీక్ ఆర్యన్ ఇలా తన సరసన నటించిన యువహీరోలతో లింకప్ వార్తలు వచ్చాయి. కానీ ఈ జాబితాలో అక్షత్ రంజన్ అనే పేరు కూడా ఉంది. కానీ ఇప్పుడు తాజా ఇంటర్వ్యూలో జాన్వీ తన డేటింగ్ జీవితంపై వచ్చిన కథనాలన్నిటినీ కొట్టి పారేసింది. జాన్వీ కపూర్ తన గురించి తాను చదివిన అన్ని చెత్త గాసిప్ ల గురించి చెప్పింది. తన సోదరి ఖుషీ కపూర్ .. జాన్వీ ఇద్దరూ వేర్వేరు సమయాల్లో అక్షత్ రాజన్ తో డేటింగ్ చేశారంటూ కథనాలు వచ్చాయి. కానీ ఇవేవీ నిజాలు కాదని జాన్వీ వ్యాఖ్యానించింది. జాన్వీ కపూర్ తన చిన్ననాటి స్నేహితురాడు.. బెస్ట్ ఫ్రెండ్ అయిన అక్షత్ రాజన్ తో రిలేషన్ షిప్ లో ఉన్నట్లు జాతీయ మీడియాలు ప్రచురించడంతో అది ఇప్పటికే దుమారం రేపుతోంది.

అయితే అవే పత్రికల్లో జాన్వీ-అక్షత్ విడిపోయిన తర్వాత అతడితో తన సోదరి ఖుషీ కపూర్ డేటింగ్ చేసినట్టు చదివానని కూడా జాన్వీ తెలిపింది. తామెవరూ అతనితో డేటింగ్ చేయలేదని ఆమె స్పష్టం చేసింది. చిన్నప్పటి నుంచి అతనే తమకు బెస్ట్ ఫ్రెండ్ అని చెప్పింది. ICYMI అక్షత్ రాజన్ గామన్ ఇండియా లిమిటెడ్ కంపెనీకి అతడు CMD. దేశంలో అత్యధిక సంఖ్యలో వంతెనలను నిర్మించిన అతిపెద్ద సంస్థల్లో ఇది ఒకటి. అక్షత్ రాజన్ కుటుంబం బచ్చన్ లతో కూడా చాలా సన్నిహితంగా ఉంటుంది. జాన్వీ కపూర్ మరో చిరకాల స్నేహితుడైన ఓర్హాన్ అవత్రమణితో ప్రేమలో ఉందని ఇటీవల పుకార్లు వచ్చాయి. నిజానికి అతను ఫ్యాషన్ డిజైనర్. బాలీవుడ్ సర్కిల్స్ లో అతన్ని ఓర్రీ అని పిలుస్తారు. ఓర్హాన్ అవత్రామణి ఒకానొక సమయంలో తన స్నేహితురాలు సారా అలీ ఖాన్ తో డేటింగ్ చేస్తున్నట్లు రూమర్లు వచ్చాయి. అతను ఇప్పుడు పాలక్ తివారీతో కూడా షికార్లు చేస్తూ కనిపిస్తున్నాడు. వృత్తిపరమైన అవసరాలతో యువనాయికలతో కలిసి కనిపించినా ఇలాంటి రూమర్లు పుట్టుకొచ్చేస్తున్నాయి. కానీ వేటికీ అధికారిక ధృవీకరణలు లేవు. జాన్వీ కపూర్ తదుపరి మలయాళ చిత్రం హెలెన్ కి రీమేక్ అయిన మిలీ అనే సర్వైవర్ థ్రిల్లర్ డ్రామాలో కనిపించనుంది. అలాగే జాన్వీ తాను ప్రస్తుతం ఒంటరిగా ఉన్నానని తాజా ఇంటర్వ్యూలో చెప్పింది. ఇంటర్వ్యూ పేరుతో ఏదో ఒక రకంగా అన్ని గాసిప్పులకు జాన్వీ అలా చెక్ పెట్టిందన్నమాట!

స్టార్ హీరోయిన్ బాత్ టబ్ అరాచకం.. ఇదేం పని అంటున్న ఫ్యాన్స్

అవకాశాల కోసం పాకులాడే వారు... గుర్తింపు కోసం ఆరాటపడే వారు సోషల్ మీడియాలో రకరకాల విన్యాసాలు చేయడం మనం చూస్తూ ఉంటాం. కానీ స్టార్ హీరోయిన్స్ వారితో పోల్చితే కాస్త పద్దతిగా ఉంటారు.. అందాల ఆరబోత విషయంలో వారిని మించి ఉన్నా కూడా ఎబ్బెట్టుగా మాత్రం ఎప్పుడూ కూడా కనిపించే విధంగా పని చేయరు. తాజాగా దీపికా పదుకొనే చేసిన పనిని కొందరు తప్పుబడుతున్నారు. బాత్ టబ్ లో ఉండి ఈమె ఫోటో షూట్ ఇచ్చిన తీరును చాలా మంది తప్పుబడుతున్నారు. దీపికా పదుకొనే అందాల రాశి అనడంలో సందేహం లేదు. ఆమె ఫోటోల కోసం కోట్లాది మంది ఆమె ను సోషల్ మీడియా ద్వారా ఫాలో అవుతూ ఉంటారు. అందమైన దీపికా పదుకొనేను మరింత అందంగా చూపేందుకు ఆమె అభిమానులు ఎప్పటికప్పుడు కోరుకుంటూనే ఉంటారు. అందుకు తగ్గట్లుగానే దీపిక పదుకునే తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ తన అభిమానులను ఎంటర్ టైన్ చేస్తూనే ఉంటుంది. తాజాగా దీపిక పదుకునే బాత్ టబ్ ఫోటోలను స్వయంగా అభిమానులు విమర్శిస్తున్నారు. ఇలాంటి ఫోటోలు అవసరమా అంటూ చాలా మంది చాలా రకాలుగా కామెంట్స్ చేస్తున్నారు. అందంగా కనిపించడం ఏమో కానీ మరీ ఎబ్బెట్టుగా ఉన్నారంటూ కామెంట్స్ వస్తున్నాయి. కొందరు మాత్రం దీపిక ను ఇలా చూస్తుంటే మతి పోతుందంటూ ఎప్పటిలాగే ఆమె ఫోటోలను లైక్ చేస్తున్నారు.

కవ్వించి రెచ్చగొడుతున్న ఖిలాడీ గాళ్

మాస్ మహారాజా రవితేజ సరసన ఖిలాడీ చిత్రంలో నటించింది మీనాక్షి చౌదరి. తనదైన అందం నటనతో యువతరాన్ని మురిపించిన ఈ బ్యూటీ సోషల్ మీడియాల్లోను అంతే స్పీడ్ గా ఉంది. నిరంతరం ఈ అందాల భామ వరుస ఫోటోషూట్లను షేర్ చేస్తోంది. తాజాగా మరో హాట్ ఫోటోషూట్ మీనాక్షి సోషల్ మీడియాల్లో ప్రత్యక్షమైంది. మీనాక్షి ఈ ఫోటోగ్రాఫ్స్ లో టూ హాట్ గా కనిపిస్తోందంటూ బోయ్స్ కామెంట్లు చేస్తున్నారు. ఆమె అందానికి చలి జ్వరం ఖాయం! అంటూ ఫిదా అయిపోతున్నారు. మీనాక్షి తదుపరి హిట్ 2లో నటిస్తోంది. అలాగే కొలై అనే సినిమాలోను కథానాయికగా కనిపించనుంది. ఈ రెండు సినిమాల్లోను గ్లామర్ ఆవిష్కరణతో పాటు నటనకు ఆస్కారం ఉన్న పాత్రల్లో నటిస్తోందని సమాచారం. ప్రస్తుతం

టాలీవుడ్ లో వరుస చిత్రాలకు సంతకాలు చేస్తోంది. ఇరుగు పొరుగు భాషల్లోను లక్ చెక్ చేసుకుంటోంది. ఇక స్కిన్ షోకి ఏమాత్రం అభ్యంతరం చెప్పని మీనాక్షి ఫోటోషూట్లలోను అస్సలు తగ్గడం లేదు. పెద్ద తెరపై పెదవి ముద్దులకు అభ్యంతరం చెప్పనని స్టేట్ మెంట్ ఇచ్చిన ఈ భామకు అవకాశాలిచ్చేందుకు మన దర్శకహీరోలకు ఆసక్తి పెరిగింది. డార్లింగ్ ప్రభాస్ సరసన సలార్ లో నటించే అవకాశం ఉందని కథనాలొచ్చినా ఎందుకనో ఆ ఛాన్స్ మిస్సయ్యింది. కానీ భవిష్యత్ లో అగ్ర నాయికగా ఎదిగేందుకు అవసరమైన అన్ని క్వాలిటీస్ ఈ అమ్మడిలో దండీగా ఉన్నాయని ట్రేడ్ విశ్లేషిస్తోంది. మోడల్ కం నటి మీనాక్షి అందాల పోటీ టైటిల్ హోల్డర్. ఫెమినా మిస్ ఇండియా 2018 పోటీలో హర్యానా రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించింది. అక్కడ ఆమె మిస్ గ్రాండ్ ఇండియాగా కిరీటాన్ని పొందింది. చౌదరి మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్ 2018లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించింది. 1వ రన్నరప్ గా కిరీటాన్ని పొందింది. 2021లో తెలుగు చిత్రం ఇచ్చట వాహనములు నిలుపరాదుతో తెరంగేట్రం చేసింది. మొదటి సినిమాతోనే ఆకట్టుకున్న ఈ బ్యూటీకి అవకాశాల పరంగా కొదవేమీ లేదు. అయితే సెలక్టివ్ గా కెరీర్ ని ముందుకు నడిపిస్తోంది.

నిత్యామీనన్ ప్రెగ్నెంట్..తెర వెనుక స్టోరీ ఇదీ!

కెరీర్ ప్రారంభం నుంచి మలయాళ హీరోయిన్ నిత్యమీనన్ కథాబలమున్న చిత్రాల్లో నటిస్తూ తెలుగు తమిళ మలయాళ భాషల్లో నటిగా తన ప్రత్యేకతని చాటుకుంటోంది. తెలుగులో ఈ ఏడాది పవర్ స్టార్ పవన్ కల్యాణ్తో కలిసి భీమ్లానాయక్ మూవీలో నటించింది. త్రివిక్రమ్ స్క్రీన్ ప్లే మాటలు అందించిన ఈ సినిమాకు సాగర్ కె. చంద్ర దర్శకత్వం వహించాడు. ఇక మలయాళంలో తొలిసారి మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతితో కలిసి 19 (1)(a)లో విభిన్నమైన పాత్రలో నటించి ఆకట్టుకుంది. ఇక తమిళ హీరో ధనుష్ తో కలిసి తొలి సారి తిరు చిత్రాంబలంలో నటిస్తే ఈ మూవీ ఊహించని విధంగా తమిళ తెలుగు భాషల్లో అనూహ్య విజయాన్ని సాధించి వంద కోట్ల క్లబ్ లో చేర్చింది. తెలుగులో ఈ మూవీని తిరు పేరుతో రిలీజ్ చేశారు. హీరో ధనుష్ కెరీర్ లోనే అత్యధిక వసూళ్లని రాబట్టిన సినిమాగా నిలిచింది. ఇదిలా వుంటే నిత్యామీనన్ తెలుగు హిందీ వెబ్ సిరీస్ లలో నటిస్తున్న నిత్యామీనన్ మలయాళంలో వరుస సినిమాల్లో నిటిస్తోంది. ఈ నేపథ్యంలో నిత్యామీనన్ సోషల్ మీడియా వేదికగా షేర్ చేసిన ఓ పోస్ట్ నెట్టింట వైరల్ గా మారిన విషయం తెలిసిందే. పాల పీక

ప్రెగ్నెన్సీ కిట్ ని షేర్ చేసింది. అంతే కాకుండా ప్రెగ్నెన్సీ కిట్ పాజిటివ్ రిజల్ట్‌ని అందించినట్టుగా చూపించడంతో పెళ్లి కాకుండానే నిత్యామీనన్ ప్రెగ్నెంట్ అయిందంటూ వార్తలు మొదలయ్యాయి. ఈ పోస్ట్ చూసిన నిత్యామీనన్ అభిమానులు ఒక్కసారిగా షాక్ కు గురయ్యారు. నిత్యామీనన్ పెళ్లి కాకుండానే గర్భవతి కావడం ఏంటని ఆరా తీయడం మొదలు పెట్టారు. అంతే కాకుండా నిత్య పోస్ట్ ని చూసిన వారంతా ఎవరికి తోచినట్టుగా వారు కామెంట్ లు చేయడం మొదలు పెట్టారు. దీంతో నిత్యా గర్భవతి అయిందంటూ ప్రచారం మొదలైంది. పుట్టబోయే బిడ్డకు తండ్రి ఎవరు అంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. మరికొందరు మాత్రం పెళ్లి కాకుండానే నిత్యా మీనన్ కు ప్రెగ్నెన్సీ రావడం ఏంటని సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. దీంతో నిత్యా షేర్ చేసిన ప్రెగ్నెన్సీ న్యూస్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయిపోయింది. అయితే కొంత మంది మాత్రం నిత్యామీనన్ ఓ సినిమా ప్రచారం కోసం చేస్తున్న జిమ్మిక్కేనని తేల్చేశారు.

యస్ కొంత మంది ఊహించనట్టే నిత్యామీనన్ తన సినిమా ప్రచారంలో భాగంగా ఈ పోస్ట్ ని షేర్ చేసినట్టుగా తెలిసింది. నిత్యామీనన్ తరహాలోనే మరో నటి పార్వతి తిరుఒత్తు కూడా షేర్ చేయడంతో అసలు విషయం బ యటపడింది. వందర్ వుమెన్ సినిమాలో పార్వతి తిరుఒత్తుతో కలిసి నిత్యామీనన్ నటిస్తోంది. ఈ మూవీలో ఈ ఇద్దరు గర్భం దాల్చిన యువతులగా కనిపించబోతున్నారు. ఇందులో భాంగానే నిత్యామీనన్ ప్రెగ్నెన్సీ కిట్ తో పాటు పాలపీకని షేర్ చేసి అందరికి ట్విస్ట్ ఇవ్వడం విశేషం.

కూల్ రూఫ్.. మీటర్‌కు రూ.300 మాత్రమే ఖర్చు

హైదరాబాద్: వాతావరణంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావం ఇళ్లు, వాణిజ్య భవనాలు, కార్యాలయాలపై తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'తెలంగాణ కూల్‌రూఫ్ విధానం 2023–28'ను పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కూల్‌రూఫ్ పాలసీ భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే కార్యక్రమమన్నారు. విధానాలు రూపొందించడం, చట్టాలు చేయడం చాలా సులువని.. కానీ వాటి అమలు కష్టమని అభిప్రాయపడ్డారు. "కూల్‌రూఫ్ వల్ల మీటర్‌కు రూ.300 మాత్రమే ఖర్చు అవుతుంది.

కరెంట్ బిల్లులు తగ్గే అవకాశం ఉన్నందున పెట్టిన పెట్టుబడి తిరిగివస్తుంది. కూల్‌రూఫ్ కోసం ముందుకొచ్చేవారికి శిక్షణ అందిస్తాం. త్వరలో 'మననగరం' అనే కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించాం. దీనిలో భాగంగా భవన నిర్మాణ వ్యర్థాలను సేకరించి కూల్‌రూఫ్‌కు ఉపయోగిస్తాం" అని కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ నగరంలో 100 చ.కి.మీ. మేర, రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతంలో 300 చ.కి.మీ. విస్తీర్ణంలో కూల్‌రూఫ్స్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. చలువ పైకప్పులను ఏర్పాటు చేసుకునేలా ప్రజలను ప్రోత్సహించడం ద్వారా ఉష్ణోగ్రతలు తగ్గించడం, నగరాల వారీగా ఈ విధానాన్ని అమలు చేసేందుకు వీలుగా ఏజెన్సీలతో సమన్వయం, వీటి కోసం పనిచేసే సిబ్బందికి నైపుణ్య శిక్షణ వంటివి కొత్త విధానంలో ఉండనున్నాయి.

కూల్‌రూఫ్ విధానం అంటే.. కూల్‌రూఫ్ విధానంలో నిర్మించే పైకప్పు వల్ల గది ఉష్ణోగ్రతలు బాగా తగ్గుతాయి. ఆధునిక సాంకేతికతతో పైకప్పులకు ఉపయోగించే సామగ్రిలో కొన్ని మార్పులు చేయడం, ప్రత్యేక రసాయనాల వినియోగంతో 5 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు ఉష్ణోగ్రత తగ్గుతుందని అంచనా.

దీనివల్ల సూర్యకిరణాలు తిరిగి వాతావరణంలోకే పరావర్తనం చెందడం ద్వారా ఇంటి లోపలకు వేడి రావడం తగ్గుతుంది. ఇప్పటికే నిర్మించిన భవనాలపై కూల్‌రూఫ్ ఏర్పాటుకు పలు పద్ధతులున్నాయి. శ్లాబ్‌పైన కూల్ పెయింట్ వేయడం, వినైల్ షీట్లను పరచడం, టైల్స్ వేసుకోవడం, భవనాల పైన మొక్కల పెంపకం, సౌర విద్యుత్తు ఫలకాల ఏర్పాటు వంటి చర్యలతో ఉష్ణోగ్రతలు తగ్గుతాయి.

టెన్త్ పేపర్ లీక్ చేసిన ఈయన ఎవరంటే...

వికారాబాద్: పదో తరగతి పరీక్షలు ప్రారంభమైన మొదటి రోజే లీకేజ్ అవడం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపుతోంది. వికారాబాద్ జిల్లా తాండూర్ లో పరీక్ష మొదలైన ఏడు నిమిషాలకే తెలుగు ప్రశ్నాపత్రం వాట్సప్ గ్రూప్‌లలో చెక్కర్లు కొట్టింది.

తాండూర్ మండల కేంద్రంలో ప్రశ్నాపత్రం లీకైనట్లు తెలుస్తోంది. పేపర్ లీక్ విషయం తెలిసిన వెంటనే పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. తాండూరు ప్రభుత్వ నెంబర్ వన్ స్కూల్లో పేపర్ లీకేజ్ అయినట్లు పోలీసులు గుర్తించారు. స్కూల్‌కు చేరుకున్న పోలీస్ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు బందెప్ప ఫోన్ నుంచి వాట్సప్‌లో షేర్ అయినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ప్రస్తుతం ఉపాధ్యాయుడు బందెప్ప పోలీసుల అదుపులో ఉన్నారు. పేపర్ లీకేజ్‌పై బందెప్పను పోలీసులు ప్రశ్నిస్తున్నారు.

అయితే మొదట పేపర్ లీక్ కాలేదంటూ విద్యాశాఖ అధికారులు చెప్పుకొచ్చారు. పేపర్ లీకేజ్ వార్తలను పోలీసులు నిర్ధారించారు. మరోవైపు ఇదే విషయంపై కలెక్టర్ నారాయణ రెడ్డితో డీఈవో రేణుకా దేవి సమావేశమయ్యారు.

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్యకు నివాళులర్పించిన ముఖ్యమంత్రి కేసీఆర్

హైదరాబాద్: తెలంగాణ స్వయం పాలన ఆకాంక్షలకు ఊపిరిలూదిన సాయుధ పోరాట కాలపు తొలి అమరుడు దొడ్డి కొమురయ్య త్యాగం చిరస్మరణీయమని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతిని పురస్కరించుకుని సీఎం కేసీఆర్ వారి త్యాగాలను స్మరించుకున్నారు. ఆయన అమరత్వం అందించిన చైతన్య స్పూర్తి.. మలి దశ తెలంగాణ ఉద్యమంలోనూ కొనసాగిందని సీఎం అన్నారు. తెలంగాణ స్వరాష్ట్ర సాధనకోసం పార్లమెంటరీ పంథాలో సాగిన శాంతియుత పోరాటంలో సబ్బండ వర్గాలు తమ వంతుగా ఉద్యమించాయని, తమ ఆకాంక్షలను చాటడంలో దొడ్డి కొమరయ్య స్పూర్తి ఇమిడి వున్నదని వెల్లడించారు. అమరవీరుల త్యాగాలను తెలంగాణ ప్రభుత్వం నిత్యం స్మరించుకుంటూ వారి ఆశయ సాధనకోసం శ్రమిస్తున్నదని తెలిపారు. బీసీ కుల వృత్తులను పరిరక్షిస్తూ వారిని ప్రగతి పథంలో నడిపేందుకు వారికి అన్ని విధాలా సాయం అందిస్తున్నదన్నదని చెప్పారు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశాయన్నారు. కుల వృత్తిదారులైన గొల్ల కుర్మల అభివృద్ధికోసం చేపట్టిన గొర్రెల పంపిణీ కార్యక్రమం.. వారి ఆర్థిక స్వావలంబనకు దోహదం చేస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో అధికభాగం లబ్ధిదారులు బీసీ బిడ్డలే కావడం గొప్ప విషయమని సీఎం అన్నారు. ఆత్మగౌరవ భవనాల నిర్మాణాలు, ఆసరా ఫించన్లు, రైతుబంధు సహా అనేక పథకాలు బీసీల ఆత్మగౌరవాన్ని, ఆర్థిక గౌరవాన్ని పెంపొందించాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలతో తెలంగాణలో నేడు బీసీల స్థితిగతులు గుణాత్మకంగా పురోగమించాయని, వారి ప్రగతి సామాజిక ప్రగతికి బాటలు వేసిందన్నారు. నేడు దేశ ఆర్థిక వ్యవస్థకే వెన్నుదన్నునందించే రీతిలో తెలంగాణ సబ్బండ కులాలు ముందంజలో ఉన్నాయని సీఎం కేసీఆర్ వెల్లడించారు. నాటి సాయుధపోరాట కాలం నుంచి నేటి మలి దశ తెలంగాణ ఉద్యమకాలం దాకా దొడ్డి కొమురయ్య వంటి తెలంగాణ అమరుల త్యాగాలను నిత్యం స్మరించుకుంటూ, వారి ఆశయాల సాధనలో ముందుకు సాగుతున్నామని సీఎం అన్నారు. అమరుల సంస్మరణార్థం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న అమర జ్యోతి త్వరలోప్రారంభం కానున్నదని చెప్పారు. దొడ్డి కొమురయ్య త్యాగానికి గుర్తుగా వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తూ వారికి ఘన నివాళులర్పిస్తున్నదని సీఎం కేసీఆర్ తెలిపారు.

వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆలోచనను మానాలి : మంత్రి తలసాని



వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేసేందుకు కేంద్రం కుట్రలు పన్నుతోందని, ఆ ఆలోచనను మానుకోవాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. ఆదివారం విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సభ్యులు మంత్రి శ్రీనివాస్ యాదవ్‌ను వెస్ట్ మారేడ్‌పల్లిలోని నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. తాము చేస్తున్న పోరాటానికి మద్దతు తెలపాలని మంత్రిని కోరారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం లాభాల్లో ఉన్న అన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తూ లక్షలాది మంది బతుకులను రోడ్డున పడేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతోమంది పోరాటాలు, త్యాగాల ఫలితంగా ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమకు కేంద్ర ప్రభుత్వం రుణ సౌకర్యం కల్పించకుండా, రా మెటీరియల్ సరఫరా చేయకుండా పరిశ్రమను నష్టాల్లోకి తీసుకెళ్లి.. ప్రైవేట్ పరం లేదంటే.. తన కార్పోరేట్ అనుచరుల పరం చేసేందుకు కుట్రలు చేస్తోందని విమర్శించారు. 780 రోజుల నుంచి తెలుగు రాష్ట్రాల ప్రజలు, ప్రభుత్వాలు వ్యతిరేకిస్తున్నా, పోరాటాలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గం అన్నారు. మంత్రిని కలిసిన వారిలో పరిరక్షణ కమిటీ సభ్యులు రాజ, శివ, శ్రీరామ్, సునీల్, మురళి, హరీశ్ తదితరులు ఉన్నారు.

ఎస్సై, ఏఎస్సై తుది పరీక్ష హాల్‌టికెట్లు విడుదల



హైదరాబాద్: తెలంగాణలో ఎస్సై, ఏఎస్సై తత్సమాన ఉద్యోగాల భర్తీకి ఈ నెల 8, 9 తేదీల్లో జరిగే తుది పరీక్ష హాల్‌టికెట్లు విడుదలయ్యాయి. అభ్యర్థులు రాష్ట్ర పోలీస్ నియామక బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో తమ వివరాలను ఎంటర్ చేసి హాల్ టికెట్లు పొందొచ్చు. ఈ ఉద్యోగాలకు సంబంధించి ఇప్పటికే ప్రాథమిక రాత పరీక్ష, దేహదారుఢ్య పరీక్షలు పూర్తిచేసుకున్న అభ్యర్థులు.. ఏప్రిల్ 8, 9 తేదీల్లో తుది పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ఉదయం 10 గంటల నుంచి 1 వరకుబీ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ పరీక్షలు జరగనున్నట్టు ఇటీవల అధికారులు ఓ ప్రకటనలో వెల్లడించారు. తుది పరీక్ష రాసే అభ్యర్థులంతా ఈరోజు నుంచి నుంచి 6వ తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకూ హాల్‌టికెట్లు www.tslprb.in వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఏదైనా కారణంతో హాల్‌టికెట్ డౌన్‌లోడ్ కాకపోతే support@tslprb.inకు మెయిల్ చేయాలని, లేదంటే 9393711110, 9391005006 నంబర్లలో సంప్రదించాలని నియామక మండలి ఛైర్మన్ ఇటీవలే తెలిపారు. హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత దాన్ని ఏ4 సైజ్ కాగితంపై ప్రింట్ తీసుకొని, నిర్ణీత ప్రాంతంలో పాస్‌పోర్ట్ ఫొటో అంటించాలని సూచించారు. ఫొటో గుర్తింపులేని వారిని అనుమతించబోమని తేల్చి చెప్పారు. ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ భాషా పరీక్షలను తుది ఎంపికకు పరిగణించకున్నా... వీటిలో కనీస మార్కులు సాధించాల్సి ఉంటుందని ఛైర్మన్ వెల్లడించారు. ఈ పరీక్షలను హైదరాబాద్, వరంగల్, కరీంనగర్‌లలో నిర్వహించనున్నారు.

టీఎస్‌పీఎస్సీ అంశంపై రాష్ట్రపతికి లేఖ రాసిన ఆర్ఎస్ ప్రవీణ్

హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ అంశంపై భారత రాష్ట్రపతికి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సోమవారం లేఖ రాశారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ పేపర్ లీకేజీ కేసును సీబీఐకి అప్పగించి సమగ్ర విచారణ జరపించాలని లేఖలో పేర్కొన్నారు. లీకేజీ వెనుక ముఖ్యమంత్రి కార్యాలయం పాత్ర ఏమిటో తేల్చాలని, ప్రస్తుత కమీషన్‌ను భర్తరఫ్ చేయాలని రాష్ట్రపతిని ప్రవీణ్ కుమార్ లేఖలో కోరారు.

అప్పుడు కించపరిచి.. ఇప్పుడు డ్రామా చేసేందుకా..?: రాహుల్‌పై భాజపా విమర్శలు

దిల్లీ: పరువునష్టం కేసులో తనకు మెట్రోపాలిటన్ కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించడాన్ని కాంగ్రె అగ్రనేత రాహుల్ గాంధీ సవాల్ చేయనున్నారు. దీనికోసం సోమవారం సూరత్‌లోని సెషన్స్‌కోర్టులో అప్పీలు దాఖలు చేసేందుకు ఆయన సిద్ధమయ్యారు. ఆయన సోదరి ప్రియాంకా గాంధీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇతర నేతలు రాహుల్ వెంట వెళ్లనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. దీనిపై భాజపా విమర్శలు గుప్పించింది. రాహుల్ మొదట ఓబీసీ వర్గాన్ని అవమానించారని, ఇప్పుడేమో కుటుంబం, పార్టీ నేతలతో కలిసి డ్రామా చేయడానికి కోర్టుకు వెళ్తున్నారని దుయ్యబట్టింది. 'వారందరినీ తీసుకెళ్లాల్సిన అవసరం ఏముంది. ఇది వారి నైతికతకు నిదర్శనం. ఈ విధంగా వ్యవహరించి.. మీరు అగ్నికి ఆజ్యం పోస్తున్నారు. ఓబీసీ వర్గం మనోభావాలను దెబ్బతీస్తున్నారు.

ఈ విషయంలో.. రాహుల్ గాంధీ క్షమాపణలు చెప్పనన్నారు. రాహుల్, బాధ్యత ఒకే దగ్గర ఉండవు. రఫేల్ అంశంపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు క్షమాపణలు చెప్పిన ఆయన.. అదేవిధంగా ఇప్పుడు ఈ వ్యవహారంపై క్షమాపణలు చెప్పాలి. ఓబీసీ, న్యాయవ్యవస్థపై ఎందుకంత విద్వేషం..?' అని కమలం పార్టీ ప్రతినిధి సంబిత్‌పాత్రా తీవ్రంగా విరుచుకుపడ్డారు. 'కాంగ్రెస్‌లో రెండు వైఖరులు కనిపిస్తాయి. మాజీ ప్రధాని నరసింహారావు విషయంలో కాంగ్రెస్ స్పందించిందా..? అదే కుటుంబ సభ్యుల విషయంలో అయితే నిరసన చేస్తున్నారు. ఎందుకంటే మిగిలినవారు కుటుంబ సభ్యులు కాదుకదా..! వారు తమ కుటుంబం అత్యున్నతమైందని భావిస్తుంటారు'అని మండిపడ్డారు. రాహుల్ ఈ రోజు మధ్యాహ్నం మూడు గంటలకు సూరత్‌లోని సెషన్స్ కోర్టుకు వెళ్తారని ఆయన తరఫు న్యాయవాది కిరిట్ పన్వాలా తెలిపారు. తనని దోషిగా తేలుస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును పక్కన పెట్టాలని ఆయన వ్యాజ్యంలో కోరనున్నట్లు సమాచారం. సెషన్స్‌కోర్టు తీర్పు ఇచ్చే వరకూ ట్రయల్ కోర్టు తీర్పుపై మధ్యంతర స్టే ఇవ్వాలని కూడా రాహుల్ విజ్ఞప్తి చేసే అవకాశం ఉంది.

సీఎం కేసీఆర్ లేఖ రాసిన సీఎల్పీ నేత భట్టి

మంచిర్యాల: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క హాత్ సే హాత్ జోడో యాత్ర కొనసాగుతోంది.

మండలంలోని దాంపూర్ నుంచి బూరుగుపల్లి, పోతనపల్లి గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. నేడు సోమవారం మందమర్రి టౌన్‌లో యాత్ర కొనసాగుతోంది. యాత్రలో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క సోమవారం బహిరంగ లేఖ రాశారు. లేఖలో "పోడు రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 18రోజులుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పాదయాత్ర చేస్తున్నాను..ఏ ఊరికి వెళ్లినా పోడు రైతులు పట్టాల కోసం ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన పత్రాలు తప్ప మళ్ళీ రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పోడు రైతులందరికి పట్టాలు ఇవ్వాలి..వారిపై ఉన్న కేసులను ఎత్తేయాలని" భట్టి విక్రమార్క లేఖలో పేర్కొన్నారు. యాత్రలో పాల్గొనేందుకు మందమర్రి కాంగ్రెస్ నాయకులు తరలి వెళ్తున్నారు.

రైతు సమస్యలపై హెచ్ఆర్సీకి టీ కాంగ్రెస్ నేతల ఫిర్యాదు..

TELANGANA
STATE HUMAN RIGHTS COMMISSION
HYDERABAD
తెలంగాణ
రాష్ట్ర మానవ హక్కుల కమిషన్
హైదరాబాద్

హైదరాబాద్: రైతు సమస్యలపై హెచ్ఆర్సీకి తెలంగాణ కాంగ్రెస్ నేతలు పొన్నం ప్రభాకర్, కోదండ రెడ్డి, అన్వేష్ రెడ్డి ఫిర్యాదు చేశారు. ధరణి సమస్యలతో రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. హెచ్ఆర్సీ కలగజేసుకుని రైతులకు న్యాయం చేయాలని కాంగ్రెస్ నేతలు కోరారు. ఈ సందర్భంగా కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ భూ పోరాటాలకు తెలంగాణ పెట్టింది పేరని, ఊరు గొప్ప పేరు దిబ్బలా ధరణి పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. ధరణి సమస్యపై వేల అప్లికేషన్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ధరణి సమస్యపై ఛీఫ్ సెక్రటరీకి, సీఎం కేసీఆర్‌ల దృష్టికి పలు సార్లు తీసుకువెళ్లామన్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో.. రాష్ట్ర హెచ్ఆర్సీకి ఫిర్యాదు చేశామన్నారు. జాతీయ హెచ్ఆర్సీకి కూడా ఫిర్యాదు చేస్తామన్నారు. కాంగ్రెస్ భూములు పంచిపెడితే.. భూధాన్ భూములను హెచ్ఎండీఏ అమ్ముకుంటోందని కోదండ రెడ్డి అన్నారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ధరణితో ఇబ్బంది పడుతున్న వారంతా బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలలో నిలదీయాలని పిలుపిచ్చారు. కాంగ్రెస్ అధికారంలో రాగానే ధరణిని రద్దు చేస్తామన్నారు. రైతులను ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిప్పుకోవడం మానవ హక్కుల ఉల్లంఘనేనని అన్నారు. రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ.. నిజమైన హక్కు దారులలో చాలా మందికి ధరణిలో లబ్ది జరగలేదని ఆరోపించారు. సమస్య ఉందని తెలిసి మరీ ప్రభుత్వం అలసత్వం వహిస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు పడుతున్న ఇబ్బందులను వివరాలతో సహా హెచ్ఆర్సీకి ఇచ్చామన్నారు. ధరణి సమస్యలపై బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలలో రైతులు నిలదీయాలని అన్వేష్ రెడ్డి పిలుపిచ్చారు.

డీజీపీ కార్యాలయంలో దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు

హైదరాబాద్ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను డీజీపీ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీజీ అభిలాష బిస్త్, ఐజీ కమల్ హాసన్ రెడ్డి, షా నవాజ్ కాసీం, డీఐజీ రమేష్ రెడ్డి తదితరులు హాజరై దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూల మాలలేసి నివాళులర్పించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87,
Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : VISHWANATH V, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com